



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 18 మంగళవారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 182
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# గంటకి వెయ్యి కిమీ జర్నీ!

- అందర్నీ ఆశ్చర్యపరుస్తున్న హైపర్‌లూప్ టెక్నాలజీ
- మద్రాస్ ఐఐటీలో హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగంలో అభివృద్ధి
- తాజాగా ప్రయాణించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- హైపర్ లూప్ టెక్నాలజీ అభివృద్ధికి ఐఐటీ మద్రాస్‌కు 8.34 కోట్లు
- ఎలన్ మస్క్ ఆలోచనలకు ప్రతిరూపమే హైపర్ లూప్ టెక్నాలజీ

2



**చెన్నై-నవభూమిబ్యూరో**

2013లో ఎలన్ మస్క్ హైపర్ లూప్ టెక్నాలజీని తెరపైకి తెచ్చాడు. అప్పటినుంచి ప్రపంచ వ్యాప్తంగా దీనిపై పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. మన దేశంలో మద్రాస్ ఐఐటీలో హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగం ఉంది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తాజాగా మద్రాస్ ఐఐటీకి వెళ్లారు. అక్కడ ఉన్న హైపర్‌లూప్ టెస్టింగ్ విభాగాన్ని సందర్శించారు. హైపర్‌లూప్ ట్యూబ్‌కు సంబంధించి అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతో ఆసక్తిగా దాని పని తీరును పరిశీలించారు. హైపర్‌లూప్ ట్యూబ్ పాడ్ ప్రయాణించిన తీరుకు ఆయన ఖుషీ అయిపోయారు. సంతోషంతో కేరింతలు కొట్టారు. హైపర్‌లూప్ ట్యూబ్‌కు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ' మద్రాస్ ఐఐటీలో హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగం 410 మీటర్ల పొడవుతో ఉంది. అది ఏషియాలోనే పొడవైన హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగంగా పేరుగాంచింది. ఆ పొడవును మరింత పెంచనున్నాము. అప్పుడది ప్రపంచంలోనే పొడవైన హైపర్‌లూప్ ట్యూబ్ టెస్టింగ్ విభాగంగా ప్రసిద్ధికెక్కుతుంది' అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియోపై నెటిజన్లు మిశ్రమంగా స్పందిస్తున్నారు. ముందు లోకల్ ట్రైన్‌లను సక్కాగా నడపండి.. అంటూ కామెంట్లు పెడుతున్నారు.

**ఏడేళ్ల నుంచి శ్రమిస్తున్న ఐఐటీ మద్రాస్..**

మద్రాస్ ఐఐటీ ఏడేళ్లనుంచి హైపర్ లూప్ టెక్నాలజీపై పని చేస్తోంది. పరిశోధనలు చేయడానికి అవసరమైన అన్ని వసతులను కల్పిస్తోంది. అంతేకాదు.. తాజాగా, గ్లోబల్ హైపర్ లూప్ కాంపిటీషన్ పేరిట ఓ కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. రైల్వే శాఖ 2022 మే నెలలో హైపర్ లూప్ టెక్నాలజీ అభివృద్ధి కోసం ఐఐటీ మద్రాస్‌కు 8.34 కోట్ల రూపాయల్ని కేటాయించింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తన సందర్శన సందర్భంగా.. హైపర్ లూప్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు ఇండియా సిద్ధంగా ఉండాలని అన్నారు. హైపర్‌లూప్ టెస్టింగ్ విభాగంలో పరిశోధనలు చేస్తున్న యువతకు ఆయన శు

## తెలంగాణా సిఫార్సు లేఖలపై
# టీటీడీ కీలక నిర్ణయం

- 24 నుండి తెలంగాణా సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం
- సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం..టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చొరవతో అధికారులు అమలు
- సోమ,మంగళవారాల్లో ఈలేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనం
- బుధ,గురువారాల్లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం
- ప్రజాప్రతినిధి ఒకరికి ఒక సిఫార్సు లేఖ మాత్రమే 6 మందికి మించకుండా టీటీడీ దర్శనం

2


ఫైల్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ శుభవార్త చెప్పింది. తెలంగాణా రాష్ట్రం నుండి వచ్చే సిఫార్సు లేఖల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న టీటీడీ ఈ మేరకు కీలక విషయం వెల్లడించింది. మార్చి 24వ తేదీ నుండి తెలంగాణా సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు చేస్తున్నట్టు తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణా నుండి వచ్చిన సిఫార్సు లేఖలను పట్టించుకోలేదు. తెలంగాణా ప్రజాప్రతినిధుల లేఖలు స్వీకరించనున్న టీటీడీ తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక చొరవతో తెలంగాణా ప్రజాప్రతినిధుల లేఖలు స్వీకరించే విధానం అమలు చేయనున్నారు. సోమ, మంగళవారాల్లో తెలంగాణా సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం కేటాయింపు చేస్తున్నట్టు

## రేషన్ కార్డు దరఖాస్తుల
# పరిశీలనకు యాప్

- స్మార్ట్ రేషన్‌కార్డులు జారీకి టెండర్ల ఆహ్వానం
- రేషన్ కార్డుల కోసం చేసిన దరఖాస్తులను
- క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు యాప్ రూపకల్పన



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమ వుతోంది. అర్హులైనవారికి రేషన్ కార్డులను మంజూరు చేయాలని కసరత్తులు చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారిలోనూ అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలి. ఆయా జిల్లాల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో మార్చి 1 నుంచి మిగతా జిల్లాల్లో మార్చి 8 తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని రేవంత్ సర్కార్ ఇప్పటికే నిర్ణయించింది. స్మార్ట్ కార్డు రూపంలో రేషన్‌కార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో జారీ ప్రక్రియ ఆలస్యం కానున్నట్లు తెలిసింది. కొత్త వారితో పాటు ఇప్పటికే రేషన్ కార్డు ఉన్నవారికి సైతం స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ టెండర్లు పిలిచింది. వీరే ఆర్ఐ నుంచి తహసీల్దార్‌కు.. మొబైల్ యాప్‌లో దరఖాస్తుల విచారణ అనంతరం ఆర్ఐ నుంచి తహసీల్దార్‌కు, అక్కడి నుంచి డీఎస్వో లాగిన్‌కు రేషన్ కార్డు దరఖాస్తుదారుల వివరాలు వెళ్తాయి. మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్ లాగిన్ నుంచి మున్సిపల్

## వాలంటీర్ల వ్యవస్థే..
# మనుగడలో లేదు

- వాలంటీర్ల వ్యవస్థపై తేల్చి చెప్పిన ఏపీ సర్కార్
- వాలంటీర్లను రెన్యూవల్స్ చేయని వైసీపీ ప్రభుత్వం
- అలాంటప్పుడు వాలంటీర్ల వ్యవస్థ ఎక్కడ మనుగడ ఎక్కడిది?
- శాసనమండలిలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టీకరణ
- ఎన్నికల సమయంలో పదివేలకు వేతనం పెంచుతామని
- ఎందుకు హామీ ఇచ్చారని సర్కారును నిలదీసిన వైసీపీ ఎమ్మెల్సీలు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో వాలంటీర్ల వ్యవస్థ కొనసాగింపు పై ప్రభుత్వం మరో సారి స్పష్టత ఇచ్చింది. వాలంటీర్లకు కూటమి నేతలు ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే రూ 10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. కాగా, వైసీపీ ప్రభుత్వం అసలు వాలంటీర్ల వ్యవస్థను రెన్యువల్ చేయలేదని.. విధుల్లో లేని వాలంటీర్లను ఎలా కొనసాగిస్తామని మంత్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశం పైన శాసన మండలిలో వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. ప్రభు త్వం నుంచి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్పష్టత ఇచ్చారు. వాలంటీర్ల వ్యవస్థ వైసీపీ హయాంలో మొదలైన వాలంటీర్ల వ్యవస్థపై 2024పైన పెద్ద వివాదమే చోటు చేసు కుంది. తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ల ను కొనసాగిస్తామని.. వారి వేతనం రూ 10 వేలకు పెంచుతా మని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాలంటీర్ల వ్యవస్థపైన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వాలంటీర్ల స్థానంలో సచివాలయ సిబ్బందితో ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కొనసాగిస్తోంది. ప్రభుత్వ సర్వేల నిర్వహణ బాధ్యతలను సచివాలయ సిబ్బందికే అప్పగించారు. దీంతో, కొంత కాలంగా వాలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు విధుల్లో అవకాశం ఇవ్వాలని వినతి పత్రాలు సమర్పించారు. కూటమి నేతల హామీ కాగా, ప్రభుత్వం అసలు వైసీపీ హయాంలోనే వాలంటీర్ల వ్యవస్థ రెన్యువల్ చేయలేదని .. మనుగడలోని వ్యవస్థ కొనసాగింపు... వేతనాల పెంపు ఎలా సాధ్యమని కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశం పైన పలు సందర్భాల్లో అసెంబ్లీలోనూ ప్రస్తావనకు వచ్చింది. కూటమి

## జనంలోకి..
# బీఆర్ఎస్

- కేటీఆర్ తాజా నిర్ణయం..మారుతున్న లెక్కలు
- త్వరలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలకు కేటీఆర్ సన్నద్ధం
- జిల్లాల్లో పర్యటించి పార్టీ సమావేశాలు
- పార్టీ బలోపేతానికి పటిష్టమైన వ్యూహం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అసెంబ్లీ జరుగుతున్నవేళ అధికార - ప్రధాన ప్రతిపక్షాలు కొత్త వ్యూహాలతో ముందుకు వెళు తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెండు కీలక బిల్లులను సభలో ప్రవేశ పెట్టేందుకు సిద్ధమయ్యారు. బుధవారం సభలో ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించనుంది. ఈ సమయంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక నిర్ణయం వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ఇప్పుడు కేటీఆర్ నిర్ణయం రాజకీయంగా ఆసక్తిని పెంచుతోంది. కేటీఆర్ తాజా నిర్ణయం మాజీ మంత్రి కేటీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు
# కేబినెట్ ఆమోదం

- రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చ
- రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ అమలు చేయాలని కేబినెట్ నిర్ణయం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. మంత్రులతో మాట్లాడిన అనంతరం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. జిల్లా యూనిట్‌గా చేయాలని కొంతమంది మంత్రులు కోరారు. అలా చేస్తే న్యాయ పరమైన చిక్కులు వస్తాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి నివేదికను యథాతథంగా ఆమోదిద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## యూనివర్శిటీ పేర్ల మార్పుపై
# రాజకీయాలు చేయవద్దు

- యూనివర్సిటీల పేరు మార్పుపై క్లారిటీ ఇచ్చిన సీఎం రేవంత్..!
- పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు
- అందులో భాగంగానే పేర్లు మార్పు..ఇందులో వివక్ష ఏదీ?
- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందాం
- బల్కంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్‌కు మాజీ సీఎం రోశయ్య పేరు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో వర్సిటీల పేర్లు మార్చడంపై విపక్షాలు చేస్తున్న విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాజకీయాలు కలుషితమయ్యాయో.. నాయకుల ఆలోచనలు కలుషితమయ్యాయో తెలియడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా విడిపోయిన తర్వాత పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నామని అందులో భాగంగానే పేర్లు మార్చడం జరుగుతుందన్నారు. అయితే అందుకు కులాల పేరుతో రాజకీయం చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టిన తర్వాత.. గత పదేళ్లలో యూని వర్సిటీల పేర్లు మార్చడానికి గల కారణాలను వెల్లడించారు. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకుంటు న్నామన్నారు ముఖ్యమంత్రి. రాష్ట్ర

# పవన్‌కు దక్షిణాది బాధ్యతలు?

- దక్షిణాదిన బలపడేందుకు బీజేపీ భారీ స్కెచ్?
- బీజేపీ సౌత్ ఆపరేషన్ ముమ్మరం
- సినీ గ్లామర్ ఉన్న పవన్‌ను ఉపయోగించుకునే ఆలోచన
- దక్షిణాదిన అన్ని భాషల్లో పవన్ సినిమాలు డబ్
- అందువల్ల పవన్‌కు దక్షిణాది బాధ్యతలు అప్పగించే యోచన

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దక్షిణాదిన బలపడటం కోసం బీజేపీ తమ నమ్మకమైన మిత్రుడు పవన్ కల్యాణ్ ను వాడుకోవాలని చూస్తోందని ఢిల్లీ వర్గాల సమాచారం. బీజేపీ ఆపరేషన్ సౌత్ ముమ్మురం చేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణాదిలో పెద్దగా ప్రభావం చూపలేని బీజేపీ.. ఆయా రాష్ట్రాలపై పట్టుబిగించేందుకు ప్రాంతీయ పార్టీలపై ఆధారపడాల్సివస్తోంది. ముఖ్యంగా దక్షిణాదిలో ఉన్న ఐదు రాష్ట్రాల్లో కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే బీజేపీ భాగస్వామ్యంతో ప్రభుత్వం కొనసాగుతోంది. గతంలో కర్ణాటకలో ఆ పార్టీ సొంతంగా అధికారంలోకి వచ్చినా, అక్కడ లింగాయత్ నాయకుడు యడియూరప్ప ప్రభావమే ఎక్కువ అంటుంటారు. ఇప్పుడు ఆయన వయోభారంతో సతమతమవుతుండటంతో దక్షిణాదిలో బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రం ఒక్కటీ లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దక్షిణా

## కేటీఆర్‌తో
# తీన్మార్ మల్లన్న భేటీ

- అసెంబ్లీ వేదికగా తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం
- కేటీఆర్, హరీశ్ రావుతో తీన్మార్ మల్లన్న సమావేశం
- బీసీ నేతలతో కలిసి కేటీఆర్‌కు మల్లన్న మెమొరాండం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

అసెంబ్లీ వేదికగా తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ బహిష్కృతనేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్ కుమార్)... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,

## అదానీకి ముంబై
# హైకోర్టు ఊరట!

**రూ.388 కోట్ల మార్కెట్ నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలకు సంబంధించిన కేసు నుండి కోర్టు విముక్తి**

2



**ముంబై-నవభూమి:** ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ అదానీలకు బొంబాయి హైకోర్టు సోమవారం భారీ ఊరటనిచ్చింది. దాదాపు రూ.388 కోట్ల మార్కెట్ నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలకు సంబంధించిన కేసు

# పోసానిపై టీడీపీ ఆఫీసులో ఫిర్యాదు


- ఉద్యోగం పేరుతో పోసాని 9 లక్షల మోసం..!
- కల్లూరుకు చెందిన కె.సత్యనారాయణశెట్టి అనే పోసానిపై ఫిర్యాదు
- టీడీపీ కార్యాలయంలో ప్రజావినతుల స్వీకరణలో ఫిర్యాదు
- హైదరాబాద్ గచ్చిబౌలిలో కేసు పెట్టినా న్యాయం జరగలేదన్న శెట్టి

**కర్నూలు-నవభూమిబ్యూరో:** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో కూటమి పార్టీల నేతలపై అనుచిత వ్యాఖ్యల కేసులో వరుస కేసులతో ఉక్కిరిబిక్కిర వుతున్న టాలీవుడ్ నటుడు పోసాని కృష్ణమురళికి మరో షాక్ తగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో కేసుల్ని తిరగతోడి ఆయనపై వరుస కేసులు నమోదు చేస్తుండగా.. ఇప్పుడు ఆయనపై ఏకంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలోనే ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం కల్లూరుకు చెందిన కె.సత్యనారాయణ శెట్టి అనే వ్యక్తి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో పోసాని కృష్ణమురళిపై ఫిర్యాదు చేశాడు. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని గతంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న సినీ నటుడు పోసాని కృష్ణమురళీ, మహేష్ అనే వ్యక్తులు తన వద్ద నుండి రూ. 9 లక్షలు తీసు కొని మోసం చేశారని ఆరోపించారు. ఈ మో సంపై తాను హైదరాబాద్ గచ్చిబౌలిలో కేసు పెట్టినా తనకు ఎటువంటి న్యాయం జరగలేదని సత్యనారాయణశెట్టి ఆవేదన వ్యక్తం చేశాడు. డబ్బులు మోసపోవడంతో ఐదేళ్లనుండి ఇంటికి కూడా పోలేక, గుంటూరులో కూలి పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నానని తెలిపాడు. తనకు ఇప్పుడు చావే శరణ్యమని, దయ చేసి తనకు రావాల్సిన డబ్బులను పోసాని నుండి ఇప్పించి న్యాయం చేయాలని నేతలు కోరారు.



# యువతరం నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

**హుస్నాబాద్ -నవభూమి:** గ్రామీణ ప్రాంత విద్యార్థులను నేటి ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం తదితర అంశాలపై ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సైనోహబ్ అనే సంస్థ ఆధ్వర్యంలో 2024 డిసెంబరు నుంచి ఈ తరగతులు జరుగుతున్నాయి. కళాశాలలోని కెరియర్ గైడెన్స్‌సెల్ ఆధ్వర్యంలో జరిగే ఈ తరగతుల్లో సైనోహబ్‌కు చెందిన నిపుణులు విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. హుస్నాబాద్ డిగ్రీ కళాశాలకు చెందిన 100 మంది, పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 50 మంది.. మొత్తం 150 మంది విద్యార్థులు ఈ తరగతులకు హాజరవుతున్నారు. ఆరు నెలల పాటు సాగే ఈ శిక్షణకు ప్రభుత్వం రూ. కోటీ వరకు ఖర్చు చేస్తోంది. ఈ తరగతుల కోసం ప్రత్యేక సిలబస్ అమలు చేస్తున్నారు. తరగతి గదుల్లో ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. అలాగే, సుమారు రూ.30 లక్షల వ్యయంతో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌నూ ఇటీవల ప్రారంభించారు. విద్యార్థులది గ్రామీణ నేపథ్యం కావడంతో తొలుత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మను చౌదరి.. శిక్షణ తరగతుల్లో విద్యార్థులు ఆంగ్లంలో చేసిన ప్రసంగాలను చూసి అబ్బురపడ్డారు. విద్యార్థులు మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు.



## హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ కొరడా



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెంటనే యాక్షన్ తీసుకుంటున్నారు. తాజాగా జూబ్లీహిల్స్, రహమత్ నగర్‌లో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. రోడ్డును ఆక్రమించి నిర్మించిన వైన్ షాప్‌తో పాటు షెడ్లను నేలమట్టం చేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, స్థానికుల ఫిర్యాదుతో అక్రమాలను కూల్చివేశారు. గతంలో పలుమార్లు నోటీసులు ఇచ్చిన వైన్ షాపుల నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారుల కూల్చివేతలపై ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

## ఓయూ పరిధిలో పీజీ కోర్సుల వన్ టైం ఛాన్స్ పరీక్షా తేదీల ఖరారు

**తార్నాక-నవభూమి :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ కోర్సుల వన్ టైం ఛాన్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ వన్ టైం ఛాన్స్ బ్యాక్ లాగ్ పరీక్షలను ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ లో చూసుకోవాలని సూచించారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆగస్టులో జరిగిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాక్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ %www.osmania.ac.in% లో చూసుకోవాలని సూచించారు.

## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో వేగవంతంగా రెస్క్యూ ఆపరేషన్.. మరోసారి టన్నెల్లోకి క్యాడర్ డాగ్స్



**అచ్చంపేట-నవభూమి:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోని డీ1, డీ2 ప్రదేశాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. టన్నెల్లో చిక్కుకున్న మిగిలిన ఏడుగురిని గుర్తించడానికి రెస్క్యూ ఆపరేషన్ 24వ రోజుకు చేరుకున్నది. డీ1 ప్రదేశంలో నీటి ఊట భారీగా రావడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఇబ్బందిగా మారింది. ఏడుగురి మృతదేహాలను గుర్తించడానికి సోమవారం ఉదయం రెస్క్యూ బృందాలతో పాటు కేరళకు చెందిన క్యాడర్ డాగ్స్ లోపలికి వెళ్లాయి.సోమవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ , సహాయక బృందాల ఉన్నతాధికారులతో సహాయక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్నవారు ఉన్న ప్రదేశంగా డీ1, డీ2 ప్రదేశాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేశామన్నారు.సహాయక చర్యల్లో అడ్డంకిగా మారుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ భాగాలను తొలగించే పనులు కొనసాగిస్తూ, ఎస్కావేటర్, రెట్టింపు సహాయక బృందాలతో మట్టిని తొలగించే పనులు వేగవంతం చేసినట్లు వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు, డీ 1, డీ2 ప్రదేశాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు తెలియజేశారు.ప్రమాద ప్రదేశంలో నీటిని తొలగించేందుకు డి-వాటరింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ర్యాట్ హోల్ మైనర్స్, క్యాడర్ డాగ్స్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే, జీఎస్ఐ, బృందాల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వీ యాదవ్‌కు బెయిల్

**హైదరాబాద్-నవభూమి:** పల్స్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ పీ రేవతి, న్యూస్ రిపోర్టర్ బండి సంధ్య అలియాస్ తన్వీ యాదవ్‌కు బెయిల్ మంజూరైంది. ఈ ఇద్దరు మహిళా జర్నలిస్టులకు బెయిల్ మంజూరు చేస్తూ నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రూ. 25 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ప్రతి సోమ, శుక్రవారం విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆర్డర్ కాపీలు అందిన వెంటనే.. చంచల్‌గూడ జైలు నుంచి విడుదల కానున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన ఓ రైతు వీడియోను పోస్ట్ చేయడమే పెద్ద నేరమైంది. ప్రజా సమస్యలను తమ చానల్ ద్వారా ప్రసారం చేయడమే కాంగ్రెస్ సర్కారుకు కంటగింపుగా మారింది. ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అంటూ మహిళా జర్నలిస్టులను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.గత బుధవారం తెల్లవారుజామున 4గంటలకే ఫైనాన్స్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న 'పల్స్ న్యూస్ బ్రేక్' చానల్ జర్నలిస్ట్ రేవతి ఇంటికి 18 మంది పోలీసులు చేరుకున్నారు. మఫ్టీలో వచ్చిన పోలీసులు జర్నలిస్ట్ రేవతిని అరెస్టు చేస్తున్నామంటూ తన ఫోన్‌తోపాటు ఆమె భర్త ఫోన్‌ను లాక్కున్నారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా ఓ్రైతు మాట్లాడిన వీడియోను తన యూట్యూబ్ చానల్‌లో పోస్టు చేసినందుకు అరెస్టు చేస్తున్నట్టు ఆమెకు నోటీసు ఇచ్చారు. అదే సమయంలో కొత్తూరులో మరో మహిళా జర్నలిస్ట్ సంధ్య అలియాస్ తన్వీ యాదవ్ ఇంటికి పోలీసులు వెళ్లి ఆమెను కూడా అరెస్ట్ చేశారు. అరెస్టుల అనంతరం వీరిద్దరిని 8గంటల పాటు రహస్యంగా విచారించారు.

## టేస్టీ తేజ, విష్ణుప్రియలపై కేసులు నమోదు.. మరో 9 మందిపై కూడా



**హైదరాబాద్-నవభూమి:**వ్యూస్ కోసం బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న యూట్యూబర్లపై కేసులు నమోదయ్యాయి. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ డబ్బులు తీసుకుంటు న్నట్లు పోలీసులు తెలిపారు. వారిలో హర్షసాయి, విష్ణుప్రియ, రీతు చౌదరి, టేస్టీ తేజతో పాటు మొత్తం 11 మందిపై సిటీ పోలీసులు కేసులు నమోదు చేశారు.బెట్టింగ్ యాప్స్ బారిన పడి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అయితే ఈ యాప్స్‌ను కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌లు ప్రమోట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరిపై ఐపీఎస్ అధికారి, టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి.. అమాయకులను నష్టం చేకూరుస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఇటీవల ప్రకటించిన సజ్జనార్.. తాజాగా సిటీ పోలీసులు11 మంది యూట్యూబర్లపై కేసులు నమోదు చేశారు.

# నిలువురాళ్లు.. యునెస్కో గుర్తింపు కోసం అడుగులు



**హైదరాబాద్-నవభూమి:**ఆసియా ఖండంలోనే ఎక్కడా లేని విధంగా పురాతన, చారిత్రక ప్రాధాన్యత గల నిలువురాళ్ల సంపదను కృష్ణానదీ తీరంలో గుర్తించబడింది. పాలమూరు స్టోన్ హెంజ్‌గా పేరున్న నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు తీసుకొచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే యునెస్కో దీనికి తాత్కాలిక గుర్తింపు ఇచ్చింది. బృహత్ శిలాయుగం కాలం నాటి ఖగోళ పరిశోధనా కేంద్రంగా విరాజిల్లినట్లు చెబుతున్న నిలువురాళ్లను చారిత్రక సంపదగా గుర్తించి పరిరక్షణ చర్యలు చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు కోరుతున్నారు. అదే జరిగితే దేశంలోనే ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో కృష్ణానదీ తీరంలో ఉన్న నిలువురాళ్లకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఈ నిలువురాళ్లకు 3 వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. ఇవి అరుదైన శిలలుగా గుర్తింపు పొందాయి. ఈ శిలలను పూర్వం ఖగోళ శాస్త్ర పరిశోధనా కేంద్రంగా వినియోగించినట్లు.. 1980లో విదేశీ పురాతత్వ శాస్త్రవేత్త ఆల్చిన్ మొదట ప్రకటించారు. దాదాపు 80 ఎకరాల్లో విస్తరించిన ఈ నిలువు రాళ్ల నీడలతో.. వాతావరణ మార్పులను అప్పటి జనం గుర్తించే వారని.. వీటినే కాలమాన పట్టిక గానూ వినియోగించే వారని పరిశోధకులు చెబుతున్నారు.ఇంగ్లాండ్‌లోని విల్‌షైర్ ప్రాంతంలో స్టోన్ హెంజ్‌గా పేర్కొనే నిర్మాణాలను.. ఈ నిలువు రాళ్లు పోలి ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. స్టోన్‌హెంజ్‌ను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిందని.. అదే రీతిలో ఉన్న నిలువు రాళ్లను కూడా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలని.. అందుకవసరమైన కార్యాచరణను ప్రభుత్వం చేపట్టాలనే డిమాండ్లు స్థానికంగా ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. ప్రస్తుత నారాయణపేట జిల్లాలోని కర్ణాటక-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో కృష్ణా మండలం ముడుమాల్ గ్రామంలో కృష్ణానది తీరం వెంబడి బృహత్ శిలా యుగానికి చెందిన చారిత్రక సంపదే ఈ నిలువురాళ్లు.

12 నుంచి 14 అడుగుల ఎత్తున్న గండ శిలలను ఇక్కడ క్రమ పద్ధతిలో పాతారు. దాదాపు 80 ఎకరాల్లో విస్తరించిన ఈ గండ శిలల ప్రాంతాన్ని బృహత్ శిలాయుగంలో ఖగోళశాస్త్ర పరిశోధనా కేంద్రంగా వినియోగించినట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఈ నిలువురాళ్లకు తోడు.. వాటి తరహాలోనే పాతిన దాదాపు మూడు వేల వరకు చిన్న చిన్న రాళ్లు ఇక్కడ ఉన్నాయి. భారీ శిలలతో ఒక వృత్తాకార నిర్మాణం కూడా గతంలో ఉండేది. కాలక్రమంలో రాళ్ల తొలగింపుతో ఆ నిర్మాణం చెదిరిపోయినట్లు తెలుస్తోంది. ఆసియా ఖండంలోనే ఇలాంటి నిలువురాళ్ల సంపద ఎక్కడా లేదని.. పురావస్తు శాఖ అధ్యయనం ద్వారా తెలుస్తోంది.తెలంగాణకే ప్రత్యేకమైన ఒక చారిత్రక సంపదగా పరిరక్షణ చర్యలు చేపట్టి.. దాదాపు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిని రైతు నుంచి కొనుగోలు చేసి.. చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేసింది. ఇంతటి అద్భుతమైన నిలువురాళ్లు తమ ప్రాంతంలో ఉండటంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిలువు రాళ్లకు తాత్కాలికంగా యునెస్కో అవార్డు రావటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. యునెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యూనివర్శిటీ పేర్ల మార్పుపై రాజకీయాలు చేయవద్దు

**(1వపేజీ తరువాయి)**పునర్విభజన తరువాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో పెట్టిన పేర్లతో కొనసాగు తున్న యూనివర్సిటీలకు తెలంగాణలో పేర్లు మార్చామన్నారు. ఒకే పేరుతో రెండు యూని వర్సిటీలు ఉంటే పరిపాలనలో గందరగోళం ఉంటుందని అన్నారు. అందుకే తెలంగాణలోని యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ పేర్లు పెట్టుకుంటున్నామని క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టామన్నా రు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సి టీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు, వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు.. వెంకటేశ్వర వెటర్నరీ యూనివ ర్సిటీకి పీవీ పేరు.. పెట్టుకున్నామని తెలిపారు. అంత మాత్రానా వైఎస్ఆర్, ఎన్టీఆర్‌ను అగౌరవపరిచినట్టు కాదన్నారు. ఇప్పుడు అలానే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు మార్చడం జరుగుతుందన్నారు. ఎవర్ని అవమానపరచడం, తక్కువ చేయడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. గుజరాత్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియం పేరు తొలగించి ప్రధాని మోదీ పేరు పెట్టిన విషయాన్ని బీజేపీ నేతలకు గుర్తు చేశారు. ప్రాణత్యాగాలు చేసిన వారిని తక్కువ చేయడం లేదని వారి ప్రాణత్యా గాన్ని గుర్తించి అందరూ స్మరించుకో వాలన్నా రు. తెలంగాణలో నూతనంగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామన్నారు. ఈ విషయంలో చిత్తశుద్ధి ఉంటే కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలని సూచించారు. బల్కంపేట నేచ ర్ క్యూర్ హాస్పిటల్‌కు మాజీ సీఎం రోశయ్య పే రు పెడతామని సూచించారు. రోశయ్య సేవ లను కీర్తించుకునేలా అక్కడ ఆయన విగ్రహాన్ని కూడా ఆవిష్కరించుకుందాని పిలుపునిచ్చారు.

# వాలంటీర్ల వ్యవస్థే.. మనుగడలో లేదు

**(1వపేజీ తరువాయి)**ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తోంది. ఇక, ఇప్పుడు శాసన మండలిలో వైసీపీ సభ్యులు వాలంటీర్ల అంశం పైన ప్రశ్నించారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఎన్నికలకు ముందు వాలంటీర్ల వేతనాన్ని 10వేలకి పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేసారు. కూటమి అధికారం లోకి వచ్చాక 2,56,000 మంది వాలంటీర్లను తొలగించారని మండిపడ్డారు. ఇవాళ వలంటీర్ వ్యవస్థనే లేదని మంత్రి చెప్పడం వలంటీర్లను మోసం చేయడమేనని విమర్శించారు. 2024 సెప్టెంబర్‌లో వరదలు వచ్చినప్పుడు వాలంటీర్లతో ఎలా డ్యూటీ చేయించారని నిలదీశారు. నవంబర్ 2024 వరకు వాళ్లకి ఐడీలు ఎలా కొనసాగించారని ప్రశ్నించారు. దీనికి కొనసాగింపుగా మరో వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి స్పందించారు. వాలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఎన్నికల్లో చెప్పి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేసారు 2023 ఆగస్టు నుండి వలంటీర్లు వ్యవస్థ లేదని చెప్పటం సరి కాదన్నారు.ఈ వ్యవస్థ లేకపోతే 2024లో మేనిఫెస్టోలో ఎలా పెట్టారని ప్రశ్నించారు. 2024 ఏప్రిల్ లో ఎన్నికల్లో ఊరూరా తిరిగి వాలంటీర్ల జీతాలు పెంచు తామని ఎలా హామీ ఇచ్చారని నిలదీశారు. జీతం పెంచగానే చించినాడా పుతరేకులు ఇవ్వండి అని మంత్రి ప్రచారం చేశారని ఎద్దేవా చేశారు. 2.60 లక్షల మందిని తొలగించడం అన్యాయమని, వాళ్ళు ఉపాధి కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతున్నారని కళ్యాణి ఆందోళన వ్యక్తం చేశారు. మనుగడలో లేదు వాలంటీర్ల వ్యవస్థ మనుగలో లేకపోతే ఎందుకు విపత్తు శాఖ ఆదేశాలు ఇచ్చిందని ప్రశ్నించారు. లేని వారిని ఎలా వరదల్లో వినియోగించారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో వాలంటీర్లు ఎవరూ పనిచేయడం లేదని తేల్చి చెప్పారు. వాలంటీర్లు గౌరవ వేతనాన్ని పెంచే ప్రతిపాదనలు ఉత్పన్నం కాదని స్పష్టం చేసారు. వాలంటీర్లపై వైసీపీ నేతలు మొసలి కన్నీరు కార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లను ఏటా రెన్యువల్ చేసిందని వివరించారు. పర్మినెంట్‌గా ఎందుకు ఇవ్వలేదని మంత్రి ప్రశ్నించారు. వాలంటీర్లపై నిజంగా ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే వారిని ఎందుకు పర్మినెంట్‌గా తీసుకోలేదో చెప్పాలన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం

**బేడ బుడగ జంగాలపై కీలక నిర్ణయం..**

గ్రూప్ 1 కేటగిరిలో రెల్లి ఉపకులాలకు ఒక శాతం, గ్రూప్ 2లో మాదిగ ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్ 3 మాల ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతానికి రాష్ట్రం యూనిట్‌గా అమలు జరపాలని నిర్ణయించారు. రోస్టర్ పాయింట్లను 200గా ప్రభుత్వం నిర్ణయించింది. బేడ బుడగ జంగాలను రెల్లి ఉప కులాల్లో చేర్చాలని ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 20వ తేదీన జాతీయ ఎస్సీ కమిషన్‌కు తీర్మానాన్ని పంపించాలని కేబినెట్ భేటీలో నిర్ణయించారు. 2026 సెన్సెస్ రాగానే జిల్లాల వారీగా అమలు జరిపే అంశాన్ని పరిశీలిద్దామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ నెల అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చించనున్నారు. అదే రోజు తీర్మానాన్ని నేషనల్ ఎస్సీ కమిషన్‌కు పంపాలని కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు.

# పవన్‌కు దక్షిణాది బాధ్యతలు?

**(1వపేజీ తరువాయి)**దిలో విస్తరించాలని బలంగా కోరుకుం టోంది. ఇందుకోసం తమ నమ్మకమైన మిత్రుడు పవన్ కల్యాణ్ ను వాడుకోవాలని చూస్తోందని ఢిల్లీ వర్గాల సమాచారం. ఏపీలో కూటమి ఏర్పడటానికి, తద్వారా కేంద్రంలో అధికారం నిలబడటానికి కీలకమైన పవన్ కు మరింత కీలక బాధ్యతలు అప్పగించాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమ అజెండాను పవన్ కూడా ఆమోదించడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఏపీలో అధికారంలోకి వచ్చిన నుంచి పవన్ సనాతన ధర్మ పరిరక్షణ అంటూ కంకణం కట్టుకున్నారు. దక్షిణాది ఆలయాల సందర్శనతోపాటు ఇటీవల వివాదంగా మారుతున్న హిందీ భాషా విధానంపైనా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యతిరేకిస్తున్న హిందీని పవన్ వెనకేసుకురావడమే కాకుండా స్టాలిన్ తో నేరుగా ఢీకొనడానికి సై అనే సంకేతాలు పంపారు. హిందీ ప్రభావం, ఉత్తరాది నేతల పెద్దరికాన్ని వ్యతిరేకించి తమిళులు పవన్ ను వ్యతిరేకించకపోవచ్చని బీజేపీ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు. దక్షిణాదికి చెందిన పవన్ ఏపీలో అధికారంలోకి వచ్చాక తన సమర్థతను నిరూపించుకుంటున్నారు. పాలనలో పట్టు సంపాదించడమే కాకుండా, జనసేన పార్టీని ఓ ప్రణాళిక ప్రకారం విస్తరిస్తున్నారు. అదే సమయంలో తెలంగాణలోనూ తన ప్రభావం ఉందని చాటిచెప్పేలా అడుగులు వేస్తున్నారు. ఇటీవల జరిగిన జనసేన ఆవిర్భావ సభలో తెలంగాణ జనసేన పుట్టినిల్లు అంటూ ఆయన వ్యాఖ్యానించడం వ్యూహాత్మకమే అంటున్నారు. బీజేపీ పెద్దల సూచనలతో ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో పవన్ ప్రభావం చాటేలా కార్యక్రమాలు రూపొందించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.సినీ అగ్ర కథానాయకుడిగా పవన్ కు మంచి స్టార్ ఇమేజ్ ఉంది. ఇప్పుడు పొలిటికల్ గా కూడా ఆయనకు మంచి ఆదరణే కనిపిస్తోంది. దీంతో తమ టార్గెట్ చేరుకోడానికి పవన్ అయితేనే బెటర్ అనే ఆలోచన బీజేపీలో మొదలైందని అంటున్నారు. దక్షిణాదిలో బీజేపీకి పెద్ద లీడర్లు ఉన్నా, వారు అంతా వారి సొంత రాష్ట్రాలకే పరిమితం అవుతున్నారు.ఆపరేషన్ సౌత్' కోసం పవన్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలని కమల దళం దాదాపు డిసైడ్ అయిందని చెబుతున్నారు.

## గంటకి వెయ్యి కిమీ జర్నీ!

**(1వపేజీ తరువాయి)**భాకాంక్షలు తెలియజేశారు.

**ఎలన్ మస్క్ ఆలోచనే..**

హైపర్ లూప్ టెక్నాలజీని తెరపైకి తెచ్చింది ప్రముఖ వ్యాపార దిగ్గజం ఎలన్ మస్క్. 2013లో హైపర్ లూప్ గురించి కొన్ని విషయాలు వెల్లడించాడు. అయస్కాంత శక్తి నిండిన ఇనుప ట్యూబుల ద్వారా వేగవంతమైన ప్రయాణం సాధ్యపడుతుందని తెలిపాడు. గంటకు 1000 కిలోమీటర్ల స్పీడుతో ప్రయాణం చేయవచ్చని అన్నాడు. 2013 నుంచి ఇప్పటి వరకు హైపర్ లూప్ టెక్నాలజీపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. దాదాపు 12 ఏళ్లు గడుస్తున్నా ఇంకా టెస్టింగ్‌లోనే హైపర్ ల్యూప్ టెక్నాలజీ ఉంది. మరికొన్నేళ్లలో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, కొంతమంది హైపర్ లూప్ టెక్నాలజీ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు.

## రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలనకు యాప్

**(1వపేజీ తరువాయి)**కమిషనర్‌కు, అక్కడి నుంచి డీఎస్వో లాగిన్‌కు వస్తాయి. వీటన్నింటినీ డీఎస్వో పౌర సరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు ఆన్‌లైన్‌లో సమర్పిస్తారు. కార్డుల మంజూరు వివరాలు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్థాయిలో వెల్లడి కానున్నాయి. రేషన్ కార్డుల కోసం చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను సైతం రూపొందించారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో వీలైనంత త్వరగా అప్‌డేట్ చేయనున్నారు. ప్రజా పాలన గ్రామ సభల్లో ఫిబ్రవరి 18 నాటికి రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల సంఖ్యలో దరఖాస్తులు అందాయి. ఈ వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆయా దరఖాస్తుల పరిశీలన బాధ్యతను మున్సిపాలిటీల్లో వార్డు అధికారులకు అప్పగించనున్నారు. మండలాల్లో అయితే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ) చేయనున్నారు. ఎంపిక చేసిన ఆర్ఐలు, వార్డు అధికారులు తమ మొబైల్ ఫోన్‌లో ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇళ్లకు వెళ్లి విచారణ వారికి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సంబంధిత అధికారులు కేటాయించనున్నారు. దరఖాస్తులు యాప్‌లో లభ్యమవుతాయి. వాటి ఆధారంగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేయనున్నారు. ఇందుకు కచ్చితమైన మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఊహించిన దాని కంటే ఎక్కువగానే వచ్చినట్లు అధికారులు చెప్పారు.

## కేటీఆర్‌తో తీన్మార్ మల్లన్న భేటీ

**(1వపేజీ తరువాయి)**హరీశ్ రావుతో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై సభలో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ నేతలను కోరారు. బీసీ నేతలతో కలిసి కేటీఆర్‌కు మల్లన్న మెమొరాండం అందించారు. అలాగే బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించేలా ఢిల్లీ వేదికగా తాము చేయబోయే ధర్నాకు మద్దతు ఇవ్వాల్సిందిగా తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ పార్టీ నేతలను కోరారు. వీరి భేటీపై సోషల్ మీడియాలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.కాగా, పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న కారణంతో మల్లన్నను ఈ నెల 1న పార్టీ నుంచి కాంగ్రెస్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 5న టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఫిబ్రవరి 12లోపు వివరణ ఇవ్వాలని పేర్కొంది. అయితే, తీన్మార్ మల్లన్న నుంచి ఎలాంటి వివరణ రాలేదు. అందుకే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

## అదానీకి ముంబై హైకోర్టు ఊరట!

**(1వపేజీ తరువాయి)**నుండి వారిని కోర్టు విముక్తి చేసింది. 2012లో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఇంకా దాని ప్రమోటర్లైన గౌతమ్ అదానీ, రాజేష్ అదానీలతో సహా 12 మందిపై కుట్రపూరితంగా మోసం చేశారనే అభియోగంతో కేసు నమోదు చేసింది. ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. ఈ కేసు నుండి తమను తప్పించాలని కోరుతూ 2019లో సెషన్స్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ అదానీ సోదరులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ ఆర్.ఎన్. లద్దా నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం సోమవారం సెషన్స్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేస్తూ, అదానీ సోదరులను కేసు నుంచి విముక్తి కల్పించింది.కోర్టు పూర్తి ఉత్తర్వులు ఇంకా వెలువడాల్సి ఉంది.అయితే, 2019 డిసెంబర్‌లోనే హైకోర్టు సెషన్స్ కోర్టు తీర్పుపై స్టే విధించింది.ఈ స్టే కాలానుగుణంగా పొడిగిస్తూ వచ్చారు. వాస్తవానికి 2012లో %ఎఖీ×ూ% దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో అదానీలతో పాటు మొత్తం 12 మందిపై నేరపూరిత కుట్ర మోసం ఆరోపణలు ఉన్నాయి.కానీ,ముంబైలోని మేజిస్ట్రేట్ కోర్టు 2014 మే నెలలోనే వారిని కేసు నుండి విముక్తి కల్పించింది. మేజిస్ట్రేట్ కోర్టు విడుదల ఉత్తర్వును సెషన్స్ కోర్టులో సవాలు చేసింది. 2019 నవంబర్‌లో సెషన్స్ కోర్టు మేజిస్ట్రేట్ కోర్టు తీర్పును రద్దు చేసింది. అదానీ గ్రూప్ అక్రమంగా లాభపడిందని ప్రాథమికంగా గుర్తించిందని సెషన్స్ కోర్టు వ్యాఖ్యానించింది.దీంతో పారిశ్రామికవేత్తలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ సెషన్స్ కోర్టు ఉత్తర్వు "నిర్లక్ష్యంగా చట్టవిరుద్ధంగా" ఉందని వాదించారు.

## జనంలోకి..బీఆర్ఎస్

**(1వపేజీ తరువాయి)**వ్యాప్త పర్యటనకు డిసైడ్ అయ్యారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో పర్యటించి పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ 25 వ వార్షికోత్సవం వేళ సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్ధం అవుతోంది. జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించేలా కార్యాచరణ ఖరారైంది. ఇప్పటి కే మాజీ సీఎం కేసీఆర్ తాజాగా తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలు ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వరంగల్‌లో లక్షలాదిమంది పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు.కేడర్‌తో సమావేశం పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాల్లో భాగంగా అనేక కార్యక్రమాలు, సంబరాలను నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటం పైన ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తి కావటంతో ఇక నిరసనల నిర్వహణ దిశగా కార్యాచ రణ సిద్ధం చేస్తోంది. వీటి నిర్వహణ పైన కేటీఆర్ పార్టీ శ్రేణులకు, జిల్లా నేతలకు, కార్యకర్తలకు కేటీఆర్ స్వయంగా మార్గదర్శనం చేయనున్నారు. ఇప్పటికే కేటీఆర్ జిల్లాల పర్యటన షెడ్యూల్ పైన స్పష్టత ఇచ్చారు. మార్చి 20న సూర్యాపేట జిల్లా కార్యకర్తలతో, 23న కరీంనగర్ జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.



## హోలీ పండుగను మిస్సవడం నా దురదృష్టం : తులసి



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలో హోలీ పండుగను కొద్దిలో మిస్ కావడం తన దురదృష్టమని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ విభాగం డైరెక్టర్ తులసి గబ్బార్డ్ విచారం వ్యక్తం చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత పర్యటనకు వచ్చిన ఆమె.. మరో రెండు రోజులు ముందుగా తన టూర్ ప్లాన్ చేసుకుని ఉంటే హోలీ వేడుకల్లో పాల్గొనేదాన్నని అన్నారు. ప్రజలు గత శుక్రవారం దేశవ్యాప్తంగా ఘనంగా హోలీ పండుగ సంబురాలు చేసుకున్నారు. హిందూ సాంప్రదాయాలను పాటించే తులసి గబ్బార్డ్ పండుగ జరిగిన రెండు రోజులకే భారత పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియా ఆమెను హోలీ గురించి ప్రశ్నించగా.. హోలీ ఒక అద్భుతమైన పండుగ అని, కలర్ ఫుల్ పండుగ అని చెప్పారు. తాను హోలీ పండుగ సంబరాల్లో పాల్గొనలేకపోవడం తన దురదృష్టమని అన్నారు.హవాయిలోని తమ ఇంటి దగ్గర అలోహా అని ఒకరినొకరు పలకరించుకుంటారని, భారత్‌లో నమస్తే అని పలకరించుకుంటారని, పలుకరింపుకను వాడే పదం వేరైనా ఉద్దేశం మాత్రం ఒకటేనని అన్నారు. తన వ్యక్తిగత విషయానికి వస్తే ఈ పలకరింపు అనేది చాలా అర్థవంతమైనది, చాలా ఆచరణాత్మకమైనది అని వ్యాఖ్యానించారు. కాగా తులసి గబ్బార్డ్ తల్లి అమెరికాలో జన్మించారు. ఆ తర్వాత హిందూ మతాన్ని స్వీకరించారు. హిందూ మత సంప్రదాయాలను పాటించారు.



# పెళ్లైన నెల నుంచే మేము వేరుగా ఉంటున్నాం.. కోర్టులో రన్యారావు భర్త



**న్యూఢిల్లీ-నవభూమి:** దుబాయి నుంచి అక్రమంగా బంగారం రవాణా చేస్తూ విమానాశ్రయంలో పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన నటి రన్యారావు కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఈరోజు కోర్టుకు హాజరైన ఆమె భర్త షాకింగ్ కామెంట్లు చేశారు. పెళ్లైన నెల నుంచే తాను.. తన భార్య రన్యా రావుతో దూరంగా ఉంటున్నట్లు చెప్పుకొచ్చారు. అధికారికంగా విడాకులు తీసుకోకపోయినా.. తాము ప్రస్తుతం వేర్వేరుగానే ఉంటున్నట్లు వివరించారు. ఆపూర్తి వివరాలు మీకోసం.నాలుగు నెలల కిందటే రన్యారావు.. జతిన్ హుక్కేరిని పెళ్లి చేసుకుంది. ఇరు కుటుంబ పెద్దలు, బంధువులు, స్నేహితుల మధ్య పంచతార హోటల్ తాజ్ వెస్ట్ ఎండ్‌లో వీరిద్దరి వివాహం చాలా ఘనంగా జరిగింది. వీరి పెళ్లికి అనేక మంది సినీ ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు కూడా హాజరయ్యారు. అయితే వివాహం జరిగిన తర్వాత నుంచి ఈ జంట ల్యావెల్లీ రోడ్డులోనే ఓ విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. అలాగే జతిన్ హుక్కేరి.. ఆర్వీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సును పూర్తి చేశారు. ప్రస్తుతం ఇంటీరియర్ డిజైనర్‌గా, నగరంలో ఓ రెస్టారెంట్ యజమానిగా కొనసాగుతున్నారు. అయితే తన వ్యాపారాలను ముంబయి, ఢిల్లీలకు కూడా విస్తరించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా బాగానే ఉండగా.. ఇటీవలే రన్యారావు దుబాయి నుంచి అక్రమంగా బంగారం రవాణా చేస్తూ దొరికిపోయింది. ఇక అప్పటి నుంచి పోలీసులు ఈ కేసుతో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయని పరిశీలిస్తున్నారు. ఈక్రమంలోనే రన్యారావు.. దుబాయి వెళ్లేందుకు తన భర్త జతిన్ హుక్కేరి క్రెడిట్ కార్డు నుంచి టికెట్లు బుక్ చేసుకున్నట్లు గుర్తించారు.అయితే ఈకేసులో అతడికి కూడా సంబంధం ఉండొచ్చని భావించిన పోలీసులు.. అతడికి చెందిన తొమ్మిది ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. ఈక్రమంలోనే డీఆర్ఐ తనతను అరెస్ట్ చేయకుండా ఉండాలంటూ జతిన్ హుక్కేరి.. కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో భాగంగానే రన్యారావుతో తనకు గత నవంబర్ నెలలో వివాహం అయిందని.. అయితే డిసెంబర్ నుంచే తాము విడిగా ఉంటున్నామని పిటిషన్‌లో వెల్లడించారు. తాము అధికారికంగా విడిపోలేదని.. అయితే కొన్ని కారణాల వల్ల మాత్రం వేర్వేరుగా జీవిస్తున్నామని జతిన్ హుక్కేరి చెప్పారు. ఆయన వాదనలు విన్న కర్ణాటక హైకోర్టు జతిన్ హుక్కేరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా మార్చి 24వ తేదీ వరకు ఇవి అమల్లో ఉండగా.. జతిన్ హుక్కేరిని అరెస్ట్ చేయడం కుదరదు. దీని తర్వాతే తాము జతిన్ హుక్కేరి చేసిన అభ్యర్థనకు వ్యతిరేకంగా పిటిషన్ వేస్తామని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారులు వెల్లడించారు.

## చాంపియన్స్ ట్రోఫీతో 869 కోట్ల నష్టం.. కఠిన నిర్ణయాలు తీసుకున్న పీసీబీ



**న్యూఢిల్లీ-నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీ వల్ల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(%ఖుఎఆర్ఖుఅ జతీఅఎఎవ్ దీశ్రీఖుతీఎ%)కు భారీ నష్టం వచ్చింది. ఐసీసీ టోర్నీ నిర్వహణతో ఆ బోర్డు కష్టాలు మరింత పెరిగాయి. చాంపియన్స్ ట్రోఫీ వల్ల పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు సుమారు 869 కోట్ల నష్టం వచ్చినట్లు ఓ రిపోర్టు ద్వారా తెలుస్తోంది. ఆ టోర్నీలో ఆతిథ్య జట్టు .. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. ఆ తర్వాత దుబాయ్‌లో ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో కూడా పరాజయం చవిచూసింది. ఇక బంగ్లాదేశ్‌తో జరగాల్సిన మూడవ మ్యాచ్ వర్షం వల్ల రద్దు అయ్యింది. గ్రూప్ స్టేజ్‌లోనే పాకిస్థాన్ టోర్నీ నుంచి నాకౌట్ కావడంతో.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పరిస్థితి అధ్వాన్నంగా మారింది.చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ కోసం రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాలను పీసీబీ అప్‌గ్రేడ్ చేసింది. ఆ వేదికల అప్‌గ్రేడ్ కోసం సుమారు 58 మిలియన్ల డాలర్లు ఖర్చు అయ్యింది. అనుకున్న బడ్జెట్ కన్నా 50 శాతం ఎక్కువ బడ్జెట్‌ను ఖర్చు చేశారు. ఈవెంట్ ప్రిపరేషన్ కోసం అదనంగా 40 మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టింది పీసీబీ. అయితే టోర్నీ నిర్వహణ కోసం భారీగా ఖర్చు చేసినా.. ఆ టోర్నీ వల్ల పీసీబీకి వచ్చింది చాలా తక్కువే. టోర్నీని హోస్ట్ చేసినందుకు తమకు కేవలం 6 మిలియన్ల డాలర్లు వచ్చినట్లు పీసీబీ వెల్లడించింది. ఇక టికెట్ సేల్స్, స్పాన్సర్‌షిప్‌లతో వచ్చిన ఆదాయం కూడా మరీ తక్కువే అని పేర్కొన్నది.ఓవరాల్‌గా చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ నిర్వహణ వల్ల సుమారు 85 మిలియన్ల డాలర్ల నష్టం వచ్చినట్లు పీసీబీ స్పష్టం చేసింది. దీంతో పాక్ క్రికెట్ బోర్డు కొత్తగా కొన్ని ప్లాన్స్ వేసింది. నష్ట నివారణ చేర్యలు చేపట్టేందుకు సిద్దమైంది. జాతీయ టీ20 చాంపియన్స్‌లో మ్యాచ్ ఫీజును 90 శాతం తగ్గించేందుకు బోర్డు మేనేజ్మెంట్ నిర్ణయించింది. ఇక రిజర్వ్ ప్లేయర్ పేమెంట్‌ను కూడా 87.5 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.జాతీయ జట్టు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును 40 వేల నుంచి 10 వేలకు తగ్గించినట్లు వస్తున్న వార్తలను పీసీబీ చైర్మెన్ మోషిన్ నఖ్వీ ఖండించారు. బోర్డు దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆటగాళ్లకు కల్పించే 5-స్టార్ సదుపాయాలను మార్చేసి ఎకానమీ క్లాసు హోటల్స్ ఇస్తున్నారు.


## కేంద్ర మాజీ మంత్రి దేబేంద్ర ప్రధాన్ కన్నుమూత.. ప్రధాని మోదీ నివాళి



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి దేబేంద్ర ప్రధాన్‌కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 84. అనారోగ్యం కారణంగా సోమవారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నేతలు సంతాపం తెలుపుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం దేబేంద్ర ప్రధాన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.కాగా, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో దేబేంద్ర ప్రధాన్ మంత్రిగా పనిచేశారు. ఒడిశా బీజేపీ మాజీ అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. ఆయన మృతిపట్ల ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ (%వీశ్రీష్ట్రఖుఅ జష్ట్రఖుతీఖుఅ మీఖుయష్ట్రఱ%) స్పందించారు. ఆయన ప్రజా నాయకుడని, సమర్థుడైన పార్లమెంటేరియన్ అని కొనియాడారు. 1999 నుంచి 2001 వరకు కేంద్ర రవాణా, వ్యవసాయ శాఖ మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధిగా, ఎంపీగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు.

## అమృత్‌సర్ ఆలయంపై గ్రెనేడ్ దాడి..

### పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రధాన నిందితుడు హతం



**న్యూఢిల్లీ-నవభూమి:** అమృత్‌సర్‌లోని ఓ ఆలయంపై ఇటీవలే జరిగిన గ్రెనేడ్ దాడి ఘటనలో ప్రధాన నిందితుడు సోమవారం మృతి చెందాడు. గుర్సిదక్ సింగ్ అనే అనుమానితుడు పంజాబ్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. మరో నిందితుడు తప్పించు కున్నాడు.అమృత్‌సర్‌లోని ఓ గుడిపై గ్రెనేడ్ దాడి జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి హ్యాండ్ గ్రెనేడ్ విసిరినట్లు తెలిసింది. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. పేలుడు వల్ల ఆలయ గోడ స్వల్పంగా ధ్వంసమైంది. అర్థరాత్రి గ్రెనేడ్ దాడి జరిగినట్లు సీసీటీవీ ఫూటేజ్ ద్వారా నిర్ధరించిన పోలీసులు.. నిందితుల కోసం తీవ్రంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు రాజసాన్సీ ప్రాంతంలో తిరుగుతున్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో సీఐఏ, ఛెహర్తా పోలీసులతో కూడిన బృందం ఆ ప్రాంతంలో వారి కోసం గాలింపు చేపట్టింది.ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఇద్దరు నిందితులు గుర్సిదక్ సింగ్, విశాల్ పోలీసులకు ఎదురుపడ్డారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. నిందితులు తమ వాహనాన్ని వదిలేసి పోలీసులపై కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఒక బుల్లెట్ హెడ్ కానిస్టేబుల్ గురుప్రీత్ సింగ్ ఎడమ చేతికి తగలగా.. మరో బుల్లెట్ ఇన్‌స్పెక్టర్ అమోలక్ సింగ్‌ను తాకింది. ఈ క్రమంలో ఆత్మరక్షణ కోసం ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ఎదురు కాల్పులు జరపడంతో గుర్సిదక్‌కు గాయాలయ్యాయి. గాయపడిన అధికారులు, నిందితుడిని సివిల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిందితుడు ప్రాణాలు కోల్పోయాడు. అతని సహచరుడు విశాల్ మాత్రం పరారైనట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## బెంగళూరులో రూ.75 కోట్ల డ్రగ్స్

**బెంగళూరు-నవభూమి:** బెంగళూరులో పోలీసులు పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు దక్షిణాఫ్రికా మహిళలను మంగళూరు సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.75 కోట్ల విలువైన 37.87 కేజీల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 14న విదేశీ మహిళలు ఢిల్లీ నుంచి బెంగళూరుకు డ్రగ్స్ తీసుకొస్తున్నట్లు సమాచారం అందడంతో.. వారిని బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని నీలాద్రినగర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. రాష్ట్రంలో ఇంత భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడడం ఇదే తొలిసారి.

# చిక్కుల్లో పడ్డ బాలీవుడ్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఓర్రీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** బాలీవుడ్ సోషలైట్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి చేసిన ఓ తప్పు వల్ల చిక్కుల్లో పడ్డారు. ముఖ్యంగా ఇటీవలే జమ్ము కశ్మీర్ కాట్రాలోని వైష్ణో దేవి ఆలయానికి వెళ్లిన ఈయన.. అక్కడే తన స్నేహితులతో కలిసి ఓ పని చేస్తూ అడ్డంగా దొరికిపోయారు. అందువల్లే ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈయనతో పాటు మరో ఏడుగురు స్నేహితులపై కూడా కేసులు పెట్టిన పోలీసులు.. వీరిని అరెస్ట్ చేసేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి.. ఇటీవలే తన ఏడుగురు స్నేహితులతో కలిసి జమ్ము కశ్మీర్‌లోని వైష్ణో దేవి మాతా ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లారు. ఈక్రమంలోనే అక్కడి ఓ హోటల్లో భోజనం చేసేందుకు ఆగారు. ముఖ్యంగా పక్కనే ఉన్న ఓ హోటల్లో దిగి కడుపు నిండా తినేశారు. అక్కడే తమ వెంట తెచ్చుకున్న ఓ మందు బాటిల్ విప్పి భోజనం చేస్తుండగా తాగేశారు. అయితే విషయం గుర్తించిన కొందరు స్థానికులు దాన్ని ఫొటోలుగా తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే వారిచ్చిన ఫొటోలు చూసిన పోలీసు అధికారులు హోటల్‌కు వెళ్లి మరీ దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలోనే ఓర్రీ అతడి ఏడుగురు స్నేహితులు మద్యం సేవించినట్లు గుర్తించారు. దీంతో వారందరిపై కేసులు నమోదు చేశారు. మార్చి 15వ తేదీన ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి, శ్రీ దర్శన్ సింగ్, శ్రీ పార్థ్ రైనా, శ్రీ రితిక్ సింగ్, శ్రీమతి రాశి దత్తా, శ్రీమతి రక్షిత భోగల్, శ్రీ గుషన్ కోహ్లీ, శ్రీమతి అర్జమస్కినాలపై కేసులు పెట్టారు. ఈ విషయాన్ని నేరుగా అక్కడి పోలీసు అధికారులే వెల్లడించారు.అయితే వీరు భోజనం చేసిన హోటల్లో నాన్ వెజ్ ఆల్కహాల్ తాగడానికి అనుమతి లేదు. దివ్య మాతా వైష్ణో దేవి తీర్థయాత్ర స్థలం కాబట్టి నిషేధం ఉంటుందని పోలీసులు వివరించారు. అలాంటి పవిత్రమైన స్థలంలో ఓర్రీ తన స్నేహితులతో కలిసి చట్ట విరుద్ధంగా మద్యం సేవించారని.. అందుకే వారిపై కేసులు పెట్టామని చెప్పారు. అంతేకాకుండా మత పరమైన ప్రదేశాల్లో భక్తుల మనోభావాలు తెబ్బతీసేలా వ్యవహరిస్తే.. వారు ఎంత పెద్ద వారైనా సరే ఊరుకునేది లేదని అన్నారు. మాదక ద్రవ్యాలు, మద్యం, నాన్ వెజ్ చర్యను సహించబోన్నారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడానికి పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు కాట్రా ఎస్పీ వెల్లడించారు.

## బతికుండగానే కూతురికి పిండం పెట్టిన తల్లిదండ్రులు.. కారణం ఏంటంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** చిరంజీవి నటించిన అన్నయ్య సినిమాలో ఓ సీన్ ఉంటుంది. చిరంజీవి తమ్ముళ్ల కోసం ఆస్తి అంతా పోగొట్టుకుని మళ్లీ లారీ డ్రైవర్‌గా చేరతాడు. అదే సమయంలో సౌందర్య చెల్లెళ్లు ఆమెను కాదని చిరంజీవి తమ్ముళ్లతో వెళ్లిపోతారు. వెళ్లిపోయే ముందు సౌందర్యకు జీవిత సత్యాల్లాంటి డైలాగులు చెబుతారు. సౌందర్య, చిరంజీవి కోసం క్యారియర్ తీసుకెళ్లినపుడు బాగా ఏడుస్తుంది. చెల్లెళ్లు తనను అన్న మాటల్ని చిరుకు చెబుతుంది. అప్పుడు చిరు కొన్ని మానవ సంబంధాల సత్యాలను వివరిస్తాడు. ‘ నిజంగా మనం వాళ్లను ప్రేమించే వాళ్లమే అయితే.. వారినుంచి ఏమీ ఆశించకూడదు. వాళ్లు ఇలా ఉండాలి. అది చేయాలి అని ఆశించినపుడే మనకు నిరాశ ఎదురవుతుంది.వాళ్లను ప్రేమించే హక్కు మనకుంది.. తిరిగి మిమ్మల్ని ప్రేమించండి అనే అధికారం మనకు లేదు’ అంటాడు. ఈ డైలాగు ప్రతీ రిలేషన్‌కు వర్తిస్తుంది. అది ఏ బంధమైనా సరే. తల్లిదండ్రులు తాము తిన్నా, తినకపోయినా బిడ్డల కోసం పరితపిస్తుంటారు. పిల్లలకు అన్నీ చేసి.. రిటర్న్ గిఫ్ట్‌గా తాము చెప్పినట్లు చేయాలని ఆశిస్తుంటారు.

పిల్లలు తాము చెప్పినట్లు చేయకపోతే నిరాశకు గురవుతుంటారు. మా కడుపున చెడ బుట్టావు అంటూ ఉంటారు. ముఖ్యంగా పెళ్లి విషయంలో తల్లిదండ్రులు మొండిగా వ్యవహరిస్తూ ఉంటారు. తమకు నచ్చిన వాళ్లను పిల్లలు పెళ్లి చేసుకోవాలని ఆశిస్తారు. అది జరగనప్పుడు పిల్లలపై విపరీతమైన కోపం, పగ పెంచుకుంటారు. పిచ్చి పిచ్చి పనులకు తెరతీస్తూ ఉంటారు. తాజాగా, తమకు ఇష్టం లేని పెళ్లి చేసుకుందనే కోపంతో తల్లిదండ్రులు కన్న కూతురికి కర్మ కాండలు నిర్వహించారు. అది కూడా బతికుండగానే కూతురికి పిండ ప్రదానం చేశారు. ఈ సంఘటన పశ్చిమ బెంగాల్‌లోని చోప్రా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే.. గువాకూరీ అగ్నిబారీ ఏరియాకు చెందిన శ్రద్ధ అనే అమ్మాయి అదే ప్రాంతానికి చెందిన యువకుడ్ని ప్రేమించింది. అతడ్నే పెళ్లి చేసుకోవాలని అనుకుంది. కూతురి ప్రేమ విషయం తెలిసిన శ్రద్ధ తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో శ్రద్ధ ఇంటినుంచి పారిపోయి ప్రియుడ్ని పెళ్లి చేసుకుంది.శ్రద్ధను ఇంటికి తిరిగి రమ్మని తల్లిదండ్రులు చాలా సార్లు బతిమాలారు. అయినా ఆమె తిరిగిరాలేదు. దీంతో వారు ఓ దారుణమైన నిర్ణయానికి వచ్చారు. ‘మాకు కూతురు లేదు. చచ్చిపోయింది’ అంటూ కర్మకాండలకు సిద్ధం చేశారు. ఓ మనిషి చనిపోయిన తర్వాత ఎలా అయితే అంత్యక్రియలు, పిండ ప్రదానం చేస్తారో అదే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. బంధువులందర్నీ పిలిచారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బంధువులు వచ్చారు. శ్రద్ధ అంత్యక్రియల సందర్భంగా కుటుంబసభ్యులు, బంధువులు గట్టిగా ఏడ్చారు కూడా. శ్రద్ధ తండ్రి గుండు కొట్టించుకుని కూతురికి పిండం పెట్టాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బతికుండగానే కూతురికి అంత్యక్రియలు నిర్వహించటం, పిండం పెట్టడంపై నెటిజన్లు మిశ్రమంగా స్పందిస్తూ ఉన్నారు. కొంత మంది ఆ తల్లిదండ్రులు చేసిన పనిని పొగుడుతూ ఉంటే, మరికొంతమంది తిడుతూ ఉన్నారు.

## కోల్‌కతా హైకోర్టుకు వెళ్లవచ్చు.. బాధితురాలి తల్లిదండ్రులకు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ-నవభూమి:** కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజే లో అత్యాచారం, హత్యకు గురైన బాధితురాలి కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు సీబీఐని ఆదేశించాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు (%ూబజూతీవఎవ జశ్రీబతీ%) ధర్మాసనం విచారించింది. దీనిపై దర్యాప్తు చేయించాలని కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సీజేఐ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ దశలో తిరిగి దర్యాప్తు జరపాల్సిందిగా సీబీఐని ఆదేశించలేమని పేర్కొంది. బాధితురాలి కుటుంస సభ్యుల తరపున సీనియర్ అడ్వకేట్ కరుణ నుండి హాజరుకాగా, సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు.మెడికో హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు జనవరి 20న సీల్దా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అయితే మరికొందరి పాత్రను నిర్ధారించేందుకు సీబీఐ మరింత లోతైన దర్యాప్తు జరపాలని బాధితురాలి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈమేరకు సీబీఐను ఆదేశించాల్సిందిగా వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సీబీఐ తరఫు న్యాయవాది వాదన విన్న అనంతరం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించడం సముచితమని సుప్రీం ధర్మాసనం భావించింది.

న్యాయం కోరుతూ కోల్‌కతాలో ర్యాలీలు..కాగా, హత్యాచార బాధితురాలి న్యాయం జరగాలని కోరుతూ ఈనెల మొదట్లో రెండు ర్యాలీలు కోల్‌కతాలో జరిగాయి. హత్యాచార ఘటన జరిగిన ఏడు నెలలైన సందర్భంగా ఈ ఘటనను ఖండిస్తూ పౌర సమాజాలు ర్యాలీలు చేపట్టారు. మార్చి 1న విద్యాశాఖ మంత్రి బ్రత్య బసు వాహనం ఢీకొనడంతో జాదవ్‌పూర్ క్యాంపస్ స్టూడెంట్ గాయపడిన ఘటనపై కూడా వీరు నిరసన తెలిపారు. ఆర్జీ కర్ మెడికో హత్యాచార ఘటనలో నిందితులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# చివరి రోజుల్లో జో బైడెన్ చేసిన క్షమాభిక్షలు చెల్లవు..: ట్రంప్



**అమెరికా-నవభూమి:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పదవి ముగుస్తుండగా.. షాకింగ్ నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా వందలాది మంది నేరస్థులకు ఆయన క్షమాభిక్ష ప్రకటించారు. అయితే వాటిని ఇప్పుడు రద్దు చేస్తున్నట్లు అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. బైడెన్ అధికారంలో ఉన్న చివరి రోజుల్లో చేసిన క్షమాభిక్షలు చెల్లవని చెప్పారు. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన ట్రంప్.. అందుకు గల కారణాలను కూడా తెలిపరు. మరి ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ అధికారంలో ఉన్న చివరి రోజుల్లో.. ముఖ్యంగా డిసెంబర్ నెలలో తొలిసారి 1500 మంది నిందితులకు క్షమాభిక్ష ప్రసాదించారు. ఒక్క రోజులోనే అంతమందికి శిక్ష తగ్గించి చరిత్రకెక్కిన బైడెన్.. అదేరోజు తన పదవి నుంచి తప్పుకునేలోపు మరింత మందికి క్షమాభిక్ష ప్రసాదిస్తానని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారమే.. 15 రోజుల తర్వాత మరికొంత మందికి శిక్షను తగ్గించారు. ముఖ్యంగా ఫెడరల్ మరణశిక్ష ఎదుర్కుంటున్న 40 మందిలో ఏకంగా 37 మందికి పెరోల్‌కు అవకాశం లేని జీవిత ఖైదును విధించారు.దంతా జరిగిన మూడు నెలల తర్వాత.. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనిపై స్పందించారు. ముఖ్యంగా బైడెన్ చేసిన ఈ క్షమాభిక్షలు చెల్లవంటూ ప్రకటించారు. ట్రూత్ వేదికగా ఇందుకు సంబంధించి ఓ పోస్టు పెట్టారు. అందులో బైడెన్ నిద్ర మత్తులో రాజకీయ దుండగులకు కూడా క్షమాభిక్షలు ప్రసాదించారని చెప్పుకొచ్చారు. అయితే అవి చెల్లవని, శూన్యం అని.. ఎలాంటి ప్రభావం చూపవని తాను ఇప్పుడు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. ఎందుకంటే అవన్నీ ఆటోపెన్‌తో చేసినవని చెప్పారు.ఒక విధంగా చెప్పాలంటే.. బైడెన్ వాటిపై సంతకాలు చేయలేదని.. అసలు ఆయనకు ఈ విషయం కూడా తెలియదంటూ ట్రంప్ వెల్లడించారు. వాటికి అవసరమైన పత్రాల గురించి బైడెన్‌కు వెల్లడించలేదని.. ఆయన ఆమోదించలేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం నడిపిన వారు నేరం చేశారన్నారు. ఆ తర్వాత అదే రాజకీయ దుండగుల అన్‌సెలెక్ట్ కమిటీ.. తనతో సహా అనేక మంది అమాయకులపై రెండేళ్ల పాటు నిర్వహించిన తప్పుడు దర్యాప్తులో సంపాదించిన ఆధారాలను కూడా పూర్తిగా నాశనం చేసిందని ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే ఈ నేరాలకు పాల్పడిన వారు అత్యున్నత స్థాయి దర్యాప్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అర్థం చేసుకోవాలంటూ ట్రంప్ హెచ్చరించారు. ఈ పోస్టు చూసిన ప్రతీ ఒక్కరూ షాక్ అవుతున్నారు. ముఖ్యంగా బైడెన్ చేసిన క్షమాభిక్షలు చెల్లవని తెలుసుకుని.. నేరస్థులతో పాటు వాళ్ల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

# రన్యా రావుపై బీజేపీ ఎమ్మెల్యే నీచమైన కామెంట్స్




**బెంగళూరు-నవభూమి:** కన్నడ బ్యూటీ రన్యా రావు బంగారం అక్రమ రవాణా వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. ఈ వ్యవహారం కర్ణాటకలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. విదేశాల నుంచి బెంగళూరుకు బంగారం తరలించడానికి పోలీసు అధికారుల ‘ప్రోటోకాల్’ సేవలు ఆమె డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఆరోపిస్తోంది. పోలీసులు, ప్రముఖుల సహకారం, మద్దతుతోనే రన్యా రావు ఈ ఏడాది జనవరి నుంచి 27 సార్లు దుబాయ్‌కు వెళ్లి వచ్చిందని విచారణలో తేలింది. బంగారం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నటి రన్యారావుపై బీజేపీ ఎమ్మెల్యే అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆమె ఒంటిలో ప్రతిచోట బంగారం దాచిపెట్టి తీసుకొస్తుందని బిజపుర సిటీ ఎమ్మెల్యే బసన్‌గౌడ పాటిల్ యత్నాల్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగుతోంది. ఇందుకు సంబంధించి ఆయన మాట్లాడిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. రెండు వారాల కిందట దుబాయ్ నుంచి అక్రమంగా 14 కిలోల బంగారం తీసుకొస్తూ.. బెంగళూరు విమానాశ్రయంలో రన్యా రావు దొరికిపోయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం కన్నడ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.

తాజాగా, బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ మాట్లాడుతూ.. బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో ఏఏ మంత్రులు ఉన్నారో తనకు తెలుసని ఆయన ఆరోపించారు. ఈ కేసులో దోషులుగా తేలిన వారందరిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే కోరారు. అలాగే, రన్యా రావు సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ రామచంద్రరావును ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కాబట్టి ఎవరినైనా సమర్థించవచ్చా? అని వ్యాఖ్యానించారు. కాగా, తన సవతి కుమార్తె దందాతో తనకు ఎలాంటి సంబంధం లేదని డీజీపీ రామచంద్రరావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన కర్ణాటక ప్రభుత్వం.. ఆయనను తప్పనిసరి సెలవుపై పంపింది.‘కస్టమ్స్ అధికారుల వైఫల్యం కూడా ఉందని, వారిపై అవసరమైన చర్యలు తీసుకోవాలి.. ఆమె (రన్యా రావు) తన ఒంట్లో ప్రతిచోట ఎక్కడపడితే అక్కడే బంగారం దాచిపెట్టి స్మగ్లింగ్ చేస్తుంది... ఈ వ్యవహారంలో ఉన్న మంత్రుల పేర్లన్నీ తనకు తెలుసు.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వారి బండారం బయటపెడతాను.. బంగారం ఆమె ఎలా తీసుకొచ్చిందీ.. సెక్యూరిటీ క్లియరెన్స్‌కు ఎవరు సాయం చేశారు.. ఎవరితో సంబంధాలు ఉన్నాయి.. ఆమె ఒంట్లో ఏ చోట దాచిపెట్టిందో అనేది పూర్తి సమాచారం నా దగ్గర ఉంది... అసెంబ్లీలో అవన్నీ చెబుతా’ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అయితే, బీజేపీ ఎమ్మెల్యే పాటిల్‌కు వివాదాల్లో చిక్కుకోవడం కొత్తేం కాదు. గతంలో 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీని విషకన్య అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఆయనకు ఈసీ నోటీసులు కూడా జారీచేసింది. అంతేకాదు, 2020లో ముస్లిం మైనార్టీ కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు కోసం ఉద్దేశించిన పథకాన్ని రద్దుచేయడాన్ని సమర్ధించిన యత్నాల్.. ఈ పథకం కోరుకుంటున్నవారు పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అలాగే, పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడ్ని పాకిస్థాన్ ఏజెంట్ అంటూ నోరుజారి వివాదంలో చిక్కుకున్నారు.


## ఆర్మీ అధికారి, అతడి కొడుకును దారుణంగా కొట్టిన పోలీసులు..

**చండీగఢ్-నవభూమి:** పార్కింగ్ వివాదం నేపథ్యంలో ఆర్మీ అధికారి, అతడి కుమారుడ్ని పోలీసులు దారుణంగా కొట్టారు.దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఫిర్యాదుపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. 12 మంది పోలీసులను సస్పెండ్ చేశారు. పంజాబ్‌లోని పాటియాలాలో ఈ సంఘటన జరిగింది. కల్నల్ పుష్పిందర్ బాత్, ఢిల్లీలోని ఆర్మీ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. మార్చి 13న పాటియాలాలోని ఒక రెస్టారెంట్ వద్ద కారు పార్క్ చేసేందుకు ఆయన ప్రయత్నించారు.కాగా, సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు కారును అక్కడి నుంచి తీయాలని కల్నల్ పుష్పిందర్‌తో దురుసుగా చెప్పారు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం జరిగింది.



## కొత్త రకం మోసం కాల్ మెర్జింగ్ స్కామ్..అలర్ట్ చేసిన కేంద్రం..

సైబర్ నేరగాళ్లు రోజుకో రకంగా మోసం చేస్తూ జనాలను దోచుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కాల్ మెర్జింగ్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది UPI వినియోగదారులు ఈ మోసానికి గురికావచ్చని కేంద్రం ప్రజలకు సూచనలు జారీ చేసింది. మీ బ్యాంక్ ఖాతాను ఖాళీ చేయడమే లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఈ స్కామ్‌ను అమలు చేస్తారని వెల్లడించింది. దీని విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. అయితే దీనిని ఎలా అమలు చేస్తున్నారనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.సాధారణంగా మనం ఆన్‌లైన్ లావాదేవీలను సురక్షితంగా నిర్వహించేందుకు OTP అవసరం అవుతుంది. కానీ, సైబర్ నేరగాళు ఈ కాల్ మెర్జింగ్ స్కామ్ ద్వారా వినియోగదారుల నుంచి OTP దొంగిలించి, వారి బ్యాంక్ ఖాతాల నుంచి మనీ లాగేస్తుంటారు.నకిలీ ఉద్యోగ ఆఫర్ లేదా ఇతర అవసరాల పేరుతో స్కామర్లు కాల్ చేస్తారు. ఆ క్రమంలో నటిస్తూ బాధితుడి నంబర్‌ను మీ స్నేహితుడి ద్వారా పొందామని చెబుతారు. ఆ తర్వాత బాధితుడికి మరొక ఇన్‌కమింగ్ కాల్ వస్తుందని, దానిని మెర్జింగ్ చేయాలని కోరతారు. నిజానికి, ఆ రెండో కాల్ బాధితుడి బ్యాంక్ నుంచి వచ్చే OTP ఆటోమేటెడ్ కాల్. ఆ సమయంలో కాల్‌ను మెర్జ్ చేయడం ద్వారా, స్కామర్ OTP వివరాలను స్వీకరిస్తాడు. చివరకు ఆ OTPని ఉపయోగించి, స్కామర్ బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బును లూటీ చేస్తాడు.కాల్ మెర్జింగ్ స్కామ్ ఎందుకు ప్రమాదకరం..ఇది సాధారణంగా ఆత్మీయుల ద్వారా వచ్చిన కాల్ అంటూ ఫోన్స్ చేస్తారు. కాబట్టి చాలా మంది దీని పట్ల అవగాహన లేకుండా మోసపోతారు. బాధితుడు ఈ మోసాన్ని గ్రహించేలోపు అతని బ్యాంక్ ఖాతా ఖాళీ అయిపోతుంది. OTP లేకుండా లావాదేవీలు సాధ్యపడవు.



## అమెరికాను యూరప్ ధిక్కరించగలదా?

వైట్ హౌజ్‌లో అమెరికా అధ్యక్షుడు చర్చలకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడిని అవమానించిన రోజున (28, ఫిబ్రవరి) నేను ప్రముఖ సాహిత్య పత్రిక గ్రంట పాత సంచిక నొకదాన్ని చదువుతున్నాను. 1990 వసంతకాలంలో ప్రచురితమైన ఆ సంచిక ఇతివృత్తం 'కొత్త యూరప్!'. కొత్త అనే విశేషణం, ఆశ్చర్యార్థ సూచకం రెండూ కిందటి సంవత్సరం (1989)లో సంభవించిన చరిత్రాత్మక ఘటనలకు అంగీకారం తెలుపుతున్నవే. బెర్లిన్ గోడ పతనం, దశాబ్దాల అనంతరం పోలండ్లో ప్రప్రథమంగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగడం, తూర్పు యూరోపియన్ దేశాలలో నియంతృత్వ వ్యవస్థలు కుప్ప కూలిపోవడం మొదలైన నవ యుగ నిర్మాణ పరిణామాలు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన సందర్భమది.

ఆ సంఘటనలు యూరప్ భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేయనున్నాయనే విషయమై గ్రంట ఎడిటర్ విఖ్యాత యూరోపియన్ రచయితలు, మేధావుల నుంచి వ్యాసాలను ఆహ్వానించాడు. సహజంగానే ఆ వ్యాసకర్తలలో చాలా మంది గత కొద్ది నెలలుగా యూరప్‌లో చోటు చేసుకుంటున్న ఘటనల పట్ల తమ ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారిలో ఒకరైన తూర్పు జర్మనీ మత గురువు వెర్నర్ క్రాట్ షెల్ బెర్లిన్ గోడ పతనానికి దారితీసిన 'స్వేచ్ఛ, గౌరవం కోసం పోరాటం'కు అభివందనాలు తెలిపారు. గ్రంట వ్యాస రచయితలలో ఒకరు రాజనీతి శాస్త్రవేత్త ఇసయ్యా బెర్లిన్. పాశ్చాత్య మేధో ప్రపంచంలో ఆయన మిగతా వ్యాసకర్తలు అందరికంటే విఖ్యాతుడు. అక్టోబర్ విప్లవ పూర్వపు రష్యాలో జన్మించిన బెర్లిన్ చిన్నవయసులోనే తన తల్లిదండ్రులతో ఇంగ్లాండ్‌కు వలస వచ్చాడు. తనవైన చింతనా పద్ధతుల్లో బ్రిటిష్ మేధో సంస్కృతికి వారసుడుగా వెలుగొందారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఆచార్యుడుగా సుప్రసిద్ధమయ్యాడు. ఒక కొత్త ఆక్స్‌ఫర్డ్ కళాశాలను కూడా నెలకొల్పాడు. బ్రిటిష్ అకాడెమీకి అధ్యక్షుడు అయ్యాడు. ముమ్మూర్తులా బ్రిటిష్‌వాడుగా రూపొందినప్పటికీ రష్యా చరిత్రలో తన ప్రగాఢ కుతూహలాన్ని, గత కాలం రష్యన్ రచయితలు, చింతకుల పట్ల అపురూపమైన ఆసక్తిని తుదకంటా నిలుపుకున్న యూరోపియన్ మేధావి. రష్యాలో కమ్యూనిస్టుల పాలన అణచివేసిన పాతకాలం బుద్ధిజీవుల మేధో కృషి, ఉదారవాద సంప్రదాయాల పునరుద్ధరణకు 1989 ఘటనలు అవకాశం కల్పించాయని బెర్లిన్ పేర్కొన్నారు.తూర్పు యూరప్‌లో సోవియట్ కీలుబొమ్మల ప్రభుత్వాలు కూలిపోవడాన్ని మిగతా వ్యాసకర్తలూ స్వాగతించారు. అయితే భవిష్యత్తు పట్ల నిండు ఆశాభావాన్ని వ్యక్తం చేయలేదు, పలు సంవత్సరాలుగా కెనడాలో నివసిస్తున్న చెక్ రచయిత జొసెఫ్ స్కెవోరెస్కీ ఇలా రాశారు: 'ఐరోపాలోని వివిధ దేశాలలో నిరంకుశ ప్రభుత్వాలకు రోజులు చెల్లిపోయాయి. మరికొన్ని దేశాలలో వాటి అంతం ఆరంభమయింది'. బహుముఖ ప్రజ్ఞాశాలి జార్జి స్టెయినెర్ ఇలా వ్యాఖ్యానించాడు: మనం ప్రతిచోటా పునరుజ్జీవ జాతీయవాదం, జాతి విద్వేషాల మధ్య ఒక ఉన్మాద పోటీని చూస్తున్నాము. అయితే అమెరికా మాత్రం ఒక ప్రాంతీయ మహాశక్తిగా పరిణమిస్తున్నట్టుగా కనిపిస్తోంది. యూరప్ గురించి తెలుసుకోవడం లేదు. సంభవిస్తున్న సంఘటనలను పట్టించుకోకుండా ఈ మహా గొప్ప పాత ప్రపంచం (యూరప్) పట్ల ఉదాసీనత చూపుతున్నది. ఏమైనా యూరప్ పునరుత్థానమవుతోంది. తన సొంతంగా నిలబడుతోంది'.1989 సంఘటనలలో సంభవించినదేమిటి? తూర్పు యూరప్ అంతటా అణచివేతకు గురైన జాతీయవాద మనోభావాలు ఉప్పెనలా వ్యక్తమయ్యాయి. పోలిష్ ప్రజలు, చెక్ దేశ వాసులు, మగ్యార్లు, జర్మన్లు సోవియట్ యూనియన్ ఆధిపత్యంపై తిరుగుబాటు చేశారు. సోవియట్ రష్యా శృంఖలాల నుంచి విముక్తమయ్యేందుకు దృఢంగా సంకల్పించుకున్నారు. పర్యవసానమే కొత్త యూరప్ ఆవిర్భావం. తూర్పు యూరప్ లోని చిన్న చిన్న దేశాలు మళ్లీ స్వేచ్ఛ సాధించుకోవడం పట్ల పలువురు వ్యాసకర్తలు తమ దృష్టి కేంద్రీకరించగా అంద్రేయి సిన్యావస్కీ అనే వ్యాసకర్త మాత్రం జాతీయవాదం అణగారిన ప్రజలను విముక్తం చేయడమే కాకుండా ప్రతి ఘాతుక శక్తిగా కూడా పరిణమించగలదని హెచ్చరించారు. 'ప్రతిఘాతుక శక్తి' అనే వ్యాఖ్యను ఆయన రష్యాను దృష్టిలో ఉంచుకుని చేశారు.ఒక ఇతివృత్తంతో వెలువరించే ఏ సంచిక కోసమైనా సంబంధిత పత్రిక ఎడిటర్ వ్యాసకర్తలకు వేర్వేరుగా లేఖలు రాయడం పరిపాటి. ???బెర్లిన్, సాన్యావస్కీలు ఇద్దరికీ తోటి వ్యాసకర్త ఏమి చెప్పుతున్నాడన్న విషయం తెలిసి ఉండే అవకాశం లేదు. ప్రచురితమైన మూడు దశాబ్దాల అనంతరం వారి వ్యాసాలను వెంటవెంటనే చదువుతున్నప్పుడు ఒకరి ఆశాభావం, మరొకరి సంశయవాదం మధ్య వైరుధ్యం స్పష్టంగా కన్పించింది. ఇందుకు కారణం వారి జీవిత ప్రస్థానాలు భిన్న రీతులలో సాగడమేనని చెప్పవచ్చు. రష్యాలో రష్యన్లతో నేరుగా సంబంధాలు లేని తాత్వికుడు బెర్లిన్. రష్యన్లతో ప్రత్యక్ష అనుభవాలు అపారంగా ఉన్న మేధావి సిన్యావస్కీ. 1925లో మాస్కోలో జన్మించిన సిన్యావస్కీ, 1973లో మాత్రమే సోవియట్ యూనియన్ నుంచి వలస పోయిన వ్యక్తి. కనుక ఆయనకు రష్యన్లతో దశాబ్దాల పాటు ప్రత్యక్ష అనుభవాలు ఉన్నాయి. రష్యన్ జాతీయవాదంలో విదేశీయుల పట్ల ద్వేషం దురహంకార ధోరణులు ఎలా ఉంటాయో ఆయనకు బాగా తెలిసి ఉంటుంది.తమ మాతృభూమి రష్యా విషయంలో మాత్రం బెర్లిన్ అభిప్రాయాల కంటే సిన్యావస్కీ అభిప్రాయాలే నిర్దుష్టంగా, యథార్థంగా ఉన్నాయని చెప్పవచ్చు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వ్లాదిమిర్ పుతిన్ తొలుత తన సొంత ప్రజలను తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా దాస్యులను చేసుకోగలిగాడు. ఆ తరువాత, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైపోయిన తరువాత స్వేచ్ఛ పొందిన దేశాల ప్రజలపై రష్యా సంపూర్ణ పెత్తనాన్ని నెలకొల్పేందుకు పూనుకున్నాడు. పుతిన్‌లో బలంగా ఉన్న సామ్రాజ్య పునర్నిర్మాణ ఆకాంక్షే ఉక్రెయిన్ దురాక్రమణగా రూపుదాల్చింది. ఉక్రెయిన్‌ను జయించిన పిదప మరికొన్ని చిన్న యూరోపియన్ దేశాలను సైతం ఆక్రమించుకునేందుకు ఆయన తప్పక ప్రయత్నిస్తాడు. రష్యన్ జాతీయవాద దురహంకార ధోరణులను, పుతిన్ విస్తరణవాదాన్ని విమర్శిస్తున్నవారు రష్యా భీతితో వ్యవహరిస్తున్నవారుగా పుతిన్ సమర్థకులు కొట్టివేస్తున్నారు.అమెరికా భవిష్యత్తులో యూరప్ పట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందని జార్జి స్టెయినర్ చేసిన వ్యాఖ్యలు చాల దూరదృష్టితో చేసినవని గత పక్షం రోజులుగా సంభవిస్తున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. అమెరికా కాలక్రమేణా ఐరోపాపట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందనేది ఆయన వ్యాఖ్యల సారాంశం కదా. పుతిన్ పట్ల డొనాల్డ్ ట్రంప్ అభిమానం అందరికీ తెలిసిందే అయినా, రెండోసారి అధికారానికి వచ్చీ రాగానే ఉక్రెయిన్ విషయంలో తీవ్ర వ్యతిరేకతతో వ్యవహరిస్తాడని కొద్ది మంది మాత్రమే ఊహించారు. ఫిబ్రవరి 28న వైట్ హౌజ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని ట్రంప్, ఆయన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మీడియా ముందే అంతగా అవమానించడాన్ని రష్యన్ రాజకీయవేత్తలు సహజంగానే స్వాగతించారు. ఉక్రెయిన్‌ను మళ్లీ స్వాధీనం చేసుకోవాలన్న తమ ఆకాంక్షను ట్రంప్ సమర్థిస్తున్నట్టు ఆ ఘటన నిర్ధారించిందని వారు ఆనందపడుతున్నారు.

# ఉపగ్రహ అంతర్జాలం ప్రయోజనమేనా?




మన దేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అందించడానికి ఈ మధ్య కాలంలో జియో, ఎయిర్టెల్ టెలికాం సంస్థలు ఎలోన్ మస్క్ కంపెనీకి చెందిన స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయనే వార్తల నేపథ్యంలో అసలు ఈ ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అంటే ఏమిటి ? దీని ఉపయోగాలు, సవాళ్లు గురించి పరిశీలిద్దాం.

**ఉపగ్రహ ఇంటర్నెట్:**

డిజిటల్ యుగంలో పట్టణ,మారుమూల కొండ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి ఇంటర్నెట్ కీలకపాత్ర పోషిస్తుంది. మారుమూల ప్రాంతానికి సాంప్రదాయ ఇంటర్నెట్ అందించడం సాధ్యం కాదు. ఇటువంటి ప్రాంతాలకు అంతర్జాలం అందుబాటులోకి తేవడానికి ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అవకాశాన్ని కల్పిస్తుంది. ఇది వినియోగదారులకు ఇంటర్నెట్ సేవలను అందించడానికి భూమి చుట్టూ తిరుగుతున్న ఉపగ్రహాలపై ఆధారపడే ఒక రకమైన ఇంటర్నెట్ కనెక్షన్. ఈ పద్ధతిలో ఉపగ్రహాల పాత్ర చాలా ముఖ్యమైనది. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు అంతరిక్షంలో ఉన్న ఉపగ్రహానికి ఇంటర్నెట్ సిగ్నల్‌ను పంపుతారు. ఈ ఉపగ్రహం భూమిపై నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్ (నాక్) అని పిలువబడే ప్రదేశానికి డేటాను ప్రసారం చేయడానికి, స్వీకరించడానికి బాధ్యత వహిస్తుంది. నాక్ అనేది ఇంటర్నెట్ లేదా ప్రైవేట్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడి ఉంటుంది. ఒక కాంపాక్ట్ డిష్ ద్వారా డేటా ట్రాన్స్‌మిషన్, రిసెప్షన్‌ను అనుమతిస్తుంది. ఇది భూమధ్యరేఖకు 22,300 మైళ్ల ఎత్తులో ఉన్న జియోస్టేషనరీ ఉపగ్రహంతో కమ్యూనికేట్ చేస్తుంది. ఈ సంకేతాలు వినియోగదారుల వద్ద ఏర్పాటు చేయబడ్డ డిష్ ద్వారా మోడెమ్ నుండి కంప్యూటరకు ఇంటర్నెట్ సిగ్నల్స్ అందుతాయి. ఈ ప్రక్రియ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌కు తిరిగి వెళ్లి ప్రతిసారీ పునరావృతమవుతుంది. తద్వారా ఇంటర్నెట్‌కు చేరుకునే ముందు ఉపగ్రహ డిష్ అనేది కక్ష్యలో ఉన్న ఉపగ్రహం మధ్య అన్ని కమ్యూనికేషన్‌లకు మధ్యవర్తిగా పనిచేస్తుంది.

**ఉపగ్రహాల పాత్ర:**

ఉపగ్రహ ఇంటర్నెట్ సేవ సాధారణంగా వ్యక్తిగత వినియోగదారులకు భూస్థిర ఉపగ్రహాల ద్వారా అందించబడుతుంది. ఇవి సాపేక్షంగా అధిక డేటా



వేగాన్ని అందిస్తాయి. కొత్త ఉపగ్రహాలు సెకెనకు 506 మెగాబిట్స్ వరకు డౌన్‌స్ట్రీమ్ డేటా వేగాన్ని సాధించడానికి 'క్యు' (కెయు) బ్యాండ్‌ని ఉపయోగిస్తాయి. అంతరిక్షంలో ఒక నిర్దిష్ట బిందువు వద్ద ఉపగ్రహాన్ని భూమి నుండి కదలకుండా కనిపించే కక్ష్యలో ఉంచుతారు. దీని ఫలితంగా ఉపగ్రహం భూమి చుట్టూ ఒక కక్ష్యను ఖచ్చితంగా 24 గంటల్లో లేదా ఒక రోజులో పూర్తి చేస్తుంది. భూస్థిర ఉపగ్రహాలు ప్రత్యేకంగా భూమి యొక్క భూమధ్యరేఖకు నేరుగా 22,300 మైళ్ల ఎత్తులో ఉంచబడతాయి. ఉపగ్రహం ద్వారా పంపబడిన సమాచారం కాంతి వేగంతో కదులుతుంది. ఇది సెకనుకు 1,86,000 మైళ్ళు. అయితే కక్ష్యలో ఉన్న ఉపగ్రహం భూమి నుండి ఉండే ఈ దూరాన్ని నాలుగు సార్లు ప్రయాణించాలి. అంటే కంప్యూటర్ నుండి ఉపగ్రహానికి, ఉపగ్రహం నుండి నాక్ లేదా ఇంటర్నెట్‌కు, అక్కడనుండి ఉపగ్రహానికి, చివరకు ఉపగ్రహం నుండి కంప్యూటర్‌కు తిరిగి వెళ్ళాలి. ఈ మొత్తం ప్రయాణాన్ని పూర్తి చేయడానికి పట్టే సమయాన్ని జాప్యం అంటారు. ఇది దాదాపు అర సెకను.

**ప్రయోజనాలు:**

సాంప్రదాయ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు అందుబాటులో లేని ప్రాంతాలకు చేరుకోవడం ద్వారా ప్రపంచ ఇంటర్నెట్ కనెక్టివిటీకి మద్దతు ఇచ్చే శక్తివంతమైన సాంకేతికతగా మారింది. ఇది చాలా ప్రాంతాన్ని కవర్ చేస్తుంది. ఇప్పటివరకు ఇంటర్నెట్ సేవలు అందని మారుమూల, గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ అందిస్తాయి. స్థిర ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు లేకుండా తరచుగా ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్లేవారికి, వ్యాపారాలు, ప్రభుత్వ సంస్థలు, హై స్పీడ్ ఇంటర్నెట్ యాక్సెస్ అవసరమయ్యే వ్యక్తులకు, సమాచార ప్రసారానికి, ప్రభుత్వ సంస్థలను అనుసంధానించడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, ఎత్తైన భవనాలు, సాంకేతిక సమస్యల కారణంగా అంతరాయాలకు గురయ్యే భూసంబంధమైన నెట్‌వర్క్‌ల మాదిరిగా కాకుండా ఉపగ్రహ కనెక్షన్‌లు భూమిపై భౌతిక అడ్డంకుల వల్ల ప్రభావితం కావు. సవాలుతో కూడిన వాతావరణాలలో, అత్యవసర సమయాల్లో కూడా నిరంతరాయంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని ఆస్వాదించవచ్చు. ఆర్థిక అభివృద్ధి, విద్య, కమ్యూనికేషన్‌ను ప్రోత్సహించడంలో సహాయపడతాయి. స్థిరమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ అవసరమైన సముద్ర, విమానయాన పరిశ్రమలలో కూడా ఉపగ్రహ ఇంటర్నెట్ ఉపయోగపడుతుంది.

**సవాళ్లు పరిమితులు:**

ఉపగ్రహ ఇంటర్నెట్ ప్రధాన లోపాలలో ఒకటి జాప్యం. ఇది వినియోగదారు పరికరం అంతరిక్షంలో ఉపగ్రహం మధ్య డేటా సిగ్నల్‌లను ప్రసారం చేయడంలో ఆలస్యాన్ని సూచిస్తుంది. ఇది భూసంబంధమైన నెట్‌వర్క్‌లతో పోలిస్తే నెమ్మదిగా కనెక్షన్ వేగానికి దారితీస్తుంది. ఇది ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ లేదా వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి రియల్-టైమ్ కమ్యూనికేషన్ అవసరమయ్యే కార్యకలాపాలపై ప్రభావం చూపుతుంది. పరికరాలు, సేవా ప్రణాళికల ఖర్చు, సెటప్ చేయడానికి సాధారణంగా ఉపగ్రహ డిష్ పరికరాలు, ఇన్‌స్టాలేషన్ ఫీజులు, నెలవారీ సబ్‌స్క్రిప్షన్, ఖర్చులలో ప్రారంభ పెట్టుబడి అవసరం. పరిమిత ఆర్థిక వనరులు కలిగిన వ్యక్తులు లేదా వ్యాపారాలకు, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో చాలా ఖరీదైనది కావచ్చు. బ్యాండ్‌విడ్త్ పరిమితులు, జాప్యం సమస్యలు, వాతావరణ జోక్యం, సిగ్నల్ అంతరాయాలు, వేగ వైవిధ్యాలు, భద్రతా సమస్యలు, గోప్యతా ప్రమాదాలు ఉపగ్రహ ఇంటర్నెట్ యొక్క కీలక సవాళ్లు. ఈ అడ్డంకులు సజావుగా కనెక్టివిటీకి ఆటంకం కలిగిస్తాయి. వాతావరణ జోక్యం, అధిక ఖర్చులు, సైబర్ భద్రతా దుర్బలత్వాలు వంటి సవాళ్లను ఎదుర్కొంటుంది. సంకేతాలు భూమి, ఉపగ్రహాల మధ్య చాలా దూరం ప్రయాణించాలి. ముఖ్యంగా జియోస్టేషనరీ ఎర్త్ ఆర్బిట్ (జియో) ఉపగ్రహాలతో గుర్తించదగిన జాప్యాలు ఏర్పడతాయి. బ్యాండ్‌విడ్త్ పరిమితులు ఇంటర్నెట్ కనెక్షన్ సామర్థ్యం, వేగాన్ని ప్రభావితం చేస్తాయి. వర్షం, మంచు, ఇతర వాతావరణ పరిస్థితులు సిగ్నల్ ప్రసారానికి అంతరాయం కలిగించవచ్చు. దీని వలన సిగ్నల్ నష్టం లేదా డేటా రేట్లు తగ్గుతాయి. ఉపగ్రహ ఇంటర్నెట్‌కు అవసరమైన పరికరాలు, ఉపగ్రహ డిష్ సంస్థాపనతో సహా ఖరీదైనవి కావచ్చు. ఉపగ్రహాలకు స్పష్టమైన లైన్-ఆఫ్-సైట్ ఉన్న ప్రాంతాలలో ఉపగ్రహ ఇంటర్నెట్ అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. ఇది జనసాంద్రత కలిగిన పట్టణ ప్రాంతాలలో లేదా అడ్డంకిగా ఉండే భూభాగాలు ఉన్న ప్రాంతాలలో సవాలుగా ఉంటుంది. ఇంటర్నెట్ కోసం వేలాది ఉపగ్రహాలను ప్రయోగించడం వల్ల అంతరిక్ష శిథిలాల గురించి ఢీకొనే అవకాశం గురించి ఆందోళనలు తలెత్తుతున్నాయి. ఉపగ్రహాలు జామింగ్, హ్యాకింగ్, ఇతర సైబర్ దాడులకు గురవుతాయి. ఇవి ఇంటర్నెట్ కమ్యూనికేషన్‌కు అంతరాయం కలిగిస్తాయి.


ఉపగ్రహ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి అమలు చేయడానికి అయ్యే అధిక వ్యయం కొన్ని కంపెనీల ప్రవేశానికి అడ్డంకిగా ఉంటుంది. ఇవన్నీ వినియోగదారు అనుభవాన్ని ప్రభావితం చేస్తాయి. కార్యాచరణ అడ్డంకులను కలిగిస్తాయి. వీటిని అధిగమించడానికి ఉపగ్రహ ఇంటర్నెట్ యాక్సెస్‌ను మెరుగుపరచడానికి డిజిటల్ అంతరాన్ని సమర్థవంతంగా తగ్గించడానికి వినూత్న పరిష్కారాలు, నియంత్రణ అమరిక సాంకేతిక పురోగతులు అవసరం.


**జనక మోహన రావు దుంగ**
**యం.యస్సీ ( ఫిజిక్స్ )**
**8247045230**


# తొలితరం దళిత కవి కుసుమ ధర్మన్న



మాకొద్దీ నల్ల దొరతనం.. అంటరానితనంపై పోరు సలిపిన తొలి తరం దళిత కవి కుసుమ ధర్మన్న,తన కలంతో, గళంతో ఏకకాలంలో అంటరానితనంపై పోరు సలిపిన కవి కుసుమ ధర్మన్న. సంఘసంస్కరణ అభిలాష కలిగిన ఆయన అంబేద్కర్ నుంచి స్ఫూర్తి పొందారు. కందుకూరి వీరేశలింగం ద్వారా ప్రభావితమయ్యారు. 'మాకొద్దీ నల్ల దొరతనం' అంటూ నినదించిన ఆయన జాతిని మేల్కొల్పే దిశగా ఎన్నో రచనలు చేశారు. నిమ్న జాతి ముక్తి తరంగిణి, నల్ల దొరతనం, హరిజన శతకం వంటివి ఆయన కలం నుంచి జాలువారినవే. రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపు పేటలో,కుసుమ నాగమ్మ, వీరస్వామి,దంపతులకు 17/03/1900 నాడు జన్మించాడు. వైద్య విద్వాన్, సంస్కృతం,ఆంధ్రం, ఆంగ్లం, హిందీ,ఉర్దూలలో, పాండిత్యం కలిగిన వ్యక్తి, నిమ్న జాతి, ముక్తి తరంగిణి, నల్ల దొరతనం, హరిజన శతకం, మాకొద్దీ నల్ల దొరతనం, వంటి రచనలు చేశారు. చదువుకున్న రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం, చేత ప్రభావితం అయ్యారు. భారతరత్న డా, బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తి పొంది, అంటరానితనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించిన తొలి తరం



దళిత కవి కుసుమ ధర్మన్న.

తెలుగు వారి తొలి సాహిత్య రాజధాని రాజమహేంద్ర వరం, కార్యక్షేత్రంగా జాతీయోద్యమ కాలంలో దళితుల కోసం పొలికేక వేసిన వాడు కుసుమ ధర్మన్న కవి. 1900లో పుట్టి 17 ఏప్రిల్ 1945లో నడి వయసులో నే కన్ను మూసిన ధర్మన్న, జీవించిన జీవితం అటు దేశానికీ, ఇటు దళిత జాతికి అంకితం చేసిన త్యాగశీలి. సాంఘిక, సాంస్కృతిక, సాహితి రంగాలలో కుసుమ ధర్మన్న వేసిన ముద్ర అనితర సాధ్యమైంది. బహుముఖినమైన ధర్మన్న ప్రతిభ ప్రధానంగా ఐదు మార్గాల్లో విస్తరించింది. వైద్యరంగం, సాహిత్య సృజన,కళా రంగం, పత్రిక నిర్వహణ, వాక్చాతుర్యం. ఈ పంచ గుణాలతో ధర్మన్న ఆనాటి ఆంధ్ర సమాజాన్ని ముఖ్యంగా దళిత జాతిని ఉత్తేజపరిచాడు. వైద్య విద్వాన్ పరీక్ష ఉత్తీర్ణుడు అయినా ధర్మన్న తను నేర్చి వైద్యాన్ని పేద సమాజం కన్నెత్తి చూడ నిరాకరించిన గ్రామీణులకు పేద దళితులకు అందించిన ప్రజా వైద్యుడు. ఆధునిక ప్రజా వాగ్గేయకారుడు, ధర్మన్న తొలి రోజుల్లో గాంధీ సిద్ధాంతాల వైపు చూసిన దళిత విముక్తికి అంబేద్కర్, శరణ్యమని నమ్మి అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. జయభేరి పత్రికను స్థాపించిన తొలి దళిత పత్రిక సంపాదకుడు కుసుమ ధర్మన్న. 1925 నుండి ఆంధ్ర దేశంలో అనేక ప్రాంతాల్లో జరిగిన అఖిలాంధ్ర మహాసభల్లో ధర్మన్న ఆలోచనత్మకమైన , ఉద్వేగమైన ప్రసంగాలు ఎన్నో చేశాడు. ధర్మన్న రచనలు 1, నిమ్న జాతి విముక్తి తరంగణి, (1921) 2) నిమ్న జాతుల ఉత్పత్తి, మద్యపాన నిషేధం, అంటరాని వాళ్ళ( కథలు) హరిజన శతకం వంటి రచనలు చేశాడు.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో కవిగా, రచయితగా కుసుమ ధర్మన్న స్థానం అద్వితీయమైనది. దళిత పోరాట చరిత్రలోను ఆయనకు ఆయనే సాటి అందుకే వారి ఆశయాలను ఆలోచనలను, ఉద్యమ స్ఫూర్తిని, సామాజిక సేవను, సమత వాదాన్ని, నేటి తరానికి తెలియజేయాలని ఉద్దేశంతో నేటికీ తను చేసినటువంటి రచనలు, సేవలు, చిరస్థాయిగా నిలిచే ఉన్నాయి.

**మార్చి 17న కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా..**


**దేవులపల్లి రమేశ్,**
**సిద్దిపేట జిల్లా,**
**9963701294**




## చాన్పి వెనుక శాస్త్రం

భక్తి

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల మహిళలు ఉదయం నిద్ర లేవగానే వాకిలి ఊడ్చి, ఆవుపేడ నీళ్లు చల్లి, ముగ్గులు పెడతారు. ఇలా, ఆవుపేడ నీళ్లు చల్లడాన్నే కళ్లాపి చల్లడం, చాన్పి చల్లడం అంటారు. కొందరు రోజువారీ కాకపోయినా పండుగలు వంటి ప్రత్యేక సందర్భాల్లో పేడనీళ్లతో కళ్లాపి చల్లుతారు. పూజ చేసుకుంటున్న ప్రాంతాన్ని ముందుగా గోమయం (ఆవుపేడ)తో శుద్ధి చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ విధంగా ఆవుపేడ నీటితో స్థలాన్ని శుద్ధి చేయటం, చాన్పి చల్లడం వెనుక ఎన్నో వైజ్ఞానిక అంశాలు ఉన్నాయి.

%దేశవాళీ ఆవు పేడ కలిపిన నీటినే కళ్లాపిగా చల్లుతారు. ఎందుకంటే, భారతీయ గోవుకు ఉన్న గొప్ప శక్తి మరే ఇతర గోవులకు లేదు. ఆవుపేడ క్రిమి సంహారిణి. అంతేకాదు దేశీ ఆవుల మూత్రంలో, పేడలో ఎన్నో ఉపయోగకరమైన మిత్రక్రిములు ఉంటాయి. కేవలం వాటి ద్వారా మాత్రమే మనం భూమిని సారవంతం చేయవచ్చు. ఒక గ్రాము దేశీ ఆవు పేడలో 300 కోట్ల మిత్ర క్రిములు ఉన్నాయని పలు పరిశోధనల్లో తేలింది. మిత్రక్రిములు (మంచి బ్యాక్టీరియా) అంటే భూమికి, మనిషికి, ప్రకృతికి మేలు చేకూర్చేవి. మనిషి శరీరంలో కూడా కొన్ని మిత్రక్రిములు ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థ సజావుగా సాగడంలో ప్రధానపాత్ర పోషిస్తాయి.యాంటి-బయాటిక్స్ అధికంగా సేవించడం వల్ల ఇవి నశించి, ఉదర, పేగు సంబంధిత రోగాలు వస్తాయి. దేశవాళీ ఆవుపేడలో ఉండే మిత్రజీవాలు కూడా అందరికి మేలుచేస్తాయి. జీవరాశి నుంచి వెలువడిన మలం అత్యంత రోగకారకమైందిగా ఉంటుంది. కానీ, దేశవాళీ ఆవుపేడ మాత్రం అందుకు పూర్తి భిన్నం. అది ఆరోగ్యానికి హేతువు.

వర్తమానంలో మనం అనేక కారణాల వల్ల రేడియేషన్ ప్రభావానికి గురవుతున్నాం. ఈ రేడియేషన్ బారి నుంచి ఆవుపేడ మనల్ని కాపాడుతుంది. ఆవుపేడతో అలికిన ప్రాంతం రేడియోధార్మికశక్తిని నిరోధిస్తుందని పరిశోధనల్లో నిరూపితమైంది. ఇంటి పైభాగంలో ఆవుపేడతో అలికితే ఇంట్లోకి రేడియోధార్మికత ప్రవేశించదు. ఆవుపేడ యాంటి-సెప్టిక్ లక్షణాలు కలిగి ఉంటుంది. ఈ కారణంగానే పవిత్ర ప్రదేశాల్లో, వంటగదిలో, ఇల్లంతా ఆవుపేడను అలికే సంప్రదాయం ఏర్పడింది. ఆవుపేడతో అలికిన ప్రాంతం హానికారక బ్యాక్టీరియాకు దూరంగా ఉంటుంది.

ఈ నాటికి కొన్ని తెగలవారు బాలింతలకు జ్వరం వచ్చినప్పుడు చికిత్సకు ఆవుపేడనే ఉపయోగిస్తారు. ఆవుపేడను నీటిలో కలిపి చల్లడం వలన ఇంటిలోనికి ఈగలు, దోమలు రావు. ఇన్ని విశిష్టతలు ఉన్నాయి కనుకే ఆవుపేడతో కళ్లాపి చల్లుతారు. ఇల్లు అలుకుతారు. ఇంటిని శుభ్రం చేయడానికి వాడే ఫినాయిల్, ఇతర వస్తువులు మొదలైనవి శ్వాసకోశ సంబంధిత వ్యాధులను కలిగిస్తాయి. పాదాల పగుళ్లకు కూడా ఇవి ఒక కారణం. రసాయనికమైన ఫినాయిల్‌కు భిన్నంగా ఆవుపేడ కళ్లాపి చల్లడం ద్వారా విడుదలయ్యే వాయువులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులను నివారిస్తాయి.ఈ విధంగా గోమయం అనేకరకాలైన వ్యాధులను నివారించడంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నది. ఇంతటి సర్వోన్నతమైన వైజ్ఞానిక కోణం ఉన్నది కాబట్టే, మన పూర్వికులు ఆచారాలు, సంప్రదాయాలు, శాస్త్రాలు పేరుతో ఆవుపేడ నీటితో చాన్పి చల్లడాన్ని మన సంస్కృతిలో భాగం చేసారు.



# నవతార

## కడుపునొప్పి తగ్గాలంటే..!

**అల్లం రసం**
జీర్ణ సమస్యలకు అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. దీనిలో జింజరోల్, షోగోల్ వంటి కాంపౌండ్స్ జీర్ణకోశంలో వచ్చే వాపులను, నొప్పిని తగ్గిస్తాయి. అల్లం... పిత్తం సక్రమంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల అజీర్ణ సమస్య తగ్గుతుంది. కడుపు నొప్పి వచ్చినప్పుడు కొద్దిగా అల్లం రసాన్ని తేనెలో కలిపి తీసుకుంటే సత్వర ఉపశమనం కలుగుతుంది.

**పిప్పర్‌మెంట్**
పిప్పర్‌మెంట్‌లో మెంథాల్ ఉంటుంది. ఇది జీర్ణకోశంలోని వాపును తగ్గిస్తుంది. పేరుకుపోయిన గ్యాసును తొలగిస్తుంది. పేగుల్లో నొప్పిని కూడా తగ్గిస్తుంది. కడుపునొప్పి వచ్చిన వారు - కొద్దిగా



పిప్పర్‌మెంట్ ఆయిల్ కలిపిన వేడినీళ్లను తాగటం వల్ల నొప్పి తగ్గుతుంది.
జీలకర్ర..జీలకర్రలో ఎనిటెహాల్ అనే పదార్థం ఉంటుంది. ఇది జీర్ణకోశంపై పనిచేసి వాపును తగ్గిస్తుంది. అజీర్తి సమస్య ఉన్నవారు క్రమతప్పకుండా జీలకర్ర నీళ్లను తాగటం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది.
పసుపు..పసుపులో కుర్క్యుమిన్ అనే ఒక కాంపౌండ్ ఉంటుంది. దీనికి జీర్ణవ్యవస్థలో కలిగే ఇబ్బందులను తొలగిస్తుంది. కడుపులో గ్యాస్ పేరుకుపోయినప్పుడు - గోరువెచ్చని పాలలో పసుపు వేసుకొని తాగితే ఉపశమనం లభిస్తుంది.



# మార్పు మేస్త్రీలు







***కేరళలోని పలు ప్రాంతాల్లో మేస్త్రీలు, కార్పెంటర్లు, ప్లంబర్లు... ఇలా భవన నిర్మాణ పనులన్నిటిలో ఇప్పుడు మహిళలే ఎక్కువగా కనిపిస్తున్నారు. పదిమంది, ఇరవై మంది కాదు.. వారి సంఖ్య అయిదు వేలమందికి పైనే ఉంది. దీని వెనుక ఉన్న శక్తి... 79 ఏళ్ళ తెరేసమ్మ మాథ్యూస్. ఆమె సంకల్పం మూడున్నర దశాబ్దాలుగా ఎందరో మహిళల ప్రగతికి పునాదులు వేస్తోంది.***

**మార్పు మేస్త్రీలు...**
అది 1989వ సంవత్సరం. మహిళా కార్మికుల స్థితిగతుల మీద ఒక స్వచ్ఛంద సంస్థ తరఫున అధ్యయనం చేయడం కోసం తెరేసమ్మ మాథ్యూస్ కేరళలోని కొట్టాయం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె ఊహకు అందనంత తీవ్ర స్థాయిలో ఉన్నాయి. వేధింపులు, వివక్ష, అసమానతలు... దాదాపు ప్రతి మహిళా వీటికి గురి అవుతున్నారని గుర్తించారు. "నేను కలిసినవారిలో చాలామంది వితంతువులు. వారు కుటుంబాలను పోషించడానికి రకరకాల పనులు చేస్తున్నారు. వారితో మాట్లాడినప్పుడు "మాకు మగవారికి ఇచ్చే వేతనంలో సగమే ఇస్తారు. వారికి 50 రూపాయలిస్తే, మాకు 25 రూపాయలే దక్కుతాయి. కానీ వారు చేసినంత పనీ చెయ్యాలి" అని ఆవేదన చెందారు. ప్రభుత్వ సంస్థలు ద్వారా జరిగే నిర్మాణ పనుల్లో కూడా ఇదే తీరు. ఇక 'సమాన పని, సమాన వేతనం' అనే మాటకు అర్థం ఏమిటి? అనిపించింది అని గుర్తు చేసుకున్నారు తెరేసమ్మ. కొందరు సీనియర్ అధికారులను కలిసి వేతనాలను సమానంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.'ఎవరు ఎంత పని చేశారనేది ముఖ్యం కాదు, మగవారికి మహిళలకన్నా ఎక్కువ చెల్లించాలి. అంతే!" అన్న మాటలు తెరేసమ్మను దిగ్భ్రాంతికి గురిచేశాయి. పైగా పని చేసే చోట మహిళలు రకరకాల వేధింపులు కూడా ఎదుర్కొంటున్నారు. వారి సమస్యకు తగిన పరిష్కారం చూపించాలని ఆమె భావించారు.

ఎన్నో అభ్యంతరాలు..తెరేసమ్మ కేరళలోని కొట్టాయం జిల్లా పాలా పట్టణంలో పుట్టి పెరిగారు. బడిలో చదువుతున్న రోజుల్లోనే... దైవ సేవకు జీవితాన్ని అంకితం చేయాలనీ, నన్‌గా కావాలనీ నిశ్చయించుకున్నారు. "అదే సమయంలో ఒక సినిమా చూశాను. అందులో కథానాయిక గ్రామసేవిక. పేదల శ్రేయస్సుకోసం పని చేస్తుంది. వారి పిల్లలకు చదువు చెబుతుంది, ఆరోగ్యం గురించి సూచనలు ఇస్తుంది. వారితో మమేకం అవుతుంది. దాదాపు అరవయ్యేళ్ళ క్రితం... ఆ పాత్ర నాకు చాలా కొత్తగా అనిపించింది. ప్రజల్లోనే ఉంటూ, వారికోసం పని చెయ్యాలనుకున్నాను. చదువు పూర్తి చేసుకొని, 21 ఏళ్ళ వయసులో నన్‌గా మారాను. 'ఒబ్లేట్ మిషనరీస్ ఆఫ్ మేరీ ఇమ్మాక్యులేట్' అనే సంఘంలో చేరాను. అప్పటినుంచి వివిధ సంస్థలతో కలిసి సామాజిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాను" అని చెప్పారామె. 'పని ప్రదేశాల్లో లింగ వివక్షను, వేతనాల్లో అసమానత్వాన్ని రూపుమాపడానికి ఏం చెయ్యాలి?' అని ఎంతో ఆలోచించిన తరువాత... 1989లో పన్నెండు మంది మహిళలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. వారికి నిర్మాణ పనుల్లో శిక్షణ ఇప్పించారు. వారికి ఉపా?ధి కల్పన అంత సులువుగా జరగలేదు. "ఇటుకలు, ఇసుక, రాళ్ళు, నీరు మోసుకురావడం, గోడల్ని తడపడం లాంటి పనులే మహిళలు చేయాలి. మిగిలిన పనులకు వాళ్ళు పనికిరారు" అంటూ పురుష మేస్త్రీలు, కాంట్రాక్టర్లు, కింది స్థాయి అధికారులు అభ్యంతరపెట్టారు. అప్పుడు తెరేసమ్మ ఉన్నతాధికారులను కలుసుకున్నారు. సమస్యను వారికి వివరించారు. శిక్షణ పొందిన మహిళలకు నైపుణ్యం ఉందని, తొలుత చిన్న చిన్న పనులను ఇంజనీర్ల పర్యవేక్షణలో చేయించి, నాణ్యతను నిర్ధారించాలని కోరారు. వారి పనితనానికి తను హామీగా ఉంటానని చెప్పి ఒప్పించారు. వారి పనితీరు సంతృప్తికరంగా ఉండడంతో... ఇంకొన్ని కాంట్రాక్టులను అధికారులు వారికి అప్పగించారు. క్రమంగా ప్రైవేటు పనులు కూడా రావడం మొదలయింది.

**మహిళలే చుక్కాని**
"అందరూ మహిళలే ఉన్న భవన నిర్మాణ కార్మిక బృందం ప్రయోగం విజయవంతం కావడం, వారు పురుషులతో సమానమైన వేతనం పొందడం, పైగా వేధింపులకు ఆస్కారం లేకపోవడంతో ఎందరో మహిళలు ఆ పని పట్ల ఉత్సాహం చూపించారు. వీలైనంతమందికి శిక్షణ ఇప్పిస్తూ వచ్చాను. వారందరికీ చక్కటి ఉపాధి లభించింది. ఇలా కొన్నేళ్ళు కొనసాగించిన తరువాత... వారి శిక్షణ కోసం పూర్తి స్థాయి సంస్థ ఒకటి అవసరమని భావించాను. 2004లో.. కొట్టాయం జిల్లాలోని ఎట్టుమనూరులో 'అర్చన ఉమెన్స్ సెంటర్'ను ప్రారంభించాను" అని వివరించారు తెరేసమ్మ. ఈ కేంద్రంలో భవన నిర్మాణానికి కావలసిన అన్ని పనుల్లో మహిళలకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. ఇప్పటి వరకూ 5 వేల మందికి పైగా మహిళలు వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. వారి కాళ్ళమీద వారు నిలబడుతున్నారు. హుందాగా, గౌరవంతో జీవిస్తున్నారు. ఆ ప్రాంతాల్లో... వృత్తినైపుణ్యం, ఆత్మస్థైర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కోరుకొనే పేద వర్గాల మహిళలకు ఇప్పుడు ఈ కేంద్రం ఒక గమ్యస్థానంగా మారింది. "ఏ కుటుంబానికైనా చుక్కాని మహిళలే. వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. ఒక మహిళగా వారికి అండగా నిలవాలన్న చిన్న ఆశయమే ఈ కేంద్రం ఏర్పాటుకు నాంది పలికింది. మహిళలు తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటేనే అస్తిత్వాన్ని కాపాడుకోగలరు. దానికి నా స్థాయిలో నేను దోహదం చేస్తున్నాను" అని అంటారు తెరేసమ్మ వినయంగా.

**స్వావలంబనకు పునాదిగా...**కేరళలోని కొట్టాయం, అళప్పుళ, ఇడుక్కి, ఎర్నాకుళం ప్రాంతాల్లో 'అర్చన ఉమెన్స్ సెంటర్' శాఖలు నడుస్తున్నాయి. అవి వారి ఆర్థిక స్వావలంబనకు పునాదిగా నిలుస్తున్నాయి..కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన యువతులు, మహిళలు వాటిలో శిక్షణ పొందుతున్నారు. ఈ కేంద్రాల్లో మేస్త్రీ పని, కార్పెంటరీ, బ్యాంబూ-ఫెర్రో-టెక్నాలజీ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు, ఇటుకల తయారీ లాంటి అనేక అంశాల్లో శిక్షణ స్తారు. నిర్మాణరంగంలో చోటుచేసుకుంటున్న పురోగతులకు అనుగుణంగా శిక్షణలో మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రస్తుతం పర్యావరణ అనుకూల నిర్మాణ విధానాలను కూడా ఈ కేంద్రంలో బోధిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందినవారిలో చాలామంది కేరళ ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టుల్లో, గ్రామాల్లో నీళ్ళ ట్యాంకులు, ఇంకుడు గుంతల నిర్మాణంలో పని చేస్తున్నారు. బృందాలుగా ఏర్పడి... ప్రైవేటు నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. కొట్టాయం యూనిట్‌లో మహిళా కార్పెంటర్లు ఫర్నీచర్ తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటివరకూ అయిదువేల మందికి పైగా ఈ శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీన్ని ఉపాధిగా ఎంచుకున్న మహిళలకు వారు చేసే పని, అనుభవం, నైపుణ్యాన్ని బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేలకు పైగా కనీస ఆదాయం లభిస్తోంది.

# ఫ్రీజర్‌లో మంచు గడ్డ కడుతోందా?

## మంచు ఎందుకు ఏర్పడుతుంది?



ఫ్రిజ్ తలుపు సరిగా మూసుకోకపోతే బయటి గాలి లోపలికి వెళ్లి మంచును ఏర్పరుస్తుంది. తలుపు అంచులకు లోపల ఉండే రబ్బరు పట్టీ పాడయినా ఈ సమస్య వస్తుంది.
ఫ్రిజ్‌లోని అదనపు నీటిని బయటికి పంపడంలో ముఖ్య పాత్ర వహించే కాయిల్ దెబ్బతింటే లోపల మంచు పేరుకుంటుంది.
ఫ్రిజ్‌లో ఉండే వాటర్ ఫిల్టర్ సరిగ్గా పనిచేయకపోయినా ఫ్రీజర్‌లో మంచు గడ్డలా ఏర్పడుతుంది.
ఫ్రీజర్ పైప్ మూసుకున్నప్పుడు కూడా లోపల భారీగా మంచు తయారవుతుంది.
మంచును వెంటనే తొలగించే చిట్కాలు...
ముందుగా ఫ్రిజ్‌కు విద్యుత్ సరఫరా ఆపివేయాలి. ఒక గ్లాసు వేడినీళ్లను ఫ్రీజర్‌లో పోయాలి. వెంటనే మంచు కరిగిపోతుంది
వెడల్పాటి పాత్రలో వేడి నీళ్లు పోసి ఫ్రీజర్‌లో ఉంచి తలుపు వేయాలి. పావు గంటలో మంచు మొత్తం కరిగిపోతుంది
ఫ్రీజర్ తలుపు తీసి హెయిర్ డ్రైయర్ ఆన్ చేయాలి. డ్రైయర్ నుంచి వచ్చే వేడి గాలికి మంచు గడ్డ కరుగుతుంది.
ఫ్రీజర్ నుంచి మంచు ముక్కలను తొలగించడానికి స్టీల్ లేదా ఇనప చెంచాలు, గంటెలు ఉపయోగించ కూడదు. చెక్క చెంచాలు మాత్రమే వాడాలి.

# సురక్షితంగానే ఉన్నాం



ఆన్‌లైన్‌లో తాము సురక్షితంగానే ఉన్నట్లు.. 46 శాతం మంది భారతీయ మహిళలు చెబుతున్నారు. 'షీ శక్తి సురక్ష సర్వే-2025'లో భాగంగా.. ఆన్‌లైన్ భద్రత గురించి మహిళల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 46 శాతం మంది తాము ఆన్‌లైన్‌లో భద్రంగానే ఉన్నట్లు చెప్పగా.. 17 శాతం మంది ఆన్‌లైన్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. 38 శాతం మంది తటస్థంగా ఉన్నారు. సర్వేలో భాగంగా దేశవ్యాప్తంగా 20 నగరాల్లోని 8,000 మంది నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. నగరానికి 400 మంది చొప్పున కంప్యూటర్-అసిస్టెడ్ టెలిఫోన్ ఇంటర్వ్యూయింగ్ ద్వారా డేటాను సేకరించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ భద్రతకు సంబంధించి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, అవగాహన కార్యక్రమాలు.. ఇతర విషయాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.
ఇందులో భాగంగా ఆన్‌లైన్ భద్రతా చర్యలపై మహిళల్లో విశ్వాసం ఎక్కువగా ఉన్నట్లు తేల్చారు. గతంతో పోలిస్తే ఆన్‌లైన్ సెక్యూరిటీపై 47 శాతం మంది నమ్మకం వ్యక్తంచేశారు. ఇందుకోసం ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు కనిపిస్తున్నప్పటికీ.. వాటి ప్రభావంపై ఇంకా నమ్మకంగా కలగడం లేదని 17 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు సఫలమైనట్లు 32 శాతం మంది చెప్పగా.. 30 శాతం మంది అసంతృప్తి వ్యక్తంచేశారు.

# వెజ్ రోల్స్..తయారీ విధానం..



**కావలసిన పదార్థాలు**
మైదా: అరకప్పు, కార్న్‌ఫ్లోర్: రెండు టేబుల్ స్పూన్లు, టమాట, క్యారెట్, ఆలుగడ్డ, క్యాప్సికమ్ ముక్కలు: రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, పచ్చిమిర్చి: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, నూనె: పావు కప్పు, ఉప్పు: తగినంత, కారం: ఒక టీస్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం**
పాన్‌లోని నూనె వేడయ్యాక సన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ వేయాలి. అవన్నీ వేగాక క్యారెట్, ఆలు, క్యాప్సికమ్, టమాట ముక్కలు వేసి బాగా వేయించాలి. కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, గరం మసాలా, కొత్తిమీర తురుము జోడించి మరో మూడు నిమిషాలు వేయించి దించి చల్లార్చుకోవాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్‌ఫ్లోర్, ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి బాగా కలిపి, తగినన్ని నీళ్లు పోసుకుని ముద్దలా చేసుకుని పావుగంటపాటు నాన బెట్టాలి.పిండిని కొద్దికొద్దిగా తీసుకుని పలుచని చపాతీల్లా చేసుకోవాలి. స్టవ్ మీద పెనం పెట్టి చపాతీలను పది సెకన్లపాటు రెండువైపులా కాల్చి తీసేయాలి. ఇప్పుడు ఒక్కో చపాతీ మధ్యలో కూరగాయల మిశ్రమం పెట్టి అన్నివైపులా మూసి రోల్స్‌లా చుట్టుకుని చివర్లను మైదా నీళ్లతో అంటించాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడయ్యాక చుట్టి ఉంచిన రోల్స్ వేసి దోరగా కాల్చుకుంటే కరకరలాడే వెజ్ రోల్స్ రెడీ.



# ఆ హాలీవుడ్ సూట్లు మనవే





శ్రీసిటీలో ఎమ్మెస్సార్ గార్మెంట్స్ అనే సంస్థ 2010లో తన కార్యకలాపాలు ప్రారంభించింది. దీనిలో ప్రస్తుతం 148 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 120 మంది మహిళలే కావటం ఒక విశేషం. పైగా వీరిలో చాలా మంది ఐదు క్లాసు వరకే చదువుకున్నారు. ఈ సంస్థలో పనిచేసేవారు తమ చేతితో శ్రద్ధగా సూట్లను కుడతారు. వీరు తయారుచేసే సూట్లు మన దేశంలో అందుబాటులో ఉండవు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, స్వీడన్ వంటి దేశాలకు ఎగుమతి అవుతూ ఉంటాయి. వీటి ఖరీదు 2.5 లక్షల నుంచి 11 లక్షల వరకూ ఉంటుంది. "మా దగ్గర తయారయిన సూట్లను ఎక్కువగా హాలీవుడ్ సినిమాల్లో వాడుతూ ఉంటారు.." అని సంస్థ ప్రతినిధి వివరించారు.

**అంత సులభం కాదు..**
సాధారణంగా మనకు మార్కెట్లో లభించే సూట్లు మన శరీర కొలతలకు తగినట్లుగా ఉండవు. చేతితో కుడితే మాత్రం శరీర కొలతలకు అనుగుణంగా ఉంటాయి. ఈ విధంగా కుట్టాలంటే విదేశాలలో చాలా ఎక్కువ ఖరీదు అవుతుంది. అందువల్ల వారు తమ కొలతలను ఈ సంస్థకు పంపిస్తారు. దీనికి అనుగుణంగా ఇందులో పనిచేసే సిబ్బంది సూట్లను కుడతారు. అయితే ఇది సులభమైన పని కాదు. "దీనికి ప్రత్యేక నైపుణ్యం అవసరం. అందుకే మేము ముందు కొద్ది మందిని ఎంపిక చేసుకున్నాం. వారికి సుమారు ఆరేళ్ల పాటు శిక్షణ ఇచ్చాం. వారు బాగా ఆరితేరారని నమ్మకం వచ్చిన తర్వాత ఆర్డర్లు తీసుకోవటం ప్రారంభించాం. మా సంస్థ 2010లో ప్రారంభమయినా - 2016లోనే సూట్లను ఎగుమతి చేయటం ప్రారంభించాం. ప్రస్తుతం మాకు ఏడాదికి 12 కోట్ల టర్నోవర్ ఉంది" అని సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

ఒక మిషన్ ద్వారా తయారుచేసిన సూట్లలో ఎన్ని కుట్లు ఉంటాయో తెలియదు. కానీ చేతితో కుట్టేడప్పుడు కొన్ని వేల కుట్లు వేయాల్సి వస్తుంది. "ఒక మిషన్‌తో సూటు కుడితే ఎనిమిది గంటలు పడుతుంది. మా దగ్గర ఎనిమిది రోజులు పడుతుంది. కానీ ఒక సెంటీమీటర్ కూడా తేడా ఉండదు" అని సంస్థ ప్రతినిధి వెల్లడించారు.
కీర్తికి చిన్నప్పుడే పెళ్లి చేసేశారు. భర్త లారీ డ్రైవర్. ముగ్గురు పిల్లలు. భర్త తెచ్చే డబ్బులతో ఆమెకు ఇల్లు గడవటం చాలా కష్టమయ్యేది. అందుకే కీర్తి కూలిపనికి వెళ్లేది. ఆ సమయంలో తనకు కుట్టు వచ్చని కూడా ఆమెకు తెలియదు. కానీ తనతో పాటు కూలీకి వెళ్లేవారు కొందరు శ్రీసిటీలో చేరితే తాను కూడా వెళ్లింది. అక్కడ సంస్థలో చేరింది. ప్రత్యేకమైన శిక్షణ పొందింది. ప్రస్తుతం నెలకు కీర్తికి నెలకు 20 వేలు వస్తుంది. శ్రీ సిటీలో కీర్తిలాంటి వారు మనకు ఎంతో మంది కనిపిస్తారు.
శ్రీసిటీలో ప్రస్తుతం 34 వేల మందికి పైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏడాదికి 60 వేల కోట్లకు పైగా ఉత్పత్తులు తయారుచేస్తున్నారు. వీటిలో ఎక్కువ శాతం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. బరువులు ఎత్తే ఫోర్క్ లిఫ్టలను నడపటం దగ్గర నుంచి మెయింటినెన్స్ ఇంజినీర్ల వరకు రకరకాల హోదాల్లో పనిచేస్తున్నారు.

## లాభాలతో ముగిసిన మార్కెట్లు.. 340 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్..



**ముంబై-నవభూమి:**గత కొన్ని వారాలుగా భారీగా నష్టపోయిన దేశీయ సూచీలు మళ్లీ లాభాల ట్రాక్ ఎక్కాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కూడా స్టాక్ మార్కెట్లకు కలిసి వచ్చాయి. దీంతో లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, నిఫ్టీ రోజంతా లాభాల్లోనే కదలాడాయి.అమెరికా ఆర్థిక విధానాలతో సతమతమై భారీగా నష్టపోయిన దేశీయ సూచీలు మళ్లీ లాభాల ట్రాక్ ఎక్కాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కూడా స్టాక్ మార్కెట్లకు కలిసి వచ్చాయి. దీంతో లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, నిఫ్టీ రోజంతా లాభాల్లోనే కదలాడాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్, బ్యాంక్ నిఫ్టీ కూడా లాభాలను ఆర్జించాయి గత శుక్రవారం ముగింపు (73, 828)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం స్వల్ప లాభంతో ప్రారంభమైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి దూసుకెళ్లింది. ఒక దశలో దాదాపు 500 పాయింట్లు పెరిగి 74, 376 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. 12 గంటల సమయంలో లాభాలను కోల్పోయినప్పటికీ చివరి గంటలో మళ్లీ కోలుకుంది. చివరకు సెన్సెక్స్ 314 పాయింట్ల లాభంతో 74, 169 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 111 పాయింట్ల లాభంతో 22, 508 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్‌లో ఐఈఎక్స్, ముత్తూట్ ఫైనాన్స్, యూపీఎల్, హుడ్కో షేర్లు లాభాలను ఆర్జించాయి. ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్, ప్రెస్టేజ్ ఎస్టేట్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 336 పాయింట్లు ఎగబాకింది. బ్యాంక్ నిఫ్టీ 293 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.80 గా ఉంది.




## షాకింగ్.. వచ్చే నెల నుంచి పెరగనున్న ఈ వాహనాల ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత దేశంలో అతిపెద్ద ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సోమవారం కీలక ప్రకటన చేసింది. ఈ క్రమంలో తన వాహనాల ధరలను ఏప్రిల్ 2025 నుంచి పెంచుతున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో ధరల పెంపు తీసుకున్నామని, ఇది మోడళ్ల తీరును బట్టి మారుతుందని ఆటోమొబైల్ సంస్థ వెల్లడించింది. మారుతి సుజుకి ఇండియా మార్చి 17న రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని ప్రకటించింది. ధరల పెంపు ప్రకటన తర్వాత మారుతి సుజుకి షేర్ల ధర దాదాపు 2% పుంజుకుంది.


**మారుతి సుజుకి అమ్మకాలు**

మారుతి సుజుకి ఫిబ్రవరి 2025లో మొత్తం 199,400 యూనిట్ల వాహనాలను విక్రయించింది. గత సంవత్సరం ఇదే నెలలో అమ్ముడైన 197,471 యూనిట్ల నుంచి 0.97% స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరి 2025లో మొత్తం అమ్మకాలలో దేశీయ అమ్మకాలు 163,501 యూనిట్లు, ఇతర %ాజువీ%లవి 10,878 యూనిట్ల అమ్మకాలు, 25,021 యూనిట్ల ఎగుమతులు ఉన్నాయి. ఈ క్రమంలో ఎగుమతులు సంవత్సరానికి 13.5% తగ్గుదలను నమోదు చేశాయి.

**మారుతి సుజుకి స్టాక్ ధర పనితీరు**

మారుతి సుజుకి షేర్ ధర ఒక నెలలో 9% కంటే ఎక్కువ పడిపోయింది. మారుతి సుజుకి షేర్లు ఆరు నెలల్లో 5.2% పడిపోగా, ఒక సంవత్సరం కాలంలో 1% స్వల్పంగా పెరిగాయి. కానీ తాజాగా ఈ స్టాక్ ధర పుంజుకుంది. గత రెండు సంవత్సరాలలో మారుతి సుజుకి స్టాక్ ధర 40% ర్యాలీ చేసింది. ఇదే క్రమంలో ఈ కంపెనీ స్టాక్ ఐదు సంవత్సరాలలో 107% మల్టీబ్యాగర్ రాబడిని అందించడం విశేషం.మిగతా సంస్థలు కూడా..అయితే తమ కస్టమర్లపై ప్రభావాన్ని తగ్గించడానికి కంపెనీ నిరంతరం కృషి చేస్తుందని, పెరిగిన ఖర్చులో కొంత భాగాన్ని మార్కెట్‌కు బదిలీ చేయాల్సి వస్తుందని కంపెనీ వెల్లడించింది. మారుతి సుజుకి మొత్తం దేశీయ ప్యాసింజర్ వెహికల్ (%ాఎ%) అమ్మకాలు గత నెలలో 0.32% పెరిగి 160,791 యూనిట్లకు చేరుకున్నాయి. వచ్చే నెల నుంచి ఈ కంపెనీ వాహనాల ధరలు పెరగనున్న నేపథ్యంలో మిగతా సంస్థలు కూడా ఇదే ధోరణి కొనసాగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## త్వరలో ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ తగ్గనుందా..




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం ఆరోగ్య బీమా, జీవిత బీమా ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. ప్రీమియం, జీఎస్టీ విడివిడిగా డబ్బు చెల్లించాల్సి వస్తుండటంతో పాలసీదారులు అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇదే అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తారు ఖమ్మం ఎంపీ ఆర్.రఘురాం రెడ్డి. ఆయన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఇన్స్యూరెన్స్ ప్రీమియం రేట్ల సవరణలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కన్వీనర్ సామ్రాట్ చౌదరి సిఫార్సులు వెల్లడించారు.ఇన్స్యూరెన్స్ ఉత్పత్తులపై ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ఉంది. నిబంధనలకు అనుగుణంగా ప్రీమియంపై జీఎస్టీ విడిగా వసూలు చేస్తారు. ఈ రేటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కూడిన రాజ్యాంగబద్ధ సంస్థ జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై వసూలు చేస్తున్న జీఎస్టీ రేట్లను సవరించేందుకు న్యూఢిల్లీలో 2024 సెప్టెంబర్ 9న జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఏర్పాటైంది. దీనికి బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి కన్వీనర్‌గా ఉన్నారు.2024 డిసెంబర్ 21న జైసల్మేర్ (రాజస్థాన్)లో జరిగిన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మరో మారు ఈ అంశంపై చర్చ జరిగింది. లైఫ్,హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ రేట్ల సవరణల సిఫార్సులు రూపొందించేందుకు మరింత సమయం కావాలని కన్వీనర్ సామ్రాట్ చౌదరి కోరారు. ఇందుకు జీఎస్టీ కౌన్సిల్ అంగీకరించి మరింత సమయం మంజూరు చేసింది. అంటే తన సిఫార్సులు, సూచనలు అందించిన తర్వాతే జీఎస్టీ కౌన్సిల్ ఒక నిర్ణయానికి. అంతవరకూ ఇన్సూరెన్స్ పాలసీదారులకు ఎలాంటి పన్ను ప్రయోజనాలు కలుగుతాయో చెప్పలేమని కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు.

## గుడ్ న్యూస్..రెండో రోజు కూడా తగ్గిన బంగారం, వెండి ధరలు..

**న్యూఢిల్లీ-నవభూమి:**అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, బలహీనపడుతున్న డాలర్ సహా పలు అంశాలు దేశంలో బంగారం ధరలు తగ్గేందుకు సహకరిస్తాయి. దీంతోపాటు బంగారం దిగుమతులపై సుంకాలు తగ్గింపు, బంగారం నిల్వల పెరుగుదల వంటి అంశాలు కూడా వీటి రేట్ల తగ్గింపు విషయంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా భారీగా పెరిగి సుమారు 90 వేల స్థాయికి చేరిన పసిడి ధరలు ప్రస్తుతం స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో నేటి (మార్చి 17న) ధరలు ఎలా ఉన్నాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**ఈరోజు రేట్లు ఎలా ఉన్నాయో తెలుసా..**

మార్చి 17, 2025న గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం విజయవాడ, హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.89,660గా ఉండగా, ఈ ధర నిన్నటితో పోల్చితే స్వల్పంగా రూ. 10 మాత్రమే తగ్గింది. ఇక 22 క్యారెట్ల పసిడి ధర విషయానికి వస్తే 10 గ్రాములకు రూ. 82,190కి చేరుకుంది. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 89,810 స్థాయికి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 82,340కి చేరింది.

**నేటి వెండి రేట్లు**

మరోవైపు వెండి ధరలు కూడా కొంచెం తగ్గిపోయాయి. దీంతో హైదరాబాద్, చెన్నై?లో కిలో వెండి ధర నిన్నటితో పోల్చితే రూ. 100 తగ్గి, రూ. 1,11,900 స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 1,02,900కు చేరింది. పూణే, బెంగళూరు, జైపూర్ వంటి ప్రాంతాల్లో కూడా కిలో వెండి ధర రూ. 1,02,900గా ఉంది.మార్చి 17, 2025న భారతదేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలు (24, 22 క్యారెట్స్)

ముంబైలో రూ. 89,660, రూ.82,190

చెన్నైలో రూ. 89,660, రూ.82,190

# షావోమీ కొత్త పరికరాల్లో ఇండస్ యాప్‌స్టోర్




**న్యూఢిల్లీ-నవభూమి:**భారతదేశపు స్వదేశీ ఆండ్రాయిడ్ యాప్ మార్కెట్‌ప్లేస్ అయిన ఇండస్ యాప్‌స్టోర్, సాంకేతిక ప్రపంచంలో ముందంజలో ఉన్న షావోమీ ఇండియాతో పలు సంవత్సరాల భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఈరోజు ప్రకటించింది. భారతీయ యూజర్ల కోసం వారి మాతృభాషల్లోనే అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసే విషయంలో ఇండస్ యాప్‌స్టోర్, షావోమీ ఇండియాల ఉమ్మడి నిబద్ధతను ఈ ఒప్పందం స్పష్టం చేస్తోంది. భారతదేశంలో ఇకపై విడుదలయ్యే అన్ని కొత్త షావోమీ స్మార్ట్‌ఫోన్లలో ఇండస్ యాప్‌స్టోర్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయడంతో పాటు, ఇదివరకే వినియోగంలో ఉన్న పాత పరికరాల్లో ప్రస్తుతం ఉన్న 'గెట్‌యాప్'ను ఇండస్ యాప్‌స్టోర్‌తో భర్తీ చేయాలని ఈ ఒప్పందంలో నిర్ణయించారు. దీంతో యాప్‌ల యాక్సెసిబిలిటీని, యాప్‌ను వెతికి, పొందడాన్ని, అలాగే అవాంతరాలు లేని యూజర్ ఎక్స్‌పీరియెన్స్‌ను పెంపొందించడంపై ఇండస్ యాప్‌స్టోర్ దృష్టి సారించింది.

ఈ భాగస్వామ్యం గురించి ఇండస్ యాప్‌స్టోర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ప్రియా ఎమ్ నరసింహన్ మాట్లాడుతూ, "భారతీయ మొబైల్ యూజర్లు, అలాగే డెవలపర్లకు సమాన స్థాయిలో అందుబాటులో ఉండే యాప్ స్టోర్‌ను రూపొందించాలనే మా లక్ష్యాన్ని చేరుకోవడంలో, షావోమీ ఇండియాతో మేము కుదుర్చుకున్న భాగస్వామ్యం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. షావోమీ ఇండియా మార్కెట్ పరిధికి, పలు భారతీయ భాషల్లో లభించే మా యాప్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్‌ను అనుసంధానించడం వల్ల, యూజర్లకు నిరాటంకంగా, సాంస్కృతిక పరమైన అనుభవాన్ని అందిస్తూనే యాప్ డెవలపర్లకు చక్కని అవకాశాలను సృష్టిస్తున్నాము. భారతదేశ ప్రజలు మొబైల్ యాప్‌లను గుర్తించే పద్ధతిని, పొందుతున్న అనుభవాన్ని మెరుగుపర్చాలనే మా లక్ష్యానికి ఈ భాగస్వామ్యం ఆరంభం మాత్రమే" అని అన్నారు.

ఈ భాగస్వామ్యంపై షావోమీ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధిన్ మాథుర్ మాట్లాడుతూ, "భారతదేశ డిజిటల్ ఎకోసిస్టమ్ రోజురోజుకీ పెరుగుతూనే ఉండటం వల్ల, స్థానికంగా క్రియేట్ చేసిన, అలాగే స్థానికుల కోసమే డెవలప్ చేసిన యాప్‌లు ఉండే మార్కెట్‌ప్లేస్‌కు మునుపెన్నడూ లేనంత డిమాండ్ ఏర్పడింది. షావోమీ ఇండియాలో విధులు నిర్వహించే మేమంతా, ఎల్లప్పుడూ 'మేక్ ఫర్ ఇండియా' ఆవిష్కరణలకు మద్దతుగా నిలిచాము, అలాగే ఇండస్ యాప్‌స్టోర్‌తో కుదుర్చుకున్న ఈ భాగస్వామ్యం కూడా ఆ దిశలో వేసిన ఒక వ్యూహాత్మక అడుగు ఇండస్.

## టాటా ప్లే సౌత్ టాకీస్ 'యాక్టర్ స్పెషల్'ను ప్రదర్శిస్తోంది: హార్ట్ ఎటాక్ 3 శ్యామ్ సింగరాయ్‌లో యష్-సాయి పల్లవి అద్భుత నటన







**న్యూఢిల్లీ-నవభూమి:**టాటా ప్లే సౌత్ టాకీస్ వరుస బ్లాక్‌బస్టర్‌లతో వేడిని పెంచుతోంది. ఈ మార్చి 15, సాయంత్రం 7 గంటలకు, యష్ అభిమానులు హార్ట్ ఎటాక్ 3తో అన్‌స్టాపబుల్ వినోదాన్ని వీక్షిస్తారు. అతని తీవ్రమైన నటనా నైపుణ్యాలు, అంకితభావంతో కూడిన శైలిని ఈ చిత్రం పునర్నిర్వచించింది. దీని తరువాత, మార్చి 16, సాయంత్రం 7 గంటలకు, శ్యామ్ సింగరాయ్ చిత్రంలో సాయి పల్లవి అద్భుతమైన కళాత్మకతలో ప్రదర్శనలో మైమరచిపోండి. ఇది నటిగా ఆమె అసమానమైన గాంభీర్యాన్ని, నటనా కౌశల్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇవి రెండూ ఇద్దరు ఐకానిక్ స్టార్ల మిస్ చేయకూడని చిత్రాలు- టాటా ప్లే సౌత్ టాకీస్‌లో మాత్రమే వీక్షించండి!

**హార్ట్ ఎటాక్ 3: ది యష్ ఫ్యాక్టర్**

డాక్టర్ సూరి దర్శకత్వం వహించిన 'హార్ట్ ఎటాక్ 3' అనే రొమాంటిక్ కామెడీ నిజానికి కన్నడ చిత్రం 'లక్కీ'కి డబ్బింగ్ వెర్షన్. తన బహుముఖ ప్రజ్ఞ, ఆకర్షణతో గుర్తింపు దక్కించుకున్న యష్, 'కేజీఎఫ్: చాప్టర్ 1 2' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. తాను ప్రేమలో గెలుపొందేందుకు తనను తీరును మార్చుకునే లక్కీ పాత్రను 'హార్ట్ ఎటాక్ 3'లో తన ప్రత్యేకమైన శైలి, శక్తివంతమైన నటనను యశ్ ప్రదర్శించారు. రమ్యతో పాటు యష్ కూడా తమ చక్కని నటనను ప్రదర్శించారు. వారి కామెడీ టైమ్ రొమాంటిక్ అప్పీల్‌ను హైలైట్ చేశారు.

**శ్యామ్ సింగరాయ్: సాయి పల్లవి ప్రతిభ**

మరోవైపు, 'శ్యామ్ సింగరాయ్' అనేది పీరియాడికల్ యాక్షన్ రొమాంటిక్ డ్రామా. ఇందులో నాని సాయి పల్లవి కృతి శెట్టితో కలిసి ద్విపాత్రాభినయంలో నటించారు. 'ఫిదా' 'ప్రేమం' వంటి చిత్రాలలో ఆకర్షణీయమైన నటనకు పేరుగాంచిన సాయి పల్లవి, రోజీగా మారిన దేవదాసి మైత్రేయి పాత్రను పోషించడం ద్వారా కథనానికి మరింత గాఢత జోడిస్తుంది. 'శ్యామ్ సింగరాయ్'లో సాయి పల్లవి పోషించిన పాత్ర కేవలం ఆమె నటనా నైపుణ్యం మాత్రమే కాదు, ఆమె పాత్రలకు ప్రామాణికతను తీసుకురావడంలో కూడా ఆమె సామర్థ్యం గురించి చాటి చెబుతుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు చక్కని అభినందనలను, విమర్శకుల నుంచి ప్రశంసలను అందుకుంది.

'శ్యామ్ సింగరాయ్'లో, పునర్జన్మ ప్రేమ కథకు ఆమె జీవం పోసింది. ఇది ప్రేక్షకులకు ఆకర్షణీయమైన వీక్షణగా మారింది.

**మీరు ఈ చిత్రాలను ఎందుకు చూడాలి**

'హార్ట్ ఎటాక్ 3' 'శ్యామ్ సింగరాయ్' రెండూ ప్రేక్షకులకు ప్రత్యేకమైనదాన్ని అందిస్తాయి. 'హార్ట్ ఎటాక్ 3'లో యష్ బహుముఖ ప్రజ్ఞ 'శ్యామ్ సింగరాయ్'లో సాయి పల్లవి లోతైన నటన ఈ చిత్రాలను దక్షిణ భారత సినిమా అభిమానులకు ఒక విందును అందిస్తాయి. మీరు తేలికపాటి రొమాంటిక్ కామెడీ కోసం చూస్తున్నారా లేదా మలుపులతో కూడిన పీరియాడికల్ డ్రామా కోసం చూస్తున్నారా? అయితే ఈ సినిమాలు మిమ్మల్ని కచ్చితంగా ఆకర్షిస్తాయి.

యష్ సాయి పల్లవిల మాయాజాలాన్ని ప్రత్యక్షంగా అనుభవించడానికి టాటా ప్లే సౌత్ టాకీస్‌లో ఈ చిత్రాలను చూడండి. వారి అద్భుతమైన ప్రదర్శనలు, ఆసక్తికరమైన కథనాలతో, ఈ సినిమాలు ప్రేక్షకులపై శాశ్వత ముద్ర వేస్తాయి.

## కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన: హైదరాబాద్‌లోని లక్డికాపూల్‌లోని గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవ దినోత్సవం

**హైదరాబాద్-నవభూమి:**ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా, గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో కన్సల్టెంట్ యూరాలజిస్ట్ - ఆండ్రాలజిస్ట్ డాక్టర్ విశ్వాస్ ఎం ఆర్, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ధనలక్ష్మి జి, మూత్రపిండాల ఆరోగ్యం వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఒక అవగాహన సెషన్ నిర్వహించారు. ఈ చర్చ పెరుగుతున్న మూత్రపిండ వ్యాధుల భారం ముందస్తుగా గుర్తించడం జీవనశైలి మార్పుల ప్రాముఖ్యతపై దృష్టి సారించింది.మూత్రపిండాల వ్యాధి నివారణకు డాక్టర్ విశ్వాస్ ఎం ఆర్ "8 బంగారు నియమాలను" నొక్కి చెప్పారు. అదనంగా, మూత్రపిండాల్లో రాళ్లను నివారించడానికి ఆచరణాత్మక చిట్కాలను ఆయన అందించారు, వాటిలో నీటి తీసుకోవడం పెంచడం, ఆహారంలో ఉప్పు జంతు ప్రోటీన్లను తగ్గించడం పాలకూర గింజలు వంటి ఆక్సలేట్ అధికంగా ఉండే ఆహారాలను అధికంగా తీసుకోకుండా ఉండటం వంటివి ఉన్నాయి.ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు, హాజరైన వారు సాధారణ యూరాలజికల్ సమస్యల గురించి ఆందోళనలను లేవనెత్తారు నివారణ చర్యలపై మార్గదర్శకత్వం కోరారు. సమస్యలను నివారించడానికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు సకాలంలో వైద్య జోక్యం యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ ధనలక్ష్మి జి నొక్కి చెప్పారు.ఈ కార్యక్రమం విజయవంతమైంది, ప్రజారోగ్య అవగాహన నివారణ ఆరోగ్య సంరక్షణ పట్ల ఆసుపత్రి నిబద్ధతను ఇది మరింత బలపరిచింది.


## జేమ్స్ డైసన్ అవార్డ్ 2025కు ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ రూ.30 లక్షల ప్రైజ్ మనీకి అర్హులైన విద్యార్థులు





**న్యూఢిల్లీ-నవభూమి:**ఇండియా, 13 మార్చి 2025-అంతర్జాతీయ విద్యార్థి డిజైన్, ఇంజనీరింగ్ పోటీ 28 దేశాలు, ప్రాంతాలలో తన 2025 ఏడాదికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. రోజువారీ సవాళ్ల నుంచి ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సమస్యల వరకు, ప్రస్తుత లేదా ఇటీవల పట్టభద్రులైన విద్యార్థులు ప్రజల జీవితాలలో నిజమైన మార్పును తీసుకువచ్చే సమస్య పరిష్కార ఆలోచనలను సమర్పించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.జేమ్స్ డైసన్ అవార్డును 2005లో అందుబాటులో తీసుకువచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు˜1 మిలియన్ (సుమారు రూ.112 మిలియన్లు) ప్రైజ్ మనీ, గ్లోబల్ ప్లాట్‌ఫారమ్‌పై 400 కన్నా ఎక్కువ మంది విద్యార్థుల ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చింది. ఫైనల్ స్థాయికి చేరుకుని, జేమ్స్ డైసన్ ద్వారా ప్రపంచ విజేతలుగా ఎంపిక చేయబడిన వారు˜30,000 (సుమారు రూ.30 లక్షలు) బహుమతిని, అంతర్జాతీయ మీడియా గుర్తింపు పొందే అవకాశాన్ని పొందుతారు. ఇది వారి ఆవిష్కరణలను వాణిజ్యీకరించుకునేందుకు ఒక పునాదిని అందిస్తుంది.దీని గురించి డైసన్ వ్యవస్థాపకుడు సర్ జేమ్స్ డైసన్ ఇలా అన్నారు: "నేను 20 ఏళ్ల క్రితం జేమ్స్ డైసన్ అవార్డును ప్రారంభించాను. తదుపరి తరం డిజైన్ ఇంజనీర్లకు స్ఫూర్తినిచ్చి మద్దతు ఇవ్వడమే దీని లక్ష్యం. అప్పటి నుంచి మనం చూసిన అద్భుతమైన ఆలోచనలు, ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సమస్యలకు యువత పరిష్కారాలను అందించడంతో పాటు, వైద్యం, పర్యావరణం, మరిన్నింటిలో డిజైన్, ఇంజనీరింగ్ సాంకేతికతను ఉపయోగించడంలో మక్కువ చూపుతున్నారని రుజువు చేస్తున్నాయి. ఈ ఏడాది ఏ ఆవిష్కరణలు ముందుకు వస్తాయో తెలుసుకునేందుకు నేను ఆసక్తిగా వేచి చూస్తున్నాను. వారికి శుభాకాంక్షలు!" అని తెలిపారు.గత విజేతలలో ఇన్సులిన్, ఇతర ద్రవ రూపంలోని ఔషధాలను కావలసిన ఉష్ణోగ్రత వద్ద ఉంచేందుకు రూపొందించిన పోర్టబుల్ కూలింగ్ క్యారియర్ భారతదేశంలో జేమ్స్ డైసన్ అవార్డు 2024 జాతీయ విజేతగా ఎంపికైంది. ఒడిశాకు చెందిన శ్రీమతి కోమల్ పాండా కనుగొన్న నోవోకారీ, యాక్సెసిబిలిటీ, తయారీ సామర్థ్యంలో అంతరాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది, పరికరం అవసరమైన వారికి చేరేలా చూసుకుంటుంది. జేమ్స్ డైసన్ అవార్డు నుంచి గుర్తింపు పొందినప్పటి నుంచి, విభిన్న వాతావరణాలలో ప్రజలకు మందుల నిల్వను మెరుగుపరచాలనే దృక్పథంతో, కోమల్ దానిని మరింత విస్తృతంగా అందుబాటులో ఉంచేందుకు డిజైన్‌ను మరింత మెరుగుపరుస్తున్నారు. అదే విధంగా , తక్కువ అభివృద్ధి ఉన్న ప్రాంతాలలో నవజాత శిశువుల సంరక్షణకు ఫ్లెక్సిబిలిటీని అందించేందుకు తక్కువ ధర, గాలితో నిండిన ఇంక్యుబేటర్. యూకేలోని లౌబరో విశ్వవిద్యాలయం నుంచి ప్రొడక్ట్ డిజైన్ టెక్నాలజీ గ్రాడ్యుయేట్ అయిన జేమ్స్ రాబర్ట్స్ కనుగొన్న 10,000 మందికి పైగా రోగులకు మద్దతు ఇస్తూనే ఉంది. ఉక్రెయిన్ వంటి సంఘర్షణ ప్రాంతాలతో సహా ప్రపంచవ్యాప్తంగా దాని కార్యకలాపాలను విస్తరిస్తూనే ఉంది.అమెరికాలో గత రన్నరప్ అయిన చేతి పరిశుభ్రతకు సంబంధించిన అవగాహన మార్పును కల్పిస్తోంది. పార్సన్స్ స్కూల్ ఆఫ్ డిజైన్ గ్రాడ్యుయేట్లు శుభమ్ ఇస్సార్, అమానత్ ఆనంద్ కనిపెట్టిన సోపెన్ అనేది సబ్బుతో తయారు చేయబడిన రంగురంగుల పెన్ను. ఇది చిన్న పిల్లలకు సరదాగా చేతులు కడుక్కోవడం నేర్పుతుంది.

# చక్కగా నిద్ర పోలేకపోతున్నారా?

## నిజమైన నేరగాడు మీ పడక గదిలోనే దాగి ఉండవచ్చు







**న్యూఢిల్లీ-నవభూమి:**మన బిజీ జీవితాల గందరగోళంలో, నిద్ర తరచుగా వెనుకబడి పోతోంది. అయినప్పటికీ- శారీరకంగా, మానసిక రెండు విధాలుగా అది మన ఆరోగ్యానికి మూలస్తంభం. ప్రపంచ నిద్ర దినోత్సవం సమీపిస్తున్న కొద్దీ, లోతైన, పునరుద్ధరణతో నిద్రను పెంపొందించే వాతావరణాన్ని సృష్టించేందుకు మనం తగినంత ప్రయత్నాలు చేస్తున్నామా లేదా అని అని ఆలోచించేందుకు ఇది సరైన సమయం. డైసన్ గ్లోబల్ కనెక్టెడ్ ఇండోర్ ఎయిర్ క్వాలిటీ డేటా రీసెర్చ్ ప్రకారం, అత్యధిక స్థాయిలో ఇండోర్ వాయు కాలుష్యం - మనలో చాలామంది నిద్ర పోయేందుకు సిద్ధమవుతున్న సమయంలో అంటే, సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి మధ్య సంభవిస్తుంది. భారతదేశంలో సీజన్ మారుతున్న కొద్దీ, పుప్పొడి, గాలిలోని దుమ్ము కణాలు వంటి అలెర్జీ కారకాలు రాత్రి వరకు బాగా ఉంటాయి. నాణ్యమైన నిద్రను దూరం చేసేందుకు అవి దాగి ఉన్న అడ్డంకిగా మారవచ్చు.

**మీరు నిద్రించే చోటు దాగిన నేరగాళ్లు**

ఉతకని దిండు గలీబు కేవలం ఒక వారంలోనే 3 మిలియన్ బ్యాక్టీరియాను పెంచుకుంటుంది- ఇది టాయిలెట్ సీటు కన్నా 17,000 రెట్లు ఎక్కువ కలుషితంగా ఉంటుంది! ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అమెరిస్లీప్ అధ్యయనం నివేదిక ప్రకారం, ఉతకని బెడ్‌షీట్ బాత్రూమ్ డోర్ నాబ్ కన్నా 24,631 రెట్లు ఎక్కువ బ్యాక్టీరియా, వైరస్‌లు, పుప్పొడిని కలిగి ఉంటుంది.

మనం నిద్రలో నాణ్యతను ఎలా పెంచుకోవచ్చు? డైసన్‌లో మైక్రోబయాలజీ లీడ్ రీసెర్చ్ సైంటిస్ట్ జోవాన్ కాంగ్, ఈ నిర్లక్ష్యం చేయబడిన అంశంపై వెలుగునిస్తుంది. పడక గది నుంచి అలెర్జీ కారకాలను తొలగించేందుకు స్థిరంగా శుభ్రపరచడం, వాక్యూమింగ్ ద్వారా పరిశుభ్రమైన బెడ్‌రూమ్ వాతావరణాన్ని సాధించడంలో సహాయపడే చిట్కాలను అందిస్తున్నారు.


పడక సంబంధిత వస్త్రాలను ప్రతి వారం ఉతకండి: వేడి నీటిలో పక్క దుప్పటి, దిండు గలీబులు దుప్పట్లను ఉతుక్కోవడం ద్వారా అలెర్జీ కారకాలను విచ్ఛిన్నం చేసేందుకు, తగ్గించుందకు సహాయపడుతుంది. అలెర్జీ కారకాలను దూరంగా ఉంచేందుకు వారానికి ఒకసారి మీ పరుపును ఉతికి మార్చాలని సిఫార్సు చేస్తోంది.శుభ్రపరచడాన్ని శక్తివంతంగా చేయండి: దుమ్ము కణాలు పరుపులోని లోతైన ఫైబర్‌లకు అతుక్కుపోతాయి. దీనితో వాటిని తేలికగా తొలగించడం సాధ్యం కాదు. డైసన్ కార్డ్‌లెస్ వాక్యూమ్‌లు 240%ాఔ% శక్తివంతమైన సక్షన్‌ను కలిగి ఉంటాయి. హెయిర్ స్క్రూ టూల్‌తో మీ పరుపులో దాగి ఉన్న దుమ్ము కణాలను తొలగిస్తాయి. ఏదైనా అలెర్జీ కారకాలను తొలగించేందుకు దిండ్లు, కుషన్లు, మృదువైన బొమ్మలను వాక్యూమ్ చేయడం మంచి పద్ధతి.

**ప్రతి మూల అంచుకు చేరుకోండి:** మీరు మీ పరుపును లోతుగా శుభ్రం చేసిన తర్వాత, డైసన్ క్రెవిస్ టూల్‌తో అంచుల్లో దాగిన దుమ్మును తొలగించండి. మీ మంచం అల్మారాల కింద శుభ్రం చేసుకోవడం మర్చిపోవద్దు.డైసన్‌లోని డిజైన్ ఇంజనీర్ షాన్ నవరెడ్నామ్ బెడ్‌రూమ్ గాలి నాణ్యతను ఎలా మెరుగుపరచాలనే దానిపై చిట్కాలను పంచుకున్నారు.ఆశ్చర్యకరంగా, శుభ్రపరచడం, వంట చేయడం, కొవ్వొత్తుల వినియోగం వంటి సాధారణ కార్యకలాపాలతోనూ పడక గది కాలుష్య కారకాలకు మూలంగా ఉంటుంది. మనం మన జీవితంలో దాదాపు మూడింట ఒక వంతు నిద్రపోతున్నామని పరిగణనలోకి తీసుకుంటే, గాలి నాణ్యతను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవడం చాలా అవసరం.ఎయిర్ ప్యూరిఫైయర్‌పై పెట్టుబడి పెట్టండి: ఎయిర్ ప్యూరిఫైయర్‌లు దుమ్ము కణాలను సంగ్రహించి నాశనం చేయడం ద్వారా కాలుష్య కారకాలను బహిర్గతం చేయడంలో సహాయపడతాయి, ఇండోర్ గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. డైసన్ ఎయిర్ ప్యూరిఫైయర్ దుమ్ము, పుప్పొడి బ్యాక్టీరియాతో సహా 0.1 మైక్రాన్ల వరకు చిన్న కణాలను 99.95% వరకు తొలగిస్తుంది. దీని అధునాతన వడపోత ఆరోగ్యకరమైన నిద్ర వాతావరణం కోసం శుభ్రమైన గాలిని అందిస్తుంది. ఆస్తమా అలెర్జీ-స్నేహపూర్వక నిద్ర: అలెర్జీ కారకాలు, కాలుష్య కారకాలను తగ్గించడం ద్వారా, డైసన్ ప్యూరిఫైయర్‌లు ఆస్తమా అలెర్జీలకు గురికావడాన్ని తగ్గించడంలో సహాయపడుతూ, శ్రేయస్సుకు మరింత దోహదపడతాయి.

మెరుగైన నిద్రకు ఉష్ణోగ్రత నియంత్రణ: డైసన్ యంత్రాలు వేసవిలో చల్లబరచడం శీతాకాలంలో వేడెక్కడం ద్వారా నిద్ర సౌకర్యాన్ని పెంచుతాయి. ఇవి ఏడాది మొత్తం ఉష్ణ సమతుల్యతను నిర్ధారిస్తాయి.సౌండ్ స్లీప్ కోసం అల్ట్రా-లో నాయిస్: నిశ్శబ్దంగా పని చేసేందుకు రూపొందించిన డైసన్ ప్యూరిఫైయర్ శ్రేణి మీ నిద్రకు భంగం కలిగించకుండా ఉండేలా ధ్వని పరంగా పరీక్షించబడింది. మీరు మెషీన్‌ను నైట్ మోడ్‌లోనూ ఉంచవచ్చు. ఇది మంచి నిద్ర కోసం మరింత నిశ్శబ్దంగా పని చేస్తుంది.

ఈ ప్రపంచ నిద్ర దినోత్సవంలో మీ నిద్రపై నియంత్రణ తెచ్చుకోండి

ఈ ప్రపంచ నిద్ర దినోత్సవంలో, మీ పడక గదిని శుభ్రమైన అలెర్జీ-రహిత విశ్రాంతి అభయారణ్యంగా మార్చడానికి కట్టుబడి ఉండండి. క్రమం తప్పకుండా వాక్యూమింగ్ చేయడం, మీ పరుపును శుభ్రపరుచుకోవడం, సమర్థవంతమైన ఎయిర్ ప్యూరిఫైయర్‌లో పెట్టుబడి పెట్టడం వంటి పద్ధతులను చేర్చడం మీ నిద్ర వాతావరణాన్ని మెరుగుపరచడంలో చాలా దూరం వెళ్లవచ్చు.





# వందే భారత్ స్పీడ్ వేగం ఎందుకు తగ్గుతోంది..?

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను తీసుకువచ్చింది. అత్యాధునిక సౌకర్యాలతో పాటు హైస్పీడ్ రైళ్లను పెద్ద ఎత్తున తీసుకువస్తున్నది. అయితే, ప్రస్తుతం ఈ రైళ్ల వేగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెమీహైస్పీడ్ రైళ్లను గతంలో ప్రకటించిన వేగంతో నడపడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వందే భారత్ రైళ్ల వేగంపై వస్తున్న ప్రశ్నలకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. రైలు వేగం తగ్గడానికి గల కారణాలను వెల్లడించారు. పార్లమెంట్‌లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. హైస్పీడ్ రైలు సగటు వేగం ఎందుకు తక్కువగా ఉందని.. ప్రభుత్వ ప్రణాళిక.. రైలు వేగంతో నడిపేందుకు ఏం చర్యలు తీసుకున్నారు.. పూర్తిస్థాయి వేగంతో నడిపేందుకు ఎంత సమయం పడుతుందని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రైలు వేగం ఇంజిన్‌పై మాత్రమే ఆధారపడి ఉండదని రైల్వే మంత్రి పేర్కొన్నారు. రైలు నడిచే ట్రాక్‌పై సైతం ఆధారపడి ఉంటుందని.. రైల్వేలైన్లను మెరుగుపరిచే పని నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. 2014 సంవత్సరంలో రైళ్లు గంటకు 110 కిలోమీటర్లు.. అంతకంటే ఎక్కువ వేగంతో 31వేలకుపైగా కిలో మీటర్ల ట్రాక్‌లో మాత్రమే నడవగలమని చెప్పారు. ప్రస్తుతం 80వేల కిలోమీటర్లకు పెంచామన్నారు. ప్రస్తుతం అంత పరిధిలో మాత్రమే పూర్తిస్థాయి వేగంతో నడవగలవమన్నారు.

# నిర్మలమ్మ మీరూ తమిళ 'రూ' లోగోనే వాడారు.. స్టాలిన్ స్ట్రాంగ్ కౌంటర్



**చెన్నై- నవభూమి:** తమిళనాడు బడ్జెట్‌లో రూపాయి సింబల్‌ను తొలగించి, తమిళ అక్షరం 'రూ'ను చేర్చడాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ సమర్థించుకున్నారు. అంతేకాదు, గతంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సైతం తమిళ సింబల్‌నే వినియోగించారని పేర్కొన్నారు. తమిళ భాష వాడకాన్ని వ్యతిరేకిస్తున్న వారు ఈ అంశాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. ఈ నిర్ణయం తన భాషా విధానం పట్ల తమిళనాడు నిబద్ధతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) అమలుపై కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బడ్జెట్‌లో రూపాయి సింబల్‌ను డీఎంకే ప్రభుత్వం తొలగించడం తీవ్ర చర్చనీయాంశమైంది.

స్టాలిన్ ప్రభుత్వ తీరుపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు బీజేపీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలకు తమిళనాడు సీఎం స్టాలిన్ తాజాగా కౌంటర్ ఇచ్చారు. "గతంలో ఓ సందర్భంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా ఆంగ్లం '?'కి బదులుగా రూపాయి అర్థాన్ని సూచించే తమిళ 'రూ' అక్షరాన్ని వినియోగించారు... మరి ఇప్పుడు మేము కూడా రూ అనే అక్షరాన్ని ఉపయోగించడం సమంజసమే కదా.. భాషపై ప్రస్తుతం జరుగుతున్న వివాదంలో మా వైఖరిని స్పష్టం చేస్తున్నాం.. మా మాతృభాషను కాపాడుకుంటున్నాం.. భాషపై గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నవారు కేంద్ర మంత్రి చర్యపైనా ఇప్పుడు మాట్లాడండి" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

ఉపాధి హామీ పథకం, విపత్తు, పాఠశాల నిధులు ఇవ్వాలని వందసార్లకు పైగా కోరినా, వాటి గురించి మాట్లాడని నిర్మలా సీతారామన్.. 'రూ' వ్యవహారంపై మాట్లాడారని ధ్వజమెత్తారు. ఏదేమైనా జాతీయ స్థాయిలో తమిళం హిట్, బడ్జెట్ హిట్ అని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు ప్రభుత్వం '?' లోగోను తొలగించడంపై నిర్మలమ్మ తీవ్రంగా మండిపడిన విషయం తెలిసిందే. ఎన్నికైన ప్రజాప్రతినిధులు జాతీయ ఐక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుతామని రాజ్యాంగంపై ప్రమాణం చేస్తారని, కానీ, రూపాయి సింబల్ తొలగింపు ఆ ప్రమాణానికి విరుద్ధమని విమర్శించారు. .డీఎంకే చర్యలు.. దేశ ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని, ప్రాంతీయ అస్థిత్వం పేరుతో వేర్పాటువాద భావాలను ప్రోత్సహించే ప్రమాదకరమైన మనస్తత్వాన్ని సూచిస్తున్నాయని నిర్మలా సీతారామన్ దుయ్యబట్టారు. కాగా, హిందీని తమపై బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడులో అమలు చేయబోమని స్టాలిన్ సర్కారు అంటోంది. అయితే, కేంద్రం మాత్రం ఇవి కేవలం ఆరోపణలు మాత్రమేనని చెబుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం- తమిళనాడు సర్కారు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే తమిళనాడు బడ్జెట్‌లోనూ 'రూ' అక్షరాన్ని చేర్చడంతో వివాదం మరింత ముదిరినట్టయ్యింది. సీఎం నిర్ణయాన్ని తమిళ సంఘాలు స్వాగతించాయి. మాతృభాషను కాపాడుకోవడానికి తీసుకొన్న చర్యగా అభివర్ణించాయి. మరికొందరు మాత్రం జాతీయ చిహ్నాన్ని తక్కువ చేసి చూపించారని విమర్శిస్తున్నారు.

# భారతీయ బాలికలు తప్పుడు అత్యాచార కేసులు పెట్టరని చెప్పలేము..: కేరళ హైకోర్టు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత దేశంలోని అమ్మాయిలు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేయరనే భావన.. ఇటీవల కాలంలో నీరుగారుపోయిందని కేరళ హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అత్యాచారం, లైంగిక వేధింపులు, ఇతర దుష్ప్రవర్తన ఫిర్యాదులు వస్తుండగా.. చాలా శాతం ఎలాంటి ఆధారాలు లేకుండానే వస్తున్నాయని చెప్పింది. అంతేకాకుండా పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ యువకుడిపై కేసును కొట్టివేసింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. 2014 మే 30వ తేదీ నుంచి 2019 ఏప్రిల్ 20వ తేదీ మధ్య కాలంలో పట్టాంబికి చెందిన ఓ యువకుడు తనను పెళ్లి చేసుకుంటానంటూ హామీ ఇచ్చి లైంగింక దోపిడీకి పాల్పడ్డాడంటూ ఓ అమ్మాయి కోర్టుకు వెళ్లింది. అయితే ఈ కేసును విచారించిన కేరళ హైకోర్టు షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా సదరు యువకుడిపై కేసును కొట్టివేస్తూ.. జస్టిస్ ఎ బధరుద్దీన్ ఆశ్చర్యకర కామెంట్లు చేశారు. భారత సమాజంలో ఏ అమ్మాయి కూడా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేయదనే భావన ఇటీవలి సంవత్సరాల్లో నీరుగారిపోయిందని వివరించారు.

వ్యక్తిగత కక్షలతో కొందరు చట్టవిరుద్ధమైన డిమాండ్లు తీర్చుకోవడానికి.. నిందితులపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తూ కోర్టును ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఏ అమ్మాయి కూడా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తప్పుగా ఆరోపణలు చేయదనే నమ్మకంతో... సత్యాన్ని ధ్రువీకరించకుండా తీర్పులు చెప్పకూడదని వెల్లడించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించినప్పుడు.. 2014 మే 30వ తేదీనే నేరం జరిగినప్పటికీ.. కేసును 2019 ఏప్రిల్‌లో నమోదు చేశారని అన్నారు. ఫిర్యాదుదారు మహిళ 2016లో పాలక్కాడ్ లోని మహిళా సెల్‌లో.. సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు. కానీ అతడు ఆమెను వివాహం చేసుకుంటానని మాట ఇవ్వడంతో ఆ కేసును వెనక్కి తీసుకుందని జస్టిస్ ఎ బధరుద్దీన్ వెల్లడించారు. వీరిద్దరి మధ్య బంధంపై వారికి ఏకాభిప్రాయం ఉందని చెప్పారు. అలాంటప్పుడు అతడు లైంగిక దోపిడీకి ఎలా పాల్పడతాడంటూ ప్రశ్నించారు. కావాలనే మహిళ తప్పుడు ఆరోపణలు చేస్తోందంటూ కేసును కొట్టివేశారు.

# భార్యను హత్య చేసి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు భర్త యత్నం



**భోపాల్-నవభూమి:** ఒక వ్యక్తి తన భార్యను కొట్టి చంపాడు. ఆమె మృతదేహాన్ని రోడ్డుపై పడేశాడు. రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించాడు. అయితే దర్యాప్తు చేసిన పోలీసులు అసలుగుట్టును రట్టు చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 12న కాంపు పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని షీట్లా రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో 22 ఏళ్ల మహిళ మరణించినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో అక్కడకు వెళ్లి పరిశీలించారు. ఆమె భర్త ప్రదీప్ గుర్జార్ స్వల్పంగా గాయపడినట్లు గమనించారు. రోడ్డు ప్రమాదంలో భార్య మరణించగా తనకు గాయాలయ్యాయని అతడు చెప్పగా పోలీసులు తొలుత నమ్మారు. కాగా, మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే రోడ్డు ప్రమాదం కాకుండా తీవ్రమైన దాడి వల్ల ఆమె మరణించినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలింది. అలాగే కట్నం కోసం భార్యను ప్రదీప్ వేధిస్తున్నట్లు ఆమె కుటుంబం ఆరోపించింది. మరోవైపు అన్ని ఆధారాలు పరిశీలించిన తర్వాత ప్రదీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడ్ని ప్రశ్నించగా టీవీలో నేర సీరియల్స్ చూసి భార్యను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించినట్లు తెలుసుకున్నారు. ప్రదీప్ కుటుంబ సభ్యులపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అతడి భార్య హత్యలో వారి సహకారంపై దర్యాప్తు చేస్తున్నారు.

# నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది : మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డారు. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ముడి చమురు ధరలు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. ఈ మేరకు పలు మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికలను ఆయన ఉటంకించారు. బీజేపీ ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ వారిని దోచుకుంటుందని మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గట్లేదని విమర్శించారు. మే 2014 నుంచి సుమారు 34 శాతం వరకు ముడి చమురు ధరలు తగ్గాయని చెప్పారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ. 36 లక్షల కోట్ల పన్ను వసూలు చేసిందని ఆరోపించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుందని ఖర్గే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో అమల్లోకి తేనున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాట్లాడుతూ.. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని అన్నారు. దేశ వనరులు, పాలనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం ఉండాలన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడంవల్ల దక్షిణాదిలో ఎంపీ సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని, ఉత్తరాదిలో ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. దాంతో దేశంలో సమన్యాయం లేకుండా పోతుందని వ్యాఖ్యానించారు. అలాంటివి జరగకుండా సామాజిక సమానత్వం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాలని మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు.

# ఒక్క మార్కుతో తలకిందులైన విద్యార్థిని జీవితం..
## అదే ఒక్క ఫోన్‌కాల్‌తో లైఫ్ సెట్.. అసలీ కథేంటంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలని కలలు కంటోంది. అయితే పదో తరగతిలో 400 మార్కులు తెచ్చుకుంటేనే ఇంటర్‌లో సైన్సు గ్రూపు తీసుకోనిస్తామని తల్లిదండ్రులు చెప్పగా.. ఆమె కూడా ఓకే చెప్పింది. కానీ చెప్పినదానికంటే ఒకే ఒక్క మార్కు తక్కువ తెచ్చుకోగా.. తల్లిదండ్రులు ఆర్ట్స్ గ్రూపులో వేశారు. దీంతో సోషల్ మీడియా వేదికగా తన బాధను పంచుకుందీ విద్యార్థిని. ఫలితంగా కేంద్ర మంత్రి ఫోన్ చేసి.. ఆమె జీవితాన్ని మార్చేశాడు. ముఖ్యంగా సైన్సు గ్రూపు తీసుకునేలా చేశాడు. ఆ పూర్తి వివరాలు మీకోసం. బిహార్ దానాపూర్ జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని ఖుష్బూ కుమారి ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే మొదటి నుంచి వైద్యురాలు కావాలని కలలు కంటున్న ఖుష్బూ కుమారికి తల్లిదండ్రులు.. పదో తరగతిలో 500 మార్కులకు గాను 400 మార్కులు తెచ్చుకోవా లని సూచించారు. చెప్పినన్ని మార్కులు సాధిస్తేనే సైన్సు గ్రూపు చదివిస్తామని అన్నారు. ఇందుకు ఆమె కూడా ఓకే చెప్పగా.. బాగానే కష్టపడి చదివింది. కానీ తల్లిదండ్రులకు మాట ఇచ్చినట్లుగా 400 మార్కులు తెచ్చుకోలేకపో యింది.

పదో తరగతిలో చెప్పిన దాని కంటే ఒక్క మార్కు తక్కువగా అంటే 399 మార్కులు సాధించింది. దీంతో తల్లిదండ్రులు ఖుష్బూ కుమారిని బలంవంతంగా ఆర్ట్స్ గ్రూపులో వేశారు. దీంతో ఆమె వైద్యురాలు కావాలన్న కల తలకిందులు అయింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఖుష్బూ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టు పెట్టింది. అందులో తన తల్లిదండ్రులు బలంవంతంగా తనను ఆర్ట్స్ గ్రూపులో వేశారని.. తనకి ఇష్టమైన సైన్సు గ్రూపు చదివి డాక్టర్ కావాలనుకున్నానని చెప్పింది. అంతేకాకుండా తన అక్కలకు నచ్చిన గ్రూపు చదివే వెసులుబాటు కల్పించిన తల్లిదండ్రులు తనను మాత్రమే ఇబ్బంది పెడుతున్నారని వాపోయింది. ఒక విద్యార్థిని జీవితానికి సంబంధించిన విషయం కావడంతో అంతా ఆసక్తిగా వీడియోను చూశారు. ఇలా అతికొద్ది రోజుల్లోనే వీడియో వైరల్‌గా మారింది. అలా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన కంటపడింది. ఖుష్బూ బాధను అర్థం చేసుకున్న మంత్రి ఆ జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి మరీ విద్యార్థిని సైన్సు గ్రూపునకు మార్చేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆపై ఆయనే నేరుగా.. ఖుష్బూకు ఫోన్ చేసి సైన్సు గ్రూపులో చేర్పిస్తానంటూ భరోసా ఇచ్చారు. ఇప్పటికే సైన్స్ విభాగంలో అడ్మిషన్ గురించి దానాపూర్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు కూడా వివరించారు. నచ్చిన సబ్జెక్టు చదువుకునేందుకు.. ప్రధాని మోదీ, సీఎం నితీష్ కుమార్ ప్రభుత్వాలు మీకు అండగా ఉన్నాయని చెప్పారు. అలాగే "నీట్"కు కూడా ప్రిపేర్ కావాలని సూచించారు. మంచి మార్కులు సాధిస్తే కచ్చితంగా డాక్టర్ అవుతారంటూ చెప్పారు. దీంతో ఖుష్బూ తెగ సంబుర పడిపోతుంది.

# ఔరంగజేబు సమాధి వద్ద భద్రత పెంపు.. విజిటర్స్ ఐడీ చూపించాల్సిందే



**ఛత్రపతి సంభాజినగర్:నవభూమి:** మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిపై మహారాష్ట్రలో వివాదం చెలరేగుతున్న విషయం తెలిసిందే. ఆ సమాధిని తొలగించాలని కొన్ని వర్గాల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడ భద్రతను పెంచారు. సమాధిని విజిట్ చేసేవారు కచ్చితంగా తమ ఐడీ కార్డులను చూపించాల్సి ఉంటుంది. ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలోని ఖుల్దాబాద్‌లో ఔరంగజేబు సమాధి ఉన్నది. ఖుల్దాబాద్‌లో ఉన్న ఔరంగజేబు సమాధిని తొలగించాలని కోరుతూ ఇవాళ విశ్వ హిందూ పరిషత్ నేతలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి మెమోరండం కూడా సమర్పించారు. సమాధి ఉన్న ఖుల్దాబాద్ పట్టణంలో మల్టిపుల్ చెక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. స్టేట్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌కు చెందిన 50 పోలీసులు, 30 మంది స్థానిక పోలీసులు పహారా కాస్తున్నారు. వేర్వేరు పాయింట్ల వద్ద 20 మంది హోంగార్డులను మోహరించారు. సమాధి వద్దకు వస్తున్న విజిటర్స్.. రిజిస్టర్‌లో తమ పేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ శాంతి పరిస్థితి ఉందని, రూమర్స్‌ను నమ్మవద్దు అని సమాధి కేర్‌టేకర్ పర్వేజ్ కబీర్ అహ్మద్ తెలిపారు. ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ రావడంతో.. విజిటర్ల సంఖ్య తగ్గిపోయింది. అయితే సాధారణంగా రంజాన్ సమయంలో విజిటర్స్ తక్కువగా ఉంటారు. ప్రతి రోజు వంద మంది పర్యాటకులు వస్తుంటారు. కానీ ఇప్పుడు ఆ సంఖ్య తగ్గింది. సిక్కు గురువు గురు గోబింద్ సింగ్ ఇద్దరు కుమారులు మతం మార్చుకోలేదని వారిని ఔరంగజేబు హతమార్చాడని, మారాఠా వీరుడు ఛత్రపతి సాంబాజీ మహారాజ్‌ను కూడా చిత్రహింసలు పెట్టి చంపారని, ప్రభుత్వానికి అందజేసిన తమ లేఖలో వీహెచ్‌పీ పేర్కొన్నది. కాశీ, మథుర, సోమనాథ్‌లో ఆలయాలను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఔరంగజేబు స్మారకం ఏదైనా.. బాధకు, బానిసత్వానికి సంకేతంగా నిలుస్తుందని, అందుకే ఆ సమాధిని తీసివేయాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. ఒకవేళ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోతే, అప్పుడు తాము ఆ సమాధిని తొలగిస్తామని వీహెచ్‌పీ హెచ్చరించింది.

# వడోదర కారు బీభత్సం నిందితుడు చెప్పినవన్నీ అబద్ధాలే



**న్యూఢిల్లీ-నవభూమి:** వడోదర కారు బీభత్సం ఘటనలో నిందితుడు పోలీసులు ముందు షాకింగ్ కామెంట్లు చేశాడు. ముఖ్యంగా తాను డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మద్యం సేవించలేదని.. హోలికా దహనం కార్యక్రమానికి వెళ్లి వస్తుండగానే ప్రమాదం జరిగినట్లు వివరించాడు. కానీ అతడు చెప్పినవన్నీ అబద్ధాలేనని తెలుస్తోంది. ముఖ్యంగా అతడు ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందే స్నేహితుడికి ఇంటికెళ్లగా.. అక్కడే మద్యం సేవిస్తూ సీసీటీవీ కెమెరా కంట పడ్డాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా అంతా షాక్ అవుతున్నారు. ఆపూర్తి వివారలు మీకోసం. గుజరాత్‌లోని వడోదరలో రెండ్రోజుల క్రితం ఓ కారు బీభత్సం సృష్టించగా.. ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఘటనలో మరో నలుగురు తీవ్రంగా గాయపడగా ప్రస్తుతం వారంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే నిందితుడు రక్షిత్ చౌరాసియా కారు దిగి రచ్చ రచ్చ చేశాడు. అనదర్ రౌండ్, అనదర్ రౌండ్, ఓం నమః శివాయ, ఓం నమః శివాయ, నిఖితా నిఖితా అంటూ గట్టి గట్టిగా కేకలు వేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పటికే నెట్టింట వైరల్ కాగా.. పోలీసులు కూడా నిందితుడిని పట్టుకున్నారు. అయితే విచారణలో రక్షిత్ చౌరాసియా తాను మద్యం సేవించి వాహనం నడపలేదని చప్పాడు. ముఖ్యంగా తాను హోలికా దహనం కార్యక్రమానికి వెళ్లి వస్తుండగా.. రోడ్డుపై ఉన్న గుంత కారణంగానే ప్రమాదం జరిగిందని వెల్లడించాడు. తాను నడుపుతున్న కారును కుడివైపునకు మళ్లించబోతుండగా.. వెనక నుంచి వచ్చిన స్కూటీ తన కారును ఢీకొట్టిందని వెల్లడించాడు. అయితే అతడు చెప్పినవన్నీ అబద్ధాలే అని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు.. రక్షిత్ చౌరాసియా ఎక్కడికి వెళ్లాడు, ఏమేం చేశాడో తెలిసిపోయింది. అందుకు సంబంధించిన సీసీటీవీ వీడియో కూడా విడుదల కాగా.. షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమాదానికి ముందు రక్షిత్ చౌరాసియా తన స్నేహితుడితో కలిసి.. మరో స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డు అయింది. లోపలికి వెళ్లేముందు వీరిద్దరూ మాట్లాడుకుంటూ ఉండగా.. రక్షిత్ చౌరాసియా మద్యం సేవిస్తూ కనిపించాడు. అలాగే ప్రమాద సమయంలో కారులో ఉన్న రక్షిత్ స్నేహితుడు ప్రాంశు ఇంట్లోకి నడుచుకుంటూ వెళ్లాడు. అయితే 45 నిమిషాల పాటు అదే ఇంట్లో గడిపిన వీరిద్దరూ ఆ తర్వాత కారు తీసుకుని బయటకు వెళ్లారు. ముందుగా ప్రాంశు కారు డ్రైవ్ చేసేందుకు వెళ్లగా.. రక్షిత్ చౌరాసియా రాగానే అతడు పక్క సీట్లోకి వెళ్లిపోయాడు. ఆ తర్వాత రక్షిత్ చౌరాసియానే కారు నడుపుతూ వచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన ప్రతీ ఒక్కరూ మద్యం మత్తులో, విపరీతమైన వేగంతో కారు నడిపే బీభత్సం సృష్టించాడని నమ్ముతున్నారు.

# మహిళా విద్యార్థినులను లైంగికంగా వేధించిన ప్రొఫెసర్..



**లక్నో-నవభూమి:** కాలేజీప్రొఫెసర్ పలువురు మహిళా స్టూడెంట్స్‌ను లైంగికంగా వేధించాడు. వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఒక బాధిత మహిళ పోలీసులకు లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. ఆ ప్రొఫెసర్ వికృత చేష్టలకు సంబంధించిన ఫొటోలు, వీడియో క్లిప్స్‌ను పంపింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ కాలేజీ యాజమాన్యం కూడా ఆ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హత్రాస్‌లోని సేథ్ ఫూల్ చంద్ బాగ్లా పీజీ కాలేజీలోని భౌగోళిక విభాగం ప్రొఫెసర్ రజనీష్ కుమార్ పలువురు మహిళా విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. కాగా, మార్చి 13న ప్రొఫెసర్ రజనీష్‌పై పోలీసులకు ఒక అనామక ఫిర్యాదు అందింది. లేడీ స్టూడెంట్స్‌తో ఆ ప్రొఫెసర్ అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వీడియోలు రికార్డ్ చేశాడని బాధిత మహిళ ఆరోపించింది. 'మోదీ ప్రభుత్వం 'బేటీ బచావో బేటీ పఢావో'కు మద్దతు ఇస్తుంది. కానీ, ఆ తర్వాత కూడా ఇలాంటి వ్యక్తులు కుమార్తెలపై క్రూరత్వానికి పాల్పడుతున్నారు. ఈ క్రూరమైన వ్యక్తి నన్ను చాలా బాధపెడుతున్నాడు. కొన్నిసార్లు నేను ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నా. దయచేసి విద్యార్థినులను రక్షించండి. అవమానం కారణంగా ఏ విద్యార్థిని బహిరంగంగా ఫిర్యాదు చేయలేదు. కాబట్టి, దయచేసి ఈ రాక్షసుడిపై కఠిన చర్యలు తీసుకోండి. నాలాంటి చాలా మంది అమ్మాయిలకు న్యాయం చేయండి' అని ఆ లేఖలో వేడుకున్నది. మరోవైపు ఆ ప్రొఫెసర్ గత ఏడాదిన్నరగా విద్యార్థినులపై ఇలాంటి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు బాధిత మహిళ ఆరోపించింది. మహిళా కమిషన్, ఇతర సీనియర్ అధికారులకు లేఖ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించింది. ప్రొఫెసర్ అసభ్యకరమైన చర్యలకు పాల్పడుతున్న ఫొటోలు, వీడియో క్లిప్స్‌ను పోలీసులకు పంపింది. ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, అజ్ఞాత మహిళ ఫిర్యాదుపై పోలీ సులు స్పందించారు. ప్రొఫెసర్ రజనీష్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమో దు చేశారు. అతడి దారుణాలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యా దు చేసిన అజ్ఞాత మహిళ గురించి తెలుసుకునేందుకు ప్రయత్ని స్తున్నారు. కాగా, ప్రొఫెసర్ రజనీ ష్‌పై కాలేజీ యాజమాన్యం కూడా చర్యలు చేపట్టింది. ఆయనపై కేసు నమోదు కావడంతో సస్పెండ్ చేసింది.

# ఇది కదా తెలివంటే.. సైబర్ నేరగాడి నుంచి రివర్స్‌లో డబ్బులు కొట్టేసిన యువకుడు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రేమ పేరుతో కొందరు, మీ పేరిట డ్రగ్స్ పార్సిల్స్ వచ్చాయని మరికొందరు, డిజిటల్ అరెస్టుల పేరుతో ఇంకొందరు అమాయక ప్రజలకు ఫోన్లు చేస్తూ లక్షలు, కోట్లలో డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాగే చేయబోయిన ఓ నేరగాడికే చుక్కలు చూపించాడో యువకుడు. మైనర్ బాలుడిలా నటిస్తూ.. మూడే మూడు ఫోన్ కాల్స్‌తో వారి నుంచే డబ్బులు దొబ్బేశాడు. అలాగే వారి నుంచి డబ్బులు పొందడానికి తాను ఏం కథ చెప్పాడో కూడా వెల్లడించాడు. మరి ఆ స్టోరీ ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందామా.

ఉత్తర ప్రదేశ్‌లోని కన్పూర్‌కు చెందిన భూపేంద్ర సింగ్‌కు సీబీఐ అధికారి పేరిటి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. మా వద్ద నీ అభ్యంతరక వీడియోలు ఉన్నాయని.. ఈ కేసు మూసేయడానికి రూ. 16 వేల రూపాయలు ఇవ్వాలంటూ హెచ్చరించాడు. అయితే ఎలాంటి తప్పు చేయని భూపేంద్ర సింగ్.. ఇదంతా స్కామర్లు చేస్తున్న పనే అని గుర్తించాడు. అలా అని వారిని వదిలేయకుండా.. తిరిగి చుక్కలు చూపించాలనుకున్నాడు. అందుకోసం క్షణాల్లోనే ఓ అద్భుతమైన ప్లాన్ కూడా వేశాడు. ముఖ్యంగా తాను ఓ మైనర్ బాలుడిని అంటూనే.. స్కామర్‌తో ఫోన్ మాట్లాడాడు.

ప్లీజ్ సార్ ఈ వీడియోల గురించి మా అమ్మకు చెప్పొద్దంటూ భూపేంద్ర సింగ్ భయపడిపోయినట్లు నటించాడు. అంతేకాకుండా తన తల్లితో చెప్తే పెద్ద సమస్యలో పడిపోతానంటూ వివరించాడు. దీంతో స్కామర్.. డబ్బులు చెల్లిస్తే ఎవరికీ ఈ విషయం చెప్పనని అన్నాడు. దీంతో భూపేంద్ర కథలు చెప్పడం మొదలు పెట్టాడు. తనకు డబ్బులు అవసరం ఉండి.. తన వద్ద ఉన్న బంగారు గొలుసును తాకట్టు పెట్టానని.. దాన్ని విడిపించడానికి 3 వేల రూపాయలు కావాలని చెప్పాడు. మీరు ఆ డబ్బులు ఇస్తే ఆ చైన్ అమ్మేసి డబ్బులు చెల్లిస్తానని హామీ ఇచ్చాడు.

అది నమ్మిన సైబర్ నేరగాడు ముందుగా భూపేంద్ర సింగ్‌కు 3 వేల రూపాయలు పంపాడు. ఆ తర్వాత రోజు మళ్లీ స్కామర్ ఫోన్ చేయగా.. భూపేంద్ర సింగ్ మరో కథ చెప్పాడు. తాను మైనర్ కావడం వల్ల నగల వ్యాపారి ఆ గొలుసును తాకట్టు నుంచి ఇవ్వడం లేదని.. వివరించాడు. అంతటితో ఆగకుండా మీరే నా తండ్రిలా మాట్లాడితే అతడు గొలుసు ఇస్తాడని అన్నాడు. దీంతో కేటుగాడు అలాగే మాట్లాడతానని చెప్పగా.. భూపేంద్ర సింగ్ తన స్నేహితుడితో నగల వ్యాపారిలా ఫోన్ మాట్లాడించాడు. ఈక్రమంలోనే మిత్రుడు 4,480 రూపాయలు ఇస్తే దాన్ని తిరగిస్తానని వివరించాడు. అవి చెల్లించాక మళ్లీ ఫోన్ చేస్తే.. ప్రాసెస్ ఫీజు కింద మరో 3 వేలు ఇవ్వాలని.. ఆ గొలుసుపై రూ. 1.10 లక్షల రుణం ఇస్తానని చెప్పాడు. ఇలా సైబర్ నేరగాడు మొత్తంగా 10 వేల రూపాయలు చెల్లించాడు. కానీ భూపేంద్ర సింగ్ మాత్రం అతడికి ఎలాంటి డబ్బులు పంపలేదు. ఫోన్ చేసిన ప్రతీ సారి ఇలాగే కథలు చెప్తుండగా.. తాను మోసపోయినట్లు గుర్తించాడు స్కామర్. ఆపై తన డబ్బులు తిరిగి ఇవ్వమంటూ బతిమాలడం ప్రారంభించాడు. కానీ భూపేంద్ర సింగ్ మాత్రం డబ్బులు ఇచ్చేది లేదని తెగేసి చెప్పి నేరుగా పోలీసుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అయితే స్కామర్ నుంచి తీసుకున్న 10 వేల రూపాయలను తాను విరాళంగా ఇస్తానని భూపేంద్ర సింగ్ వెల్లడించాడు. ప్రజలు కూడా సైబర్ నేరగాళ్లకు భయపడొద్దని.. ఎవరైనా ఫోన్లు చేస్తే ఇలాగే తిరిగి ఆడుకోవాలని వివరించాడు. అది సాధ్యం కాకపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని వివరించారు.

# 45% మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని మొత్తం ఎమ్మెల్యేల్లో 45 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) తాజా నివేదిక వెల్లడించింది. 28 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 4,123 మంది ఎమ్మెల్యేలలో 4,092 మంది అఫిడవిట్లను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది. బీజేపీకి మొత్తం 1,653 మంది ఎమ్మెల్యేలుండగా, అందులో 638 మందికి క్రిమినల్ కేసులున్నాయి. కాంగ్రెస్‌కు 339 మందికి, టీడీపీకి 115 మందికి, డీఎంకె 98 మందికి, టీఎంసీ 95 మందికి కేసులున్నాయి.


# ఆమిర్‌తో రిలేషన్‌షిప్‌పై స్పందించిన గౌరీ స్ప్రాట్.. ఇంతకీ ఏమన్నదంటే..?



బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమిర్ ఖాన్‌ముచ్చటగా మూడోసారి ప్రేమలో పడిన విషయం తెలిసిందే. బెంగళూరు )కు చెందిన గౌరీ స్ప్రాట్ అనే మహిళతో కొన్నాళ్లుగా డేటింగ్‌లో ఉన్నా డు. ఇటీవలే తన 60వ పుట్టినరోజు సందర్భంగా మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించిన ఆమిర్.. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించాడు. ఈ క్రమంలో ఈ ప్రేమ జంట తాజాగా మరోసారి మీడియాతో ముచ్చటించింది. ఈ సందర్భంగా ఆమిర్‌తో రిలేషన్ షిప్‌పై గౌరీ స్ప్రాట్ తొలిసారి స్పందించింది. తనకు లైఫ్ పార్ట్‌నర్‌గా ఆమిర్‌నే ఎందుకు ఎంచుకుందో వివరించింది. దయగల వ్యక్తి, జెంటిల్‌మెన్, తన పట్ల శ్రద్ధ వహించే వ్యక్తిని భాగస్వామిగా కోరుకున్నట్లు వివరించింది. ఆ క్వాలిటీస్ అన్నీ ఆమిర్‌లో గుర్తించినట్లు చెప్పింది. అందుకే తన లైఫ్ పార్ట్‌నర్‌గా అతడిని ఎంచుకున్నట్లు వెల్లడించింది. ఇక ఆమిర్ కూడా గౌరీని ఎంచుకోవడానికి గల కారణాన్ని వివరించాడు. 'నేను ప్రశాంతంగా ఉండగలిగే, నాకు శాంతిని ఇచ్చే వ్యక్తి కోసం వెతుకుతున్నాను. ఆమె గౌరీనే అని అనిపించింది' అంటూ చెప్పుకొచ్చాడు. 1986లో రీనా దత్తాను పెళ్లి చేసుకున్న ఆమిర్.. 2002లో విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత బాలీవుడ్ మహిళా డైరెక్టర్ కిరణ్ రావుతో ప్రేమలో పడి.. 2005లో పెళ్లిపీటలెక్కాడు. ఈ జంట కూడా 2021లో విడిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం గౌరీతో డేటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం తన ఆరేళ్ల కొడుకుతో కలిసి గౌరీ బెంగళూరులోనే ఉంటున్నది. ఈమె తల్లి కూడా సెలెబ్రిటీ స్టయిలిస్ట్. వీరికి బెంగళూరు, ముంబయి నగరాల్లో సెలూన్లు ఉన్నాయి.



# ఐకాన్ స్టార్‌ని బాలీవుడ్‌కి అలా ఎక్కించారు!



ఓ సూపర్ స్టార్. అక్కడ స్టార్ హీరోల రేంజ్‌ని సైతం మించిన నటుడిగా మారిపోయాడు. దీంతో బన్నీతో బాలీవుడ్ దర్శక, నిర్మాతలు సినిమాలు చేయడానికి క్యూలో ఉన్నారు. బన్నీ ఒకే చెప్పాలే గానీ బడా నిర్మాణ సంస్థలు బాలీవుడ్ కి ఎగరేసుకుపోవాలని చూస్తున్నారు. టాలీవుడ్ నటుల పరంగా చూసినా నార్త్ లో నెంబవర్ వన్? ఎవరంటే బన్నీ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే బన్నీ బాలీవుడ్ ఇమేజ్ కి బీజం ఇప్పుడు పడింది కాదు. కొన్నేళ్ల క్రితమే బీజం వేసారు. అల్లు అర్జున్ హీరోగా నటించిన తొలి చిత్రం . ఆ సినిమా అప్పట్లోనే హిందీలోకి డబ్బింగ్ చేసి వదిలారు. ఆ తర్వాత బన్నీ నటించిన కొన్ని క్లాసిక్ లవ్ స్టోరీలను కూడా అనువాద రూపంలో బాలీవుడ్‌కి తీసుకెళ్లారు. అలా బన్నీకి బాలీవుడ్ లో బీజం పడింది. అటుపై బన్నీ నటించిన సరైనోడు నార్త్ యూట్యూబ్ ఛానల్స్ లో పెద్ద సంచలనమైంది. 'సరైనోడు' హిందీ వెర్షన్ యూట్యూబ్‌లో 300 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించి రికార్డు సృష్టించింది. 300 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించిన మొదటి భారతీయ చిత్రం ఇదే. ఇప్పటి వరకూ మరే తెలుగు చిత్రం ఆ రికార్డును చేధించలేదు. ఇలా బన్నీ హిందీ మార్కెట్ ను చాప కింద నీరులా చుట్టాడు. 'పుష్ప', 'పుష్ప 2' తో మరింత సంచలనమయ్యాడు.

'పుష్ప' విజయంతో బాలీవుడ్ లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఓ బ్రాండ్ గా మారిన సంగతి తెలిసిందే. ఒక్క బాలీవుడ్ నుంచే వందల కోట్ల వసూళ్లను కొల్లగొట్టింది. కంటెంట్ సహా బన్నీ మాస్ అప్పిరియన్స్ తోనే ఇది సాధ్యమైంది. అలా బాలీవుడ్ లో ఐకాన్ స్టార్ అంటే అక్కడి వ్వుడు

# సెంటిమెంట్ కలిసొస్తుందా?



సెంటిమెంట్ కలిసొస్తుందా? క్వాంటిటీ కన్నా.. క్వాలిటీకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నది మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. దీనివల్ల సినిమాల సంఖ్య తగ్గుతున్నా.. మంచి పాత్రలు ఆమె పరమవుతున్నాయి. రీసెంట్‌గా 'రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్'లో అద్భుతమైన పాత్రలో కనిపించి యూత్‌ని ఓరేంజ్‌లో ఆకట్టుకున్నది అనుపమ.

క్వాంటిటీ కన్నా.. క్వాలిటీకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నది మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. దీనివల్ల సినిమాల సంఖ్య తగ్గుతున్నా.. మంచి పాత్రలు ఆమె పరమవుతున్నాయి. రీసెంట్‌గా 'రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్'లో అద్భుతమెన పాత్రలో కనిపించి యూత్‌ని ఓరేంజ్‌లో ఆకట్టుకున్నది అనుపమ. ఇదిలావుంటే.. ఇటీవలే ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఈ అందాలభామ పచ్చజెండా ఊపేసిందట. ఆ వివరాల్లోకెళ్తే.. శర్వానంద్ కథానాయకుడి గా సంపత్‌నంది ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఆ సినిమాలో కథానాయికగా అనుపమ పరమేశ్వరన్ ఎంపికైంది. ఇటీవలే అనుపమకు దర్శకుడు సంపత్‌నంది కథ కూడా వినిపించారట, తన పాత్ర బాగా నచ్చడంతో అనుపమ ఓకే చెప్పేసిందట. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ కలిసి నటించిన 'శతమానం భవతి' సినిమా ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. మళ్లీ ఇన్నాళ్లకు ఈ జంట కలిసి నటిస్తున్నారు. దీనివల్ల సినిమాపై పాజిటీవ్ వైబ్ క్రియేటవ్వడం ఖాయం.

# అర్జున్ సన్నాఫ్ వైజయంతి టీజర్..

## విజయశాంతి వ్యాఖ్యలు..



కల్యాణ్ రామ్ విజయశాంతి కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సోమవారం ఈ సినిమా టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణ్‌రామ్, విజయశాంతి సినిమాకు సంబంధి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. విజయశాంతి మాట్లాడుతూ.. "ఈ స్టోరీ వినగానే ఏదో తెలియని అనుభూతి. ఎలాగైనా చేయాలనిపించింది. కల్యాణ్‌రామ్.. అన్ని విషయాలను దగ్గరుండి చూసుకున్నారు. సినిమా పూర్తయిపోయింది. ఇకపై మీ అందరినీ మిస్ అవుతుంటా. వీలున్నప్పుడల్లా కలుద్దాం. ఈ సినిమాను ఆదరించాల్సిన బాధ్యత ఇక మీ చేతుల్లోనే ఉంది. ఇందులో నేను యాక్షన్ సీన్స్ కూడా చేశా. నా అభిమానులకు తప్పకుండా నచ్చుతుంది. యాక్షన్ సీన్స్ అని చెప్పగానే కాస్త సవాలుగా అనిపించింది. షూట్ రోజు సెట్‌లో ఉన్న వాళ్లందరూ ఎంతో కంగారుపడ్డారు. కానీ, తొలి షాట్‌లోనే సీన్ పూర్తిచేశా. అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ విజయశాంతినే. అదే పౌరుషం.. అదే రోషం.. తగ్గేదే లే. ఎంత వయసు వచ్చినా అంతే స్ట్రాంగ్, క్రమశిక్షణతో ఉంటాను. నా తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచడం వల్లే మీ అందరి ఆశీస్సులు పొంది ఈ స్థాయికి వచ్చా" అని విజయశాంతి అన్నారు. "విజయశాంతితో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఆమెను నేను అమ్మ అనే పిలు స్తాను. చిన్నప్పుడు 'సూర్య ఐపీఎస్' షూట్‌కు వెళాను. ఆ సమయంలో ఆమె నన్ను సొం త బిడ్డలా చూసుకున్నారు. ఇక సినిమా విషయానికొస్తే కర్తవ్యం'లో వైజయంతి పాత్రకు కొడుకు ఉంటే ఎలా ఉంటుందో అదే ఈ సినిమా. ప్రదీప్ ఈ కథతో నావద్దకు వచ్చినప్పుడు 'అమ్మ అంగీకరిస్తారా?' అని అడిగా. అమ్మ అంగీకరిం చకుండా చేయడం కరెక్ట్ కాదేమోననిపించింది. ఈ సినిమాకు బిగ్గెస్ట్ పిల్లర్ అమ్మ. ఈ వయసులోనూ ఆమె ఎలాంటి డూప్స్ లేకుండా స్టంట్స్ అద్భుతంగా చేశారు. ఈ సినిమాలో పృథ్వీ చాలా ముఖ్యమైన పాత్ర చేశారు. 'యానిమల్'తో తనకు బాలీవుడ్‌లో ఎంత గుర్తింపు వచ్చిందో తెలుగులో ఈ సినిమాతో వస్తుందని నమ్మి చేశా రు. డబ్బింగ్ కూడా చెప్పారు. నేను నటించిన 'అతనొక్కడే' విడుదలై 20 ఏళ్లు అయినా ప్రేక్షకులకు గుర్తుంది. అదే విధంగా ఈ సినిమా కూడా ఇరవై ఏళ్ల పాటు గుర్తుంటుంది" అని కల్యాణ్ రామ్ అన్నారు.

# కొల్లగొట్టినాదిరో హుక్ స్టెప్ ఛాలెంజ్ చేసిన నిధి




పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా సినిమా హరిహర వీరమల్లు. ఏఎం రత్నం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాను మే 9న రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. పాన్ ఇండియా లెవెల్ లో రూపొందుతున్న సినిమా కావడంతో వీరమల్లుకు ఇప్పటినుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్ర యూనిట్. ఇప్పటికే వీరమల్లు నుంచి రెండు పాటలు రిలీజవగా అందులో రీసెంట్ గా నిధి అగర్వాల్ తో ఉన్న కొల్ల గొట్టినాదిరో సాంగ్ కూడా ఒకటి. మెలోడీగా సాగిన ఈ సాంగ్ కు మంచి రెస్పాన్స్ రాగా ఇప్పుడు చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను డిఫరెంట్ గా ప్లాన్ చేసింది. కొల్లగొట్టినాదిరో సాంగ్ లోని హుక్ స్టెప్ ను స్పెషల్ గా రిలీజ్ చేసి ఆ సాంగ్ కు రీల్స్ చేయమని ఆడియన్స్ ను కోరారు. రొమాంటిక్ మెలోడీగా వచ్చిన ఈ సాంగ్ లో పవన్ తనదైన స్టెప్పులేసి ఆడియన్స్ ను అలరించగా, నిధి ఈ సాంగ్ లో ఎంతో రాయల్ లుక్ లో కనిపించింది. ఇప్పుడు తాజాగా హీరోయిన్ నిధి అగర్వాల్ తనకు ఈ పాట చాలా బాగా నచ్చిందని, ఓ రీల్ చేసి నెటిజన్లను కూడా చేయమని ఛాలెంజ్ చేసింది. మీ డ్యాన్స్ మూమెంట్స్‌ను మాకు చూపించండంటూ తను చేసిన రీల్ ను పోస్ట్ చేస్తూ కోరింది నిధి. నిధి చేసిన ఈ ఛాలెంజ్ ను ఆడియన్స్ ఏ మేరకు స్వీకరిస్తారో చూడాలి. ఎం. ఎం కీరవాణి సంగీతంలో వచ్చిన ఈ పాట ఇప్పటికే ఆడియన్స్ కు బాగా నచ్చేసింది. ఏఎం రత్నం నిర్మిస్తున్న ఈ సినిమా ఎప్పుడో రిలీజవాల్సింది కానీ ఎప్పటికప్పుడు షూటింగ్ లేటవుతూ వస్తుండటం వల్ల మూవీ రిలీజ్ లేటయింది. ఈ సినిమాకు ముందుగా క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించాడు. కానీ ఇప్పుడు ఆయన ప్రాజెక్టు నుంచి తప్పుకోవడంతో ఆ ప్లేస్ లోకి ఏఎం రత్నం కొడుకు జ్యోతికృష్ణ వచ్చాడు.

# ఫ్యామిలీ ఉండాల్సిందే!




**బెంగుళూరు-నవభూమి** ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా వైఫల్యం తర్వాత ఆటగాళ్లపై బీసీసీఐ కఠిన ఆంక్షలను అమలు చేస్తోంది. ఇందులో ప్లేయర్స్ వెంట కుటుంబ సభ్యుల బసపై పరిమితి కూడా ఉంది. 45 రోజులకుపైగా విదేశీ పర్యటన ఉంటే కుటుంబ సభ్యులు కేవలం రెండు వారాలపాటు మాత్రమే ఉండేందుకు అనుమతిస్తారు. అయితే ఈ నిర్ణయంపై విరాట్ కోహ్లీ అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'మైదానంలో కఠిన పరిస్థితులు ఏర్పడినప్పుడు కుటుంబసభ్యులతో గడిపితే సాంత్వనగా ఉంటుంది. అలాంటి వేళ వారి మద్దతు అవసరమే. ఏ క్రికెటర్‌ను అడిగినా ఇదే చెబుతాడు. మ్యాచ్ ఆడాక రూమ్‌కి వెళ్లి ఒంటరిగా, ఎవరితోనూ మాట్లాడకుండా ఉండలేను. క్రికెట్ ఆడడం మా బాధ్యత. అదయ్యాకే కుటుంబం గురించి ఆలోచిస్తాం. నేనైతే ఫ్యామిలీతో ఎంజాయ్ చేసే సమయాన్ని వదులుకోను' అని విరాట్ తేల్చాడు. తిండిపై చర్చ ఎందుకు?: తన వ్యక్తిగత విషయాలపై బ్రాడ్‌కాస్టర్లు చర్చించాల్సిన అవసరం లేదని కోహ్లీ స్పష్టం చేశాడు. "బ్రాడ్‌కాస్ట్ షోలో క్రికెట్ గురించే మాట్లాడుకోవాలి కానీ 'విరాట్ నిన్న లంచ్‌లో ఏం తిన్నాడు? అతడికిష్టమైన ఛోలే భటూరే ఢిల్లీలో ఎక్కడ దొరుకుతుందనే విషయాలపై చర్చ అనవసరమ"ని కోహ్లీ సూచించాడు.

# రాయల్ చాలెంజర్స్ బెంగళూరు టైటిల్ వేటలో..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్ 2025 కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ సన్నాహాలు ప్రారంభించాడు. ఈ నెల 22 నుంచి ఐపీఎల్ సీజన్ మొదలవనున్నది. తొలి మ్యాచ్ ఆర్‌సీబీ, డిపెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరుగనున్నది. మొదటి మ్యాచ్‌కు ముందు, కోహ్లీ సన్నాహాలు చేసి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. కోహ్లీ నెట్స్‌లో త్రోడౌన్ స్పెషలిస్ట్‌తో ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆర్‌సీబీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ టైటిల్ సాధించడంలో విరాట్ కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లోనూ అదే ఫామ్‌ను కొనసాగించాలని చూస్తున్నాడు. చాంపియన్స్ ట్రోఫీ తర్వాత కొద్దిరోజుల పాటు విరామం తీసుకొని.. ఆలస్యంగా ఆర్‌సీబీ జట్టుతో చేరాడు. ఆర్‌సీబీ ఈ సారి రజత్ పాటిదార్ నాయకత్వంలో ఆడనున్నది. ఫ్రాంచైజీ ఈ సారైనా టైటిల్‌ను సాధించాలన్న కసితో ఉన్నది. చాంపియన్స్ ట్రోఫీలో విరాట్ ఐదు మ్యాచ్‌ల్లో 54.50 సగటుతో 218 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, మరో హాఫ్ సెంచరీ చేశాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో రాణించలేకపోయాడు. పాకిస్తాన్‌పై అజేయ సెంచరీ చేసి భారత్‌కు విజయాన్ని అందించాడు.

# ఆస్ట్రేలియన్ జీపీ విజేత నోరిస్



**మెల్‌బోర్న్-నవభూమి:** వరల్డ్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కు ఝలక్ ఇచ్చిన మెక్‌లారెన్ ఎఫ్1 డ్రైవర్ లాండో నోరిస్ ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రీ విజేతగా నిలిచాడు. వర్షంతోపాటు నాటకీయ పరిణామాలు చోటు చేసుకొన్న రేసులో పోల్‌పొజిషన్ నుంచి ఫైనల్ రేసును ఆరంభించిన నోరిస్ కేవలం 0.895 సెకన్ల తేడాతో రెడ్‌బుల్‌కు చెందిన వెర్‌స్టాపెన్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ మూడోస్థానం దక్కించుకొన్నాడు. కాగా, ఫెరారీ తరఫున తొలిసారి బరిలోకి దిగిన ఏడుసార్లు చాంపియన్ లూయిస్ హామిల్టన్ 10వ స్థానంలో నిలిచాడు. ఫెరారీ టీమ్ వ్యూహాత్మక తప్పిదాలతో రేస్‌ను ఓడాల్సి వచ్చిందని హామిల్టన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**